

అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



లోపలి పేజీల్లో

ఆపరేషన్ సిందూర్‌పై భారత ప్రభుత్వ విఫల దౌత్యం

కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైన కామ్రేడ్ సుగుణ

ఇరాన్ యురేనియం శుద్ధి యంత్రాలు, హెలికాప్టర్లు ధ్వంసం



సంపుటి 08, సంచిక: 199 | గురువారం | 19 -06-2025 | కరీంనగర్   Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar   పేజీలు: 12+8 | వెల రూ. 5.00




'ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకు సూచన చేస్తున్నా... కేంద్రంలో పలుకుబడి ఉందని ప్రాజెక్టులు పూర్తవుతాయనుకుంటే మీ భ్రమ. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు మా ప్రణాళిక మాకుంది. చంద్రబాబు, కెసిఆర్ చెప్పారని కాదు. గోదావరి బేసిన్‌లో 3వేల టిఎంసిలు మిగులు జలాలు ఉన్నాయని మీరు నమ్మితే 968 టిఎంసిలు వాడుకునేందుకు తెలంగాణకు సంపూర్ణ అనుమతులు ఇచ్చాకే మీరు మిగులు జలాలు తీసుకోండి'

– సిఎం రేవంత్‌రెడ్డి

# బనకచర్లకు కెసిఆరే కారణం

## వృథాగా 3వేల టిఎంసిలు గోదావరి నీరు సముద్రంలో కలుస్తాయ్ అన్నందునే ఆ ప్రాజెక్టు పుట్టుకొచ్చింది

- మోదీ అనుమతి తెచ్చుకున్నా చంద్రబాబు కట్టలేడు
- ప్రాజెక్టును అడ్డుకునేందుకు రాజకీయ, న్యాయ పోరాటం చేస్తాం
- పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/ హైదరాబాద్

''2019 అక్టోబరులో అప్పటి తెలంగాణ సిఎం కెసిఆర్, ఎపి జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించడంపై చర్చించుకున్నారు. తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే అంకురార్పణ జరిగింది. తెలంగాణకు కృష్ణాలో 299 టిఎంసిలు సరిపోతాయని ఆనాడు కెసిఆర్ ఒప్పుకుని సంతకం చేశారు. ఆనాడు కెసిఆర్ చేసిన సంతకం నేడు తెలంగాణకు ప్రతిబంధకంగా మారింది. మాజీ సిఎం కెసిఆర్ తెలంగాణకు చేసిన తీరని ద్రోహం వల్లే ఎపికి నీళ్లు వెళుతున్నాయి. ఈ పాపానికి కారకుడు హరీష్‌రావు, అప్పటి సిఎం కెసిఆరే. పాపాల భైరవులు వారిద్దరే. కాంట్రాక్టర్ పెట్టిన సమావేశంలో కమీషన్లకు కక్కుర్తి పడి హరీష్‌రావు, కెసిఆర్ కుట్రలు చేశారు. ఇప్పుడు వారు అధికారంలో లేరని ఆ బురదను కాంగ్రెస్ పభుత్వంపై చల్లాలని చూస్తున్నారు. శిక్షించాల్సి వస్తే కెసిఆర్‌నే శిక్షించాలి. కెసిఆర్‌ను ఉరి తీయాలి'' అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు విషయంపై అఖిలపక్ష ఎంపిలతో సమావేశం అనంతరం సిఎం మీడియాతో మాట్లాడారు. బనకచర్లను అడ్డుకునేందుకు రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. 'రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేదిలేదు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించాం. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారం. ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యం. గోదావరి బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించాం. అన్ని పార్టీలను కలుపుకుని పోరాడుతాం. గోదావరి బనకచర్లపై అవసరమైతే తరువాయి 2లో

### 2016లోనే ఆ ఆలోచన పుట్టింది..

గోదావరికి సంబంధించి 3 వేల టిఎంసిల వరద జలాలు సముద్రంలో కలుస్తున్నాయంటూ ఆనాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కనిపెట్టారని, 2016 సెప్టెంబర్ 21లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించడంతోనే బనకచర్ల ప్రాజెక్టు అనే ఆలోచన పుట్టిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు కోసం తెలంగాణను పణంగా పెట్టిన కెసిఆర్, ఇప్పుడు బనక చర్ల ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికీ అన్యాయం జరుగుతోందంటూ తమపై బురద జల్లుతున్నారని అఖిలపక్ష సమావేశానికి సిఎం వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యం అని, సాగునీటి అంశంలో రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరగనివ్వబోమన్నారు. బనకచర్లను అడ్డుకొని తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఎంపిలకు సిఎం విజ్ఞప్తి చేశారు.

**రాజకీయ లబ్ధికి కాంగ్రెస్ యత్నం : రవిచంద్ర వాకౌట్**

ఇదేక్రమంలో బనక చర్ల ప్రాజెక్టు అంశానికీ సంబంధించి అప్పటి అపెక్స్ కమిటీ మినిట్స్‌ను సిఎం రేవంత్‌రెడ్డి వివరిస్తుండగా బిఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర జోక్యం చేసుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సిఎం స్పందిస్తూ తాను ఎవరినీ కించపర్చేవిధంగా మాట్లాడడం లేదని, ఆనాటి అపెక్స్ కమిటీ సమావేశం మినిట్స్‌ను మాత్రమే ఉటంకిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని రవిచంద్ర సమావేశం నుంచి వాకౌట్ చేశారు. వాస్తవాలు బయటికి రావడంతో రవిచంద్రకు ఇబ్బంది కలిగి ఉంటుందని, అందుకే ఆయన వెళ్లిపోయారని సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



భారత్–పాకిస్థాన్ మధ్య

# మధ్యవర్తి జోక్యం లేకుండా సైనికచర్య ఆపేశాం

- కశ్మీరు సమస్యపై మూడోపక్షం జోక్యం ఒప్పుకోం
- ఈ పరిణామాల్లో ఎక్కడా వాణిజ్య ప్రసక్తి రాలేదు
- ఫోన్ సంభాషణలో ట్రంప్‌కు స్పష్టం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ
- ట్రంప్ మళ్లీ అదే పాట

**కననిస్కిస్ :** ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్–పాకిస్థాన్ దేశాలు నాలుగురోజులపాటు జరిగిన సైనిక చర్యలను మధ్యవర్తిజోక్యం లేకుండా ముఖాముఖీ సంప్రదింపుల ద్వారానే స్తంభింపజేశాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. అదేవిధంగా కశ్మీర సమస్య విషయంలో భారత్–పాకిస్థాన్ మధ్య తృతీయపక్షం జోక్యాన్ని అంగీకరించబోమని ట్రంప్‌కు మోదీ స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో ఈ సమస్యను ద్వైపాక్షికంగా ముఖాముఖీగా పరిష్కరించుకోవడానికే భారత్ మొదటినుండీ కట్టుబడి ఉందని తెలియజేశారు. కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జి–7 సదస్సులో పాల్గొనేందుకు వెళ్ళిన నరేంద్రమోదీ మంగళవారంనాడు ట్రంప్‌తో దాదాపు 35 నిమిషాలపాటు ఫోన్ సంభాసణ చేశారు. మధ్యప్రాచ్య పరిణామాల నేపథ్యంలో జాతీయ భద్రతామండలి సమావేశంలో పాల్గొనేందుకు ఒకరోజు ముందుగానే ట్రంప్ కననిస్కిస్ నుండి అమెరికాకు వెళ్ళిపోయారు. దీంతో మోదీ–ట్రంప్ ముఖాముఖీ కలుసుకుని చర్చించుకునే అవకాశం లేకపోయింది. ఈ కారణంగా తర్వాత మోదీ ఆయనతో ఫోన్ సంభాషణ చేశారని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి బుధవారంనాడు ఒక ప్రకటనలో తెలియజేశారు. మే 7–10 తేదీలలో పాకిస్థాన్–భారత్ మధ్య జరిగిన పరిణామాలే వారిద్దరిమధ్య తరువాయి 12లో

# గోదావరి–బనకచర్లతో రాష్ట్రానికి పెద్ద దెబ్బ



- ఎపి ప్రభుత్వం రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తోంది
- బనకచర్లపై పూర్తిస్థాయి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తాం

**నేడు ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిని ముఖ్యమంత్రి, నేను కలుస్తాం**

- అఖిలపక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హాజరైన కాంగ్రెస్, బిజెపి, ఎంఐఎం, బిఆర్‌ఎస్ ఎంపిలు

బనకచర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్రం తరపున పూర్తి స్థాయి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తున్నామని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సిఎం, తాను గురువారం ఢిల్లీకి వెళ్లి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యంతరాలను వ్యక్తం చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించనున్న 'గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం అఖిలపక్ష ఎంపిలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గోదావరి–బనకచర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించిన విషయంలో ప్రభుత్వ పరంగా తీసుకున్న చర్యలు, తాజా పరిస్థితులను ఎంపిలకు వివరించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిజెపి ఎంపిలు డి.కె.అరుణ, రఘునందన్‌రావు, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి, బిఆర్‌ఎస్ ఎంపి వద్దీరాజు రవిచంద్ర, కాంగ్రెస్ ఎంపిలు మల్లురవి, రేణుకాచౌదరి, రఘువీరారెడ్డి, బలరామ్‌నాయక్, రఘురాంరెడ్డి, కిరణ్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షట్కర్‌తో పాటు నీటిపారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోదావరి నది ఎక్కడ ప్రారంభమైతుందని..?, ప్రాజెక్టులు, వాటి సమగ్ర వివరాలు తదితర అంశాలపైన గోదావరి రివర్ బేసిన్ డిప్యూటీ డైరక్టర్ సుబ్రమణ్య ప్రసాద్ తరువాయి 2లో

నీటి ప్రాజెక్ట్‌లపై

# త్వరలోనే బిఆర్‌ఎస్ కీలక సమావేశం

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- కాళేశ్వరంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వంతో రాష్ట్రానికి తీరని నష్టం
- ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంపై చర్చించేందుకు బిఆర్‌ఎస్ అధ్యక్షులు కెసిఆర్ సారథ్యంలో త్వరలోనే కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు తెలిపారు. బిఆర్‌ఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం, రైతు వ్యతిరేక వైఖరిపై తదితర అంశాలపైన ప్రధానంగా చర్చిస్తామని కెటిఆర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కన బెట్టడంతో పాటు 2 పిల్లర్లు కృంగిన సాకుతో మొత్తం కాళేశ్వరం తరువాయి 2లో

కెసిఆర్ దత్తత గ్రామ బాధితులకు

## ప్రభుత్వం అండగా నిలుస్తుంది

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



03

# డిజిటల్ భద్రతే జిఎస్ఇసి లక్ష్యం

- గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పనిచేస్తుంది
- పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం
- 2047 నాటికి రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా చేస్తాం
- జిఎస్ఇసి ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రతను పెంపొందించే లక్ష్యంగా ''గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ (జిఎస్ఇసి)'' హైదరాబాద్‌లో ఏర్పాటు కావడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.హైదరాబాద్ నానక్ రామ్‌గూడలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సంస్థ (ప్రపంచంలోనే నాలుగవది)ను ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి బుధవారం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. 'గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే తరువాయి 2లో

రాష్ట్రాభివృద్ధికి

# విద్యుత్ సరఫరా కీలకం

- అన్నివర్గాలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు పకడ్బందీ చర్యలు
- ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ శాఖలో పారదర్శకత తీసుకువచ్చాం
- 20 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా పెట్టుకున్నాం
- విద్యుత్ అంబులెన్స్, హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బుధవారం ఆయన ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి కె. వరుణ్‌రెడ్డిలతో కలిసి విద్యుత్ అంబులెన్స్ లను ఆవిష్కరించారు. విద్యుత్ తరువాయి 2లో

# 3 నెలల్లో అమలు చేయకపోతే జైలుకే

## ఇద్దరు అధికారులపై హైకోర్టు తీర్పు

ప్రజాపక్షం/హైదరాబాద్



మూసీని సుందరీకరణ, అభివృద్ధి చేయాలనే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం సేకరించిన భూమికి పరిహారంగా స్థలాన్ని కేటాయించి రిజిస్ట్రేషన్ చేయని ఇద్దరు అధికారులకు హైకోర్టు షరతులతో కూడిన జైలు శిక్ష విధించింది. సేకరించిన భూమికి ప్రత్యామ్నాయంగా యజమానికి మూడు నెలల్లో ప్లాటు రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలని తీర్పు చెప్పింది. ఈ ఉత్తర్వులను అమలు చేయకపోతే 2 వారాల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా చెల్లించాలంది. జరిమానా చెల్లించనిపక్షంలో మరో వారం జైలు శిక్ష గడపాలంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ కార్యదర్శిగా, హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా చేసిన అరవింద్ కుమార్, హెచ్‌ఎండీఏలో భూసేకరణ అధికారి ప్రసూనాంబలను ఆదేశిస్తూ జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి తీర్పు చెప్పారు. 2016లో కేటాయించిన 666.67 చదరపు గజాల ప్లాటును రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని హామీ ఇచ్చి ఉల్లంఘించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉప్పల్‌భగాయత్‌లో మూసీ సుందరీకరణకు చేపట్టిన 99.13 ఎకరాల భూసేకరణలో భూమి కోల్పోయిన వారికి పరిహారంగా ఎకరానికి 1000 చదరపు గజాలు డెవలప్ చేసిన ప్లాటును కేటాయిస్తామని ప్రభుత్వం జీవో ఇచ్చిందని, దీని ప్రకారం భూమిని కోల్పోయిన పిటిషనర్‌కు రాంరెడ్డికి కేటాయించిన తరువాయి 2లో

# ఎపిలో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ జోన్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి హతం

ప్రజాపక్షం/ఖమ్మం/జయశంకర్ భూపాలపల్లి




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు రేంజ్ పరిధిలోని అల్లూరి జిల్లా మారేడు మిల్లి ప్రాంతంలో మంగళవారం పొద్దుపోయిన తర్వాత పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు ధృవికరించారు. మావోయిస్టు పార్టీ స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు గాజర్ల రవి, అరుణ మృతదేహాలను గుర్తించగా మరో మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది. గాజర్ల రవి అలియాస్ ఉదయ్, అలియాస్ గణేష్ తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామానికి చెందిన వాడు. ఇతను సెంట్రల్ కమిటీ సభ్యునిగా ఆంధ్రా, ఒడిశా బోర్డర్ (ఏవోబి) స్పెషల్ జోన్ సభ్యునిగా కొనసాగుతున్నాడు. ఇతనిపై రూ. 25 లక్షల రివార్డు ఉంది. మరో మృతురాలు లక్ష్మి చైతన్య అలియాస్ అరుణ తరువాయి 12లో

# లొంగిపోయే మనస్తత్వం కాదు

- ఇరాన్ సర్వాధినేత ఖమేనీ హెచ్చరిక
- ట్రంప్ బెదిరింపులకు భయపడబోనని స్పష్టీకరణ
- యుద్ధం మొదలైందని ప్రకటన



**జెనీవా :** ఇజ్రాయెల్ ప్రజలకు లొంగిపోయే బానిస మనస్తత్వం లేదని ఇరాన్ సర్వాధినేత ఆయెతుల్లా అలీ ఖమేనీ స్పష్టం చేశారు. లొంగిపోవాలని ట్రంప్ చేసిన డిమాండ్‌ను ఖమేనీ తిరస్కరించారు. యుద్ధం మొదలైందని ఖమేనీ బుధవారంనాడు ప్రకటించారు. శుక్రవారంనాడు ఇజ్రాయెల్ దాడులు చేయడానికి ముందుగా చివరిసారి ప్రపంచానికి కనిపించిన ఖమేనీ, ఆరు రోజుల యుద్ధం తర్వాత మొదటిసారి బుధవారంనాడు టెలివైజ్డ్ సందేశం ఇచ్చారు. ఖమేనీ సందేశాన్ని ప్రభుత్వ టీవీ యాంకర్ చదివి వినిపించారు. ఇరాన్ చరిత్ర తెలిసినవారెవరూ ఇలా లొంగిపొమ్మని అడగరు, ఎందుకంటే ఇలాంటి బెదిరింపు భాషలకు ఇరానీయులు లొంగేవారు కాదు అని ఖమేని ప్రకటించారు. బేషరతుగా లొంగిపోవాలని అమెరికా, ఇజ్రాయెల్ నాయకులు తీవ్ర హెచ్చరికలు చేస్తున్న తరుణంలో కొద్ది గంటల వ్యవధిలోనే ఖమేనీ టెలివిజన్ సందేశం వెలువడింది. అమెరికా, ఇజ్రాయెల్ రెండు దేశాలకూ ఖమేనీ టెలివిజన్ సందేశం ద్వారా తీవ్ర ప్రతి హెచ్చరిక జారీ చేశారు. ఇజ్రాయెల్‌తో చేతులు కలిపి తమపై, తమ అణుశుద్ధి కేంద్రాలపై సైనిక దాడులు చేస్తే ఇజ్రాయల్–అమెరికా రెండు దేశాలూ కోలుకోలేనంత దారుణంగా నష్టపోతాయని ఖమేనీ హెచ్చరించారు. ఇరాన్‌కు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## మధ్యవర్తిత్వానికి పుతిన్ సంసిద్ధత



**మాస్కో :** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపి ఒక పరిష్కారం సాధించేందుకు మధ్యవర్తిత్వం చేయడానికి రష్యా అధ్యక్షుడు వి.పుతిన్ సంసిద్ధత వ్యక్తం చేశారు. బుధవారంనాడు ఆయన ఈ విషయంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో టెలిఫోన్‌లో సంభాషించారు. రెండు దేశాలమధ్య జూన్ 13వ తేదీన యుద్ధం మొదలైంది. ఈ యుద్ధంలో అమెరికా మద్దతు కారణంగా ఇజ్రాయెల్ ఇప్పటివరకూ పైచేయి సాధిస్తూ వస్తోంది. ఇరాన్ కీలక అణుస్థావరాలపై ఉమ్మడి దాడులు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో పుతిన్ తెర మీదకు వచ్చారు. ఈ విషయాన్ని అనేక దేశాల నాయకులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. టెలిఫోన్ సంభాషణ సందర్భంగా అల్ నహ్యాన్, పుతిన్ ఇద్దరూ మధ్యప్రాచ్యంలో సంక్లిష్ట పరిణామాలపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల యావత్ మధ్యప్రాచ్యంలో ప్రతికూల పరిణామాలు సంభవిస్తాయని, యుద్ధవాతావరణం విస్తరించి అభద్రత పెరుగుతుందని నాయకులిద్దరూ అభిప్రాయపడ్డారు.

## ఇరాన్ యురేనియం శుద్ధి యంత్రాలు,
# హెలికాప్టర్లు ధ్వంసం



**ఇజ్రాయెల్ దాడుల్లో 585 మంది మృతి**

**30 క్షిపణులతో ఇరాన్ దాడులు**

**టెహ్రాన్ :** యుద్ధపరంగా, దౌత్యపరంగా మధ్యప్రాచ్యంలో పరిస్థితులు బుధవారంనాటికి సంక్లిష్టదశకు చేరుకున్నాయి. వరుసగా ఆరో రోజు కూడా ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య దాడులు కొనసాగాయి. 30 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ సైన్యం దాడులు చేసింది. టెహ్రాన్‌లో ఉన్న ఇరాన్ యురేనియం శుద్ధి యంత్రాలంలపైనా, ఇరాన్ రీసెర్చ్ సెంటర్‌పైనా ఇజ్రాయెల్ దాడులు చేసిందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) ఒక ప్రకటన చేసింది. ఈ దాడులవల్ల ఇరాన్ అణుసామర్థ్యం తీవ్రంగా దెబ్బతిన్నదని ఐఎఇఎ తెలిపింది. బుధవారం తెల్లారుఝామునే భారీ బాంబుపేలుళ్ళతో టెహ్రాన్ దద్దరిల్లింది. అదేవిధంగా ఇరాన్‌కు చెందిన ఐదు యుద్ధ హెలికాప్టర్లను కూడా ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఎహెచ్–1 ఎటాక్ హెలికాప్టర్లను పశ్చిమ ఇరాన్‌లోని ఖెర్మన్‌షా ప్రాంతంలోని వైమానిక కేంద్రంలో ఉండగా ధ్వంసం చేసినట్లు పేర్కొంది. హెలికాప్టర్లనుధ్వంసం చేసిన బ్లాక్ అండ్ వైట్ వీడియోలను ఇజ్రాయెల్ ఐడిఎఫ్ విడుదల చేసింది. షా పరిపాలనాకాలంలో టెహ్రాన్ 200 బెల్ ఎహెచ్–1 సూపర్ కోబ్రా హెలికాప్టర్లను కొనుగోలు చేసింది. అప్పటి హెలికాప్టర్లు కొన్ని ఇంకా సర్వీసులో ఉన్నాయి. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు కొనసాగుతున్నందువల్ల ఇరాన్ ఎలాంటి ఆయుధాలను కొనుగోలు చేయలేని అశక్తతలో ఉంది. ఐతే దీనిపై ఇరాన్ వెంటనే ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇదిలా ఉంటే, శాటిలైట్ ఇమేజస్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన పాశ్చాత్య మీడియా బుధవారంనాడు ప్రకటించిన సమాచారం ప్రకారం, ఇజ్రాయెల్ దాడులలో తబ్రిజ్ క్షిపణి స్థావరం తీవ్రంగా ధ్వంసమైంది. ఈ స్థావరంలో ఉన్న తొమ్మిది భారీ భవంతులు నేలమట్టమయ్యాయి. రెండు సొరంగ మార్గాలు కూడా ప్రవేశించడానికి వీలులేనివిధంగా ధ్వంసమయ్యాయి. టెహ్రాన్‌కు 750 కి.మీ దూరంలో ఉన్న మెస్సాద్ విమానాశ్రయం కూడా ధ్వంసమైంది.



టెసా కరాజ్ వర్క్‌షాప్, టెహ్రాన్ రీసెర్చ్ సెంటర్‌లను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. యురేనియం సెంట్రీఫ్యూగల్ కాంపొనెంట్స్‌ను తయారు చేసే రెండు భవంతులను ఇజ్రాయెల్ క్షిపణులు ధ్వంసం చేశాయి. ఫతా క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఎదురు దాడులు చేసింది. ఇరాన్ గగనతలాన్ని పూర్తిగా తన అధీనంలోకి తెచ్చుకున్న ఇజ్రాయెల్ తన దేశ గగనతలాన్ని కూడా పూర్తిస్థాయిలో పరిరక్షించుకునేందుకు చర్యలు తీసుకుంది. ఇరాన్ క్షిపణి వ్యవస్థల జాడ కనిపెట్టేందుకు ఇజ్రాయెల్ తన గగనతల రక్షణ వ్యవస్థను క్రియాశీలం చేసింది. ఇరాన్‌లోని కీలకమైన ఆయుధ ఉత్పత్తి కేంద్రాలపై, ఆయుధ సామాగ్రి తయారీ కేంద్రాలపైన దాడులు చేసి విధ్వంసం సృష్టించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. దాడులు చేసిన ఇజ్రాయెల్ సైన్యం విధ్వంసం సృష్టించింది. ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో మొత్తం 585 మంది మరణించారనీ, వీరిలో 239 మంది పౌరులు ఉన్నారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే మానవహక్కుల కార్యకర్త చెప్పారు. 1300 మంది గాయపడ్డారని చెప్పారు. భూతలం నుండి దాడులు చేసిన ఇరాన్ గగనతలంలో తమ డ్రోన్లను కూల్చివేసిందని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌కు చెందిన అనేక డ్రోన్లను తాము కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. మంగళవారంనాడు ఐదోరోజున రెండు దేశాల మధ్యా ఉద్ధృతస్థాయిలో పరస్పర సైనిక దాడులు కొనసాగిన నేపథ్యంలో ముందు ముందు కూడా పరిస్థితులు అదుపుతప్పి దారుణ మానవహింసకు దారితీస్తాయని అంచనావేస్తున్నారు.

ఇరాన్ మేజర్ రాడార్ వ్యవస్థకు నష్టం వాటిల్లిన విషయాన్ని ఆ దేశ అధికారులు అంగీకరించారు. ఐతే ప్రత్యామ్నాయ వ్యవస్థ వేరేచోట ఉందని మీడియా వెల్లడించింది. సొబాషి రాడార్ వ్యవస్థ కాబౌదరహంగ్ కౌంటీలోని హమెదన్ రాష్ట్రంలో చాలా ఎత్తైన ప్రాంతంలో ఉందని, ఇరాన్ రక్షణ వ్యవస్థను కాపాడటంలో ఇది కీలకపాత్ర వహిస్తోందన్నది మీడియా సమాచారం. ఈ హమెదన్ ప్రాంతంపై అనేకసార్లు ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఐతే ఇరాన్‌కు చెందిన కీలక అణువ్యవస్థలు దెబ్బతిన్నాయని ఐఎఇఎ ప్రకటించింది.

**ఇరాన్‌కు ఆయుధ సాయం చెయ్యడంలేదు:పాకిస్థాన్**

ఇరాన్‌కు ఎలాంటి ఆయుధ సహాయం చెయ్యడంలేదని పాకిస్థాన్ ప్రభుత్వం బుధవారంనాడు ప్రకటించింది. ఆయుధసాయం చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలను పాకిస్థాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ రెండు దేశాలు పక్కపక్కనే ఉంటాయి. విస్తారమైన సరిహద్దు ప్రాంతం రెండు దేశాలమధ్యా ఉంది. ఇజ్రాయెల్ దాడులు చేస్తూ ఉండటంతో రాజధానీ నగరం టెహ్రాన్ బుధవారంనాడు నిర్మానుష్యంగా మారిపోయింది. దుకాణాలన్నీ మూతపడ్డాయి. ఏదో అప్పుడప్పుడు ఒక వాహనం శరవేగంగా వెళుతూ కనిపిస్తున్నాయి. ఇరాన్‌లో ఉన్న వందలాదిమంది పాకిస్థానీ ప్రజలు దేశం వదిలిపారిపోయారు. ఇరాన్‌లో పరిస్థితులు దిగజారినందువల్ల దేశం వదిలివెళ్ళిపోవాలని టెలికాంశాఖ కార్మికుడు గులామ్ ముస్తాఫా ఐజాజ్‌ను పై అధికారులు కోరారు. ఈ విషయం ఆయనే చెప్పారు. కేవలం కొన్ని ఆహార వస్తువులు, దుస్తులు తప్ప అన్నీ ఇక్కడే వదిలేసి వెళ్ళిపోతున్నామని పాకిస్థానీ కార్మికుడు ముస్తాఫా ఐజాజ్ చెప్పారు. ఇరాన్–పాకిస్థాన్ మధ్య 900 కి.మీ సరిహద్దు ప్రాంతం ఉంది. అక్రమరవాణాదారులు, దొంగలు, ఉగ్రవాదులు చాలా స్వేచ్ఛగా ఈ సరిహద్దుల్లో తిరుగాడుతూ ఉంటారు.





## ఇరాన్ ఫోర్డో భూగర్భ అణుకేంద్రంపై
# దాడికి ట్రంప్ సన్నాహాలు?

ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. అణ్వాయుధాలను పరిమితం చేసుకునేందుకు, అణ్వస్త్రరహిత మధ్యప్రాచ్య మనుగడ కొనసాగించేందుకు వీలుగా ఇరాన్ లొంగిపోవాలని ట్రంప్ అన్నారు. జూన్ 13వ తేదీన ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేశాక ఖమేనీ భూగర్భంలో దాక్కున్నారని వార్తలు వెలువడ్డాయి. ఖమేనీ ఎక్కడ ఉన్నాడో తమకు సమాచారం తెలుసుననీ, ప్రస్తుతానికి ఆయనను చంపకుండా వదిలేశామని కలిసి ఇరాన్‌పై దాడులు చేసే విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆలోచిస్తున్నారని బ్రిటన్ మీడియా ప్రకటించింది. వాషింగ్టన్ సిట్యుయేషన్ రూమ్‌లో జాతీయ భద్రతావిభాగం అధికారులతో ట్రంప్ మంగళవారం పొద్దుపోయాక సమావేశం నిర్వహించారు. ఏ విధంగా ముందుకెళ్ళాలనే విషయంపై చర్చలు జరిగాయి. ఇరాన్‌లోని ఫోర్డో భూగర్భ అణుకేంద్రాన్ని ధ్వంసం చేసేందుకు మంతనాలు జరిగాయి. ఇరాన్‌లోని మారుమూల పర్వతాలలో 90 మీటర్ల లోతున ఈ అణుకేంద్రం ఉంది. చాలా లోతైన ఈ భూగర్భంలోకి బాంబును విడిచిపెట్టేందుకు ప్రత్యేక నైపుణ్యం కావాలి. ఆ బాంబు అతిశక్తిమంతమైనదై ఉండాలి. ఈ అణుకేంద్రాన్ని ధ్వంసం చేసేందుకు జిబియు 57 ఎ/బి అనే అతిశక్తిమంతమైన పేలుడు పదార్థం కావాలి. ఈ పేలుడు పదార్థాన్ని మోసుకువెళ్ళేందుకు అమెరికా దగ్గర మాత్రమే ఉన్న బి–2 స్పిరిట్ స్టీల్త్ బాంబర్లు కావాలి. ఈ రెండూ ఇజ్రాయెల్ వద్ద లేవు. అందువల్ల తప్పనిసరిగా అమెరికా యుద్ధరంగంలోకి దిగాల్సి ఉంటుంది. ఈ అణుపదార్థాలను మోసుకువెళ్ళేందుకు అవసరమైన ఒక్కొక్క క్షిపణి ఖరీదూ దాదాపుగా 500 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువే. ఇంత ఆర్థిక శక్తిసామార్థ్యాలు అమెరికా దగ్గరమాత్రమే ఉన్నాయి.

ఇరాన్‌లోని ఫోర్డో అణు శుద్ధి స్థావరం చాలా లోతైన భూగర్భం. ఈ భూగర్భప్రాంతంలో అణుశుద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక్కడ దాడులు చేయడం చాలా కష్టతరమైన పని. కానీ ఈ కేంద్రాలపై దాడులు చేసే విషయంపై ట్రంప్ యంత్రాంగం ఆలోచిస్తోంది. ఒకవేళ ఇజ్రాయెల్‌తో కలిసి దాడులు చేస్తే యావత్ యుద్ధరంగం, ప్రపంచ పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. ఈ విషయంపై రిపబ్లికన్లు రెండు వర్గాలుగా విడిపోయి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌కు భూగర్భంలో ఉన్న అణునకేంద్రాలపై ఉమ్మడి దాడులు చేసేందుకు అమెరికా మొగ్గ చూపిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. టెహ్రాన్ ప్రజలు నగరం వీడి వెళ్ళిపోవాలని కూడా నర్మగర్భంగా ట్రంప్ మంగళవారంనాడు ఒక హెచ్చరిక చేశారు. మరోవైపు ట్రంప్ ఇజ్రాయెల్‌తో కలిసి దాడుల్లోపాలు పంచుకునే విషయంపై అధికార రిపబ్లికన్‌పార్టీ వర్గాల్లో అనుకూల వ్యతిరేక భావాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు వర్గాలుగా రిపబ్లికన్లు విడిపోయారు.

## స్టార్‌మర్ కోబ్రా కమిటీ అత్యవసర సమావేశం



**లండన్ :** మధ్యప్రాచ్యంలో సంభవిస్తున్న తీవ్ర పరిణామాలపై బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ బుధవారంనాడు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కోబ్రా కమిటీ సమావేశం స్టార్‌మర్ అధ్యక్షతన జరిగింది. ట్రంప్ జాతీయ భద్రతా మండలి సమావేశం కొత్త ఆలోచనలు చేస్తున్నది. ఇజ్రాయెల్–అమెరికా ఉమ్మడి దాడులు చేస్తే జరిగే పరిణామాలను ఆయన చర్చించారు. మధ్యప్రాచ్యంలో పరిణామాలు శరవేగంగా మారిపోతున్నాయనీ, బ్రిటన్ వైఖరి చాలా స్పష్టంగా ఉందని, మధ్యప్రాచ్యంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులైనా చర్చల ద్వారా పరిష్కరించాలని, ఉద్రిక్తతలు సడలిపోవాలని బ్రిటన్ కోరుకుంటున్నదని టెన్ డౌనింగ్ స్ట్రీట్‌లో ప్రధాని నివాసం అధికార ప్రతినిధి ఒకరు సమావేశానంతరం చెప్పారు. ''అక్కడ పరిస్థితులు ఊహించినదానికంటే వేగంగా మారిపోతున్నాయి, అందువల్ల దౌత్యమార్గాలను పునరుద్ధరించేందుకు దీనిపై పనిచేసేశక్తులు తిరిగి అనుసంధానం కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అదేవిధంగా టెల్‌అవీవ్‌లో ఉన్న బ్రిటీష్ కాన్సులేట్ అధికారులు, వారి కుటుంబ సభ్యులను, జెరూసలెంలో ఉన్న బ్రిటిస్ దౌత్య సిబ్బంది, వారి కుటుంబాలను ముందు జాగ్రత్త చర్యగా వెనక్కు ఉపసంహరించుకుంటున్నట్లు బ్రిటన్ విదేశాంగమంత్రిత్వశాఖ ప్రకటించింది.

## ఇజ్రాయెల్ గూఢచారిని ఉరితీసిన ఇరాన్

**టెహ్రాన్ :** శక్తిమంతమైన ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ ''మొస్సాద్'' కు చెందిన ఇస్మాయెల్ ఫక్రిని ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. గడచిన నాలుగు రోజులుగా ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరుగుతున్న పరిస్థితుల్లో ఈ ఉరిశిక్షను ప్రభుత్వం అమలు చేసింది. తమదేశంలో రహస్యాలు కనిపెట్టేందుకు గూఢచర్యం చేశాడన్న ఆరోపణలపై ఇజ్రాయెల్‌కు చెందిన ఇస్మాయెల్ ఫక్రిని ఇరాన్ 2023లో అరెస్టు చేసింది. అణ్వస్త్ర ప్రమాదం ఇరాన్‌వల్ల పొంచిఉందన్న ఆరోపణలపై మెరుపుదాడులు చేసిన ఇజ్రాయెల్‌కు గుణపాఠం చెప్పేందుకు ఒకవైపు ప్రతీకార దాడులు చేస్తూనే మరోవైపు ఇజ్రాయెల్ గూఢచారికి అరెస్టుచేసిన రెండేళ్ళకు ఉరిశిక్ష అమలు చేశారు. భూమ్మీద అవినీతికి పాల్పడ్డాడనీ, దేవుడికి వ్యతిరేకంగా యుద్ధం చేశాడన్న ఆరోపణలపై ఫక్రికి ఉరిశిక్ష అమలు చేశారు. ఈ ఆరోపణలకింద ఇరాన్ న్యాయస్థాన చట్టాల ప్రకారం పూర్తిస్థాయిలో విచారణ జరిని నేరం నిర్ధారించిన తర్వాతే ఈ ఉరిశిక్ష అమలు చేసినట్లు ఇరాన్ జ్యుడీషియరీకి చెందిన 'మిజాన్' ఆన్‌లైన్ న్యూస్ ప్రకటించింది. ఈ తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించిన తర్వాతే ఉరిశిక్ష అమలు చేసినట్లు మిజాన్ పత్రిక పేర్కొంది. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్‌కు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై ఇరాన్‌లో అనేకచోట్ల అరెస్టైన వ్యక్తులపై న్యాయ విచారణను సత్వరం ఉద్ధృతం చేసి శిక్షలు అమలు చేస్తామని ఇరాన్ ప్రధాన న్యాయమూర్తి ఘొలామ్ హొస్సేన్ మొహ్సేనీ ఎజీ ప్రకటించారు. ఇజ్రాయెల్ గూఢచారిసంస్థ మొస్సాద్‌తో సంబంధాలన్న అనుమానంతో గడచిన ఆదివారంనాడు పశ్చిమ ఇరాన్ అల్‌బోర్జ్‌లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. అదేసమయంలో ఇజ్రాయెల్ కూడా ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ తరపున గూఢచర్యం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొంది.

## జిఎస్ఇసి లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం' అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు.రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. '2035 నాటి కి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా,'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. 'ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు.అధునాతన సైబర్ సెక్యూరిటీ , భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్‌సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగిస్తున్నందుకు తాను గర్విస్తునాని చెప్పారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని ఇది రెండో కార్యాలయం కూడా ఇక్కడే ప్రారంభించడం మన యువతకు మేలు చేకూరుస్తుందన్నారు.

**ఇతర రాష్ట్రాలకు తెలంగాణ దిశా నిర్దేశం..**

తెలంగాణ 'ఎథికల్ ఇన్నోవేషన్'లో ఇతర రాష్ట్రాలకు టార్చ్ బేరర్‌గా దిశా నిర్దేశం చేస్తుంది. 'మాగ్నెట్ ఫర్ గ్లోబల్ కేపిటల్ గా' ఎదిగింది. 'మోడల్ ఆఫ్ ఇన్క్లూసివ్ డిజిటల్ గవర్నెన్స్' గా మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.. భవిష్యత్తు కోసం ఎదురు చూడకూడదు. భావితరాల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తును నిర్మించాలి' అన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పం. ఆ దిశగానే తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందన్నారు. 2024–25లో హైదరాబాద్ నుంచి రూ. 2.68 లక్షల విలువైన ఐటి, ఐటిఇఎస్ సేవలు ఎగుమతి అయ్యాయని, 40వేల మందికి కొత్తగా ఐటి ఉద్యోగాలు లభించాయని, అంతర్జాతీయ టాప్ 10 టెక్ దిగ్గజ కంపెనీల్లో 7 ఇక్కడ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయన్నారు. అనంతరం గూగుల్ సిబ్బంది జిఎస్ఇసి పనితీరును సిఎం, మంత్రికి వివరించారు.

## చేయకపోతే జైలుకే (మొదటి పేజీ తరువాయి)

666 చదరపు గజాలున్న ప్లాటు నెం.181కు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వలేదంటూ కోర్టుకు వచ్చారు. కోర్టు ఆదేశించినా అమలు కాకపోవడంతో 2020లో మళ్లీ హైకోర్టుకు వస్తే, 2023 ప్రారంభంలో మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయి. మూడు నెలల్లో ప్లాటు రిజిస్టర్ చేయాలన్న ఆ ఉత్తర్వులు కూడా అమలు కాకపోవడంతో రాంరెడ్డి కోర్టు ధిక్కారణ పిటిషన్ వేశారు. ఇందులో మున్సిపల్ శాఖ కౌంటర్ వేసింది. పిటిషనర్‌కు కేటాయించి ప్లాటు 181 సర్వే నెం.454లో ఉందని, దీనికి సంబంధించి మరో వ్యక్తి హైకోర్టు నుంచి స్టే పొందారని చెప్పింది. దీంతో రిజిస్ట్రేషన్ చేయించలేకపోయామని, కావాలని కోర్టు ధిక్కరణకు పాల్పడలేదని తెలిపింది. వాదనలను విన్న న్యాయమూర్తి పిటిషనర్ రెండోసారి హైకోర్టును ఆశ్రయించినపుడు హైకోర్టు స్టే ఉత్తర్వుల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ వేయగా అదే విధంగా 2024 జనవరిలో మరోసారి హామీ ఇచ్చి ఏడాది దాటినా స్టే ఎత్తివేయాలనిగానీ, అప్పీలువేయడంగానీ చేయలేదన్నారు. మూడు నెలల్లో ప్లాటును రిజిస్ట్రేషన్ చేసివ్వకపోతే ప్రతివాదులైన పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, హెచ్ఎండీయే కమిషనర్‌గా పనిచేసిన అరవింద్‌కుమార్, భూసేకరణ అధికారి ప్రసూనాంబలకు రెండు వారాల జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే మరో వారం జైలు శిక్ష అమలు అవుతుందన్నారు.

## విద్యుత్ సరఫరా కీలకం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ వరదల సమయంలో ఎవరు ఊహించని వేగంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేసిన సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ శాఖలో పారదర్శకత తీసుకు వచ్చామని, విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు సమయం కేటాయిస్తున్నామ న్నారు. రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ సరఫరా చాలా కీలకమని మన రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా అ న్ని వర్గాలకు అందించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. సాంకే తిక సమస్యలు, వాతావరణ పరిస్థితుల వల్ల విద్యుత్ సరఫరాలో అంత రా యం ఏర్పడినప్పుడు మరమ్మతు పనులు చేసే సమయంలో కార్మికులకు ప్ర మాదాలు జరగకుండా తప్పనిసరిగా భద్రతా చర్యలు పాటించాలన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా విద్యుత్ శాఖలో పనిచేసే లైన్‌మెన్ నుంచి సిఎం డి వరకు కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించడం జరిగిందన్నారు. కెటిపిఎస్ స్టేజ్ 7 వరకు, హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మొత్తం గత ఉ మ్మడి రాష్ట్రం హయాంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన విద్యుత్ పాలసీని తీసుకు వచ్చామని ఆయన తెలిపారు. 2023లో 15వేల మెగావాట్ల విద్యుత్ పీక్ డిమాండ్ ఏర్పడిందని, 2025 మార్చిలో ఇది 17,162 మెగా వాట్లకు చేరుకున్నప్పటికీ ఎక్కడ విద్యుత్ కో తలు లేకుండా చూసుకున్నామన్నారు. 2030 నాటికి 26వేల మెగావాట్లు, 2035 నాటికి 33,773 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడుతుందనే అంచనాతో ఉత్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా చర్య లు తీసుకుంటున్నామన్నారు. లక్ష కోట్ల రూపాయల వరకు ఇప్పటికే సోలా ర్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఎంవోయు చేసుకున్నామన్నారు. బ్యాటరీ స్టోరేజ్ వంటి నూతన విద్యుత్ ఉత్పత్తి రంగాలను కూడా పరిశీలిస్తున్నా మ న్నారు. వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు ప్రభు త్వం ప్రతి ఏడాది రూ. 11,500 కోట్లు చెల్లిస్తుందన్నారు. గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం రూ. 2293 కోట్లను విద్యుత్ శాఖకు చెల్లించిందన్నారు. 1912 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేస్తే విద్యుత్ అంబులెన్స్ వచ్చి మరమ్మతు పనులు పూర్తి చేస్తుందని అంబులెన్స్‌లో అవసరమైన సామగ్రి ఇంజనీర్, ట్రాన్స్‌ఫార్మర్ అందు బాటు లో ఉంటాయన్నారు. రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాక ర్ మాట్లాడుతూ సామాన్యుల జీవన ప్రమాణాలు పెరిగేందుకు విద్యుత్ శాఖ పనితీరు కీలకమన్నారు. ప్రజా ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా విద్యు త్ శాఖ సిబ్బంది వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. ఆర్టిసి కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే కోటి రూపాయల బీమా వస్తుందని విద్యుత్ శాఖలో కూడా ఈ పథకం అమలవుతుందన్నారు. మిగిలిన శాఖల్లోనూ ఉద్యోగులకు కూడా ఇది అమలు చేయాలన్నారు. సిఎండి కె. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబర్‌లో వచ్చిన వరదల సమ యంలో ఖమ్మం సర్కిల్ పరిధిలో రూ. 30 కోట్ల మేర నష్టం జరిగిందన్నారు. విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పని చేసి వారం రోజుల్లో ప్రతి గ్రా మంలో విద్యుత్ సరఫరాను పునరుద్దరించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎలక్ట్రికల్ సేఫ్టీ టూల్ కిట్ల ను సిబ్బందికి మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సం స్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్ నాయుడు స త్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసచారి, డిఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి పెద్ద దెబ్బ (మొదటి పేజీ తరువాయి)

'పవర్‌పాయింట్ ప్రజంటేషన్' ఇచ్చారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఎంపిలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలవరం–బనకచర్ల విషయంలో ఎపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్నిఉల్లంఘిస్తోందని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. గోదావరి–బనకచర్లను పరిశీలించడం రాష్ట్ర హక్కులను కాలరాయడమేనని, పోలవరం–బనకచర్లను మేం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, పోలవరం–బనకచర్లను తిరస్కరించాలని కేంద్రానికి స్పష్టంగా చెప్పామని ఉత్తమ్ వివరించారు. గోదావరి ట్రైబ్యునల్ అవార్డును బనకచర్ల ప్రాజెక్టు ఉల్లంఘిస్తోందని, తెలంగాణకు అనుకూలమైన ఇచ్చంపల్లిని ఎపి వ్యతిరేకించిందని, అత్యవసరంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరినట్టు ఆయన చెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణ వాటా జలాలకు కూడా భవిష్యత్‌లో ఎదురు దెబ్బేనని ఉత్తమ్ తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోకి గోదావరి రెంజల్ మండలం కందకుర్తి వద్ద ప్రవేశిస్తోందని, రాష్ట్రంలో గోదావరిపై తొలి ప్రాజెక్టు ఎస్‌ఆర్‌ఎస్‌పి అని, తుమ్మిడిహట్టి వద్ద 2007లో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు తలపెట్టారని, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా నాలుగు రిజర్వా యర్లను డిజైన్ చేశారని, 4 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే లక్ష్యంతో రూపొందించారని ఉత్తమ్ వివరించారు.

## కీలక సమావేశం (మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను నాయకులకు కెసిఆర్ వివరిస్తారని కెటిఆర్ పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే రైతులపైన కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారని, అందుఏ కీలక సమావేశంలో తదుపరి కార్యాచరణపై చర్చిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా ప్రభుత్వం చూపుతున్న అలసత్వంతో తెలంగాణకు తీరని నష్టం కలుగుతుందని, ఈ అంశంలో ఉద్యమ కార్యాచరణకు బిఆర్‌ఎస్ ప్రణాళికలు సిద్ధం చేయనుందని కెటిఆర్ తెలిపారు. రైతులపక్షాన బిఆర్‌ఎస్ మరో పోరాటానికి సిద్ధమవుతున్నదని తెలిపారు.

## కెసిఆరే కారణం

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నాం. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందకు అన్ని ప్రయత్నాలు చేస్తాం' అని చెప్పారు. ''కెసిఆర్, హరీష్‌రావు ఏనాడు తెలంగాణ ప్రయోజనాల కోసం పాటుపడలేదు. పాలమూరు జిల్లాల్లో మొదలైన ఏ ప్రాజెక్టును పూర్తిచేయలేదు. పదేళ్లలో పెండింగ్‌లో ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టుతో గ్రావిటీతో సాగునీరు అందేది. కమిషన్ల కక్కుర్తితో లక్షకోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్టుతో లక్ష ఎకరాలకు కూడా సాగునీరు అందివ్వలేదు. పదేళ్లు రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులను గాలికి వదిలేశారు. వారి ఇల్లు నింపుకునేందుకు రాష్ట్రాన్ని దోచుకున్నారు'' అని సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారి మాదిరిగా కాకుండా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదని, కష్టపడి ఎస్ఎల్‌బిసి పనులు ప్రారంభిస్తే మనుషులు చనిపోతే వారు పైశాచిక ఆనందం పొందుతున్నారని, ఎక్కడ ఎవరు చనిపోయినా వారి ముఖాల్లో పైశాచిక ఆనందం కనిపిస్తోందన్నారు. హరీష్ రావు హుందాగా వ్యవహరించాలని, అబద్ధాలతో కాలం వెళ్లదీయొద్దని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నిజాలు బయటపెట్టిందని, ఆయన తలకాయ ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. ''రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని ఎసిఆర్ ప్రకటించినట్లు నమస్తే తెలంగాణ పత్రికలో రాశారు. 2192016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించింది. ఆనాటి సాగునీరు మంత్రి హరీష్ రావు, ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ పాల్గొన్నారు. ఏటా 3వేల టిఎంసిల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని అపెక్స్ కౌన్సిల్ భేటీలో అప్పటి సిఎం కెసిఆర్ అన్నారు. మూడు వేల టిఎంసిలు వృథాగా పోతున్నాయని మొదట మాట్లాడింది కెసిఆరకే. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా దస్త్రాల రూపంలో ఉంది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని ఆనాడు తెలంగాణ, ఎపి మంత్రులు మీడియాకు కూడా చెప్పారు. 2019 వరకు ఇది రకరకాల కారణాలతో వాయిదాపడుతూ వచ్చింది. 2019 లో ఆనాటి ఎపి సిఎం జగన్‌తో నాలుగుసార్లు సమావేశమై కెసిఆర్ రాయలసీమకు నీటి తరలిపునకు నిర్ణయం తీసుకున్నారు. ఆ సమావేశం వివరాలను ఆనాటి మంత్రులు ఈటల రాజేందర్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు'' అని రేవంత్‌రెడ్డి వివరించారు. ఏ అంశం వచ్చినా, ఏ విషయం ప్రస్తావనకు వచ్చినా బిఆరెస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, తద్వారా వారు



సెంటిమెంట్ తో మళ్లీ పార్టీని బ్రతికించుకునే ప్రయత్నం చేస్తున్నారని సిఎం విమర్శించారు. రైతాంగాన్ని కష్టాల నుంచి బయటపడేసేందుకు ఆనాడు కాంగ్రెస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించామని, కెసిఆర్, హరీష్ సంపూర్ణ అవగాహనతో ప్రభుత్వానికి సహకరించినా, సూచనలు చేసినా స్వీకరిస్తామని, కానీ దురుద్దేశంతో రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని ఆనాడు కెసిఆర్ మాట్లాడారని, బేసిన్లు లేవు, భేషజాలు లేవు అని కెసిఆర్ ఆనాడు మాట్లాడారని, గోదావరి బనకచర్ల విషయంలో 2016లో కెసిఆర్, చంద్రబాబు మాట్లాడుకున్న అంశాల సాకుతో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముందుకు వెళుతోందన్నారు. ఎపి చేపట్టేది 200 టిఎంసిల ప్రాజెక్టు కాదని, 300 టీఎంసీల కోసమని, ఆనాడు కెసిఆర్ 400 టీఎంసీలు తీసుకోవచ్చని అంగీకరించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాదనలకు వెళ్లదలచుకోలేదని, తెలంగాణకు నష్టం జరగొద్దని జలశక్తి మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేశామని, ప్రభుత్వం ఎక్కడా నిర్లక్ష్యం వహించలేదన్నారు. మేడిగడ్డ గుండెకాయ లాంటిది.అది లేకపోతే ఆ ప్రాజెక్టు ఉన్నా ప్రయోజనం లేదన్నారు. పదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే తెలంగాణకు ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కృష్ణానది జలాలు జూరాలలో తెలంగాణకు వస్తాయని, ఆ నీటిని వాడుకుంటే ఈ పరిస్థితి ఉండేది కాదని, దీనికి కారణం కెసిఆర్ కాదా? రాయలసీమ ప్రాజెక్టులకు వారే కదా ఒప్పుకున్నది అని సిఎం ప్రశ్నించారు.

**పలుకుబడి ఉందని ప్రాజెక్టులు పూర్తవుతాయనుకుంటే చంద్రబాబు భ్రమ**

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు. ఈ విషయంలో తమకు ఎలాంటి శషభిషలు లేవని, సామ,దాన, దండోపాయాల్లో మొదటి దశలో ఉన్నామని, అందరినీ కలిసి సమస్యలను వివరిస్తాం అయినా న్యా యం జరగకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. తెలంగాణ ప్రభు త్వం అన్ని ప్రక్రియలను అనుసరిస్తూ కేంద్రానికి సమస్యలను వివరిస్తోందన్నారు. 'ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకు సూచన చేస్తున్నా. కేంద్రంలో పలుకుబడి ఉందని ప్రాజెక్టులు పూర్తవుతాయనుకుంటే మీ భ్రమ. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు మా ప్రణాళిక మాకుంది. చంద్రబాబు కెసిఆర్ చెప్పారని కాదు. గోదావరి బేసిన్‌లో 3వేల టీఎంసీలు మిగులు జలాలు ఉన్నాయని మీరు నమ్మితే 968 టిఎంసిలు వాడుకునేందుకు తెలంగాణకు సంపూర్ణ అనుమతులు ఇచ్చాక మీరు మిగులు జలాలు తీసుకోండి' అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**తెలంగాణ ప్రాజెక్టులకు ఎన్‌ఒసి ఇచ్చి మిగులు నీటిని వాడుకోండి**

భగవంతుడికి భక్తుడికి అనుసంధానం అన్నట్టు ప్రధాని మోదీకి చంద్రబాబు అవసరం ఉందని, చంద్రబాబుకు గోదావరి జలాల అవసరం ఉందని, చంద్రబాబు దూరం పెంచుకుంటే సమస్య పరిష్కారం కాదని, మోదీ దగ్గర అనుమతులు తెచ్చుకున్నంత మాత్రాన వారి ప్రాజెక్టులు పూర్తికావని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లపై తెలంగాణ ప్రాజెక్టులకు ఎపి ఎన్‌ఓసి ఇచ్చి మిగిలిన నీటిని ఎపి ఎలాగైనా వాడుకున్నా అభ్యంతరం లేదన్నారు.

**నేడు కేంద్ర మంత్రితో భేటీ**

కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌ను గురువారం కలిసి బనకచర్లపై మా అభ్యంతరాలను వివరిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాల కోసం అందరూ కలిసిరావాలని కోరారు. అఖిలపక్ష భేటీకి రాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రిని కలవడంలో ఆంతర్యం ఏమిటని సిఎం ప్రశ్నించారు. గురువారం తాము వెళ్లి కలుస్తామని తెలిసి ముందుగానే బుధవారం కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిని కలవడం వెనక రహస్యం ఏమిటని సిఎం ప్రశ్నించారు.

**నిధులిస్తామంటే ఫామ్ హౌస్‌కే వస్తాం**

సాగునీటి ప్రాజెక్టులు, మెట్రో విస్తరణ, రీజనల్ రింగురోడ్డు, మూసీ ప్రక్షాళన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కలవొద్దా అని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'బిఆర్‌ఎస్ నాయకులు నిధులు ఇస్తామంటే చెప్పండి. నేరుగా ఫామ్ హౌస్‌కే వస్తాం. రూ.50 వేల కోట్లు ఇవ్వండి. ప్రభుత్వం తరపున బాండ్లు రాసిస్తాం' అని వ్యాఖ్యానించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎసిబికి చిక్కిన విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ సూపరింటెండెంట్ నరేష్ రూ.8వేలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసిబికి చిక్కారు. ఓ కాంట్రాక్ట్ విషయంలో ఎక్సెస్ పనులకు సంబంధించి సదరు కాంట్రాక్టర్‌ను లంచం అడగడంతో ఆ కాంట్రాక్టర్ ఏసిబి అధికారులను ఆశ్రయించాడు.దీంతో బుధవారం ఉదయం ఆయన స్వగృహంలో రూ.80వేలు కాంట్రాక్టర్ నజీర్ నుండి లంచం తీసుకుంటుండగా విద్యుత్ ఎస్ఇని ఏసిబి అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ ఎస్ఇ కార్యాలయం, హస్తినాపురం కాలనీలోని ఆయన ఇంటిలో ఏసిబి అధికారులు సాయంత్రం వరకూ సోదాలు నిర్వహించారు.



## బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు సహాయం అందిస్తాం : సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: దేశంలో పెట్టుబడులకు పెట్టడానికి తెలంగాణ రాష్ట్రం అనుకూల ప్రదేశమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌ను ఎంచుకోవాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. హైదరాబాద్‌లోని, జూబ్లీహిల్స్ సిఎం నివాసంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుతో కలిసి బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం సిఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండి, సిఇఒ జైతీర్థ్ ఆర్. జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్, డిఆర్‌డిఎల్ డైరెక్టర్ జి.ఎ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించాలని, డిఫెన్స్ కారిడార్ ఏర్పాటుకు హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాలు అనుకూలమన్నారు. డిఫెన్స్‌కు సంబంధించిన కొన్ని సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయన్నారు. కాగా సిఎం ఆహ్వానం మేరకు బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం సానుకూలంగా స్పందించినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## కెసిఆర్ దత్తత గ్రామ బాధితులకు
# ప్రభుత్వం అండగా నిలుస్తుంది

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్:భువనగిరి జిల్లాలోని వాసాల మర్రి గ్రామంలో ఇండ్ల నిర్మాణం పేరుతో మాజీ సిఎం కెసిఆర్ చేతిలో మోసపోయిన (కెసిఆర్ దత్తత గ్రామం) ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను గురువారం తానే స్వయంగా అందజేస్తామని తెలిపారు. వాసాల మర్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్టుగా 2020 నవంబర్ 1న సిఎం హోదాలో కెసిఆర్ ప్రకటించారని, ఆ తర్వాత 2021 జూన్ 22న గ్రామసభ నిర్వహించి స్థానికులతో కెసిఆర్ సహపంక్తి భోజనం చేసి, వాసాలమర్రిని బంగారు వాసాలమర్రిగా అభివృద్ధి చేస్తానని కెసిఆర్ హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తానని కెసిఆర్ హామీఇచ్చారని, కానీ బిఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయే వరకు 2023 డిసెంబర్ 7వ తేదీ వరకు కెసిఆర్ వాసాలమర్రి వైపు కన్నెత్తి చూడలేదని మంత్రి పొంగులేటి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కెసిఆర్ తన ఫామ్‌హౌస్‌కు వెళ్లడానికి రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేసి, నిలువ నీడ లేకుండా చేశారని, ఆ బాధితులు ఇండ్లు కోల్పోయి, తాత్కాలికంగా గుడిసెలు, టెంట్లు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు వాసాలమర్రి దేవుడెరుగు, ఉన్న ఇండ్లను కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అక్కున చేర్చుకుందని అన్నారు. వాసాలమర్రి గ్రామంలో సర్వే నిర్వహించి, ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను గుర్తించి, 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని వివరించారు.

దేశానికి దశ దిశ చూపిస్తానని ప్రగల్బాలు పలికిన కెసిఆర్ తన దత్తత గ్రామ ప్రజలకు పంగనామాలు పెట్టారని, కొత్త ఇల్లు రాలేదు కదా, ఉనన ఇల్లు పోయిందని తెలిపారు. ప్రజల అవసరాలను, ఆశలను రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకున్నారని చెప్పడానికి వాసాల మర్రి గ్రామమే ఒక నిదర్శనమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం, సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని విభలాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు.



## బేగంపేట విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

ప్రజాపక్షం/హైదరాబాద్:బేగంపేట్ విమానాశ్రయాని కి గుర్తు తెలియని వ్యక్తి నుంచి సిబ్బందికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. బుధవారం ఉదయం 11.10 ప్రాంతంలో ఆగంతకుడు విమానాశ్రయంలో బాంబు ఉందంటూ మెయిల్ చేశాడు. దీంతో అప్రమత్తమైన బేగంపేట్ విమానాశ్రయ అధికారులు భద్రతా సిబ్బంది కి సమాచారం అందజేశారు. దీంతో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, సిఐఎస్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి. ముందుగా విమానాశ్రయంలో ఉన్న ఉద్యోగు లు, సిబ్బందిని బయటకు పంపించేశారు. విమానాశ్ర యం లోపల, పరిసర ప్రాంతాల్లో స్నిఫ్ఫర్ డాగ్స్, బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు..మెయిల్ పంపింది ఎవరు..? ఎక్కడి నుంచి వచ్చింది అనే విషయాలపై ఆరా తీస్తున్నారు.



సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు.

## పాత ఫోన్ నా వద్ద లేదు

### ఎసిబి దర్యాప్తు అధికారికి కెటిఆర్ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: తన మొబైల్‌ఫోన్‌ను 2024 మొదటి త్రైమాసికంలో మార్చానని, తాను గతంలో ఉపయోగించిన ఆ పాత ఫోన్ ప్రస్తుతం తన వద్ద లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు స్పష్టం చేశారు. తను ఫోన్ కాకుండా ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను వాడలేదని ఎసిబి అధికారులకు వివరించారు. ఈ మేరకు కెటిఆర్ ఎసిబి దర్యాప్తు అధికారికి బుధవారం లేఖ సమర్పించారు. కాగా ఫార్ములా కార్ రేసు కేసులో 'నవం బర్ 1, 2021 నుంచి డిసెంబర్ 1,2023 వరకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను,ల్యాప్ ట్యాప్, ట్యాబ్, ఐపాడ్ వంటి ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సమర్పించాలని కెటిఆర్‌కు ఎసిబి నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో కెటిఆర్ లేఖ ద్వారా పైవిధంగా సమాధానాన్ని పంపించారు. బిఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 94 కింద ఇచ్చిన నోటీసులో తాను నవంబర్ 2021 నుంచి డిసెంబర్ 2023 మధ్య కాలంలో వాడిన సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎందుకు సమర్పించాలనే కారణం కానీ, ఉద్దేశం కానీ ఎసిబి తన నోటీసుల్లో పేర్కొనలేదని కెటిఆర్ వివరించారు. ఫార్ములా కేసు విచారణకు సంబంధించి అవసరమైన అన్నిరకాల అధికారిక సంప్రదింపుల రికార్డులన్నీ రాష్ట్ర ప్రభుత్వంలోని పురపాలక శాఖ వద్దనే ఉన్నాయని తెలిపారు. అవన్నీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ శాఖ మంత్రి హోదాలో తాను తీసుకున్న నిర్ణయాలన్నారు. తనపై చేసిన ఆరోపణల్లో గతంలో వాడిన ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రస్తావన, సంబంధం లేనప్పటికీ, వాటిని సమర్పించాలని కోరడం, రాజ్యాంగం ఒక పౌరునిగా తనకు కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని అన్నారు. కేసు విచారణ కోసం తాను వాడిన ఎలక్ట్రానిక్ వస్తువులు అవసరమనే ప్రాతిపదికను ఎక్కడా కూడా ప్రస్తావించలేదని కెటిఆర్ తెలిపారు. విచా రణలో భాగంగా ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించాల్సి వస్తే సుప్రీం కోర్టు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని ఎసిబి లేఖలో కెటిఆర్ తెలిపారు. ఒకవేళ ప్రత్యేక పరిస్థితుల్లో సేకరించే ఎలక్ట్రానిక్ వస్తువులను విచారణ సంస్థల అధికారులు ట్యాంపర్ చేయకుండా ఉండేందుకు కఠిన నిబంధనలను పాటించాలని సుప్రీం కోర్టు పొందుపర్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

వ్యక్తిగత గోప్యతతో పాటు, విచారణ పేరుతో ఒక పౌరునడి నుంచి ఎందుకు తీసుకుంటున్నారో సరైన కారణం చెప్పకుండా, సేకరించిన సమాచారాన్ని ఆయనకే వ్యతిరేకంగా వాడడం సరైనది కాదన్నారు.

## నల్సార్ యూనివర్సిటీతో టిజిసిఎస్‌బి ఒప్పందం



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో సైబర్ చట్టాల అమలును బలోపేతం చేయడానికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి), నల్సర్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం ఒక మైలురాయని డిజిపి డాక్టర్ జితేందార్ అన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాల అమలు, చట్టపరమైన సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ఒక ముఖ్యమైన చర్యగా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్‌లోని నల్సర్ విశ్వవిద్యాలయ న్యాయ విశ్వవిద్యాలయంతో ఒక అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకం చేసింది. తెలంగాణ పోలీస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జితేందర్, సమక్షంలో టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్, నల్సర్ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. సైబర్ నేరాలను ఎదుర్కోవడంలో టిజిసిఎస్‌బి యొక్క కార్యాచరణ నైపుణ్యంతో చట్టపరమైన విద్య, విధాన పరిశోధన మరియు ఫోరెన్సిక్ సామర్థ్యాలను ఏకీకృతం చేయడం, చట్టం, సాంకేతికతను మిళితం చేసే బహుళ విభాగ నమూనాను సృష్టించడం ఈ సహకారం లక్ష్యంగా పెట్టుకున్నారు.

### ఉచిత ఆటో పర్మిట్లను అడ్డుకుంటే
## ఆటో ఫైనాన్సియర్ల కార్యాలయాలు ముట్టడిస్తాం

### ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జెఎసి హెచ్చరిక




ప్రజాపక్షం/హైదరాబాద్: జిహెచ్‌ఎంసి, ఒఆర్ఆర్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే ఉచిత ఆటో పర్మిట్లను ప్రైవేట్ ఆటో ఫైనాన్షియర్లు అడ్డుకుంటే తగిన గుణపాఠం చెబుతామని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జెఎసి హెచ్చరించింది. ప్రైవేట్ ఆటో ఫైనాన్సియర్లు తమ అక్రమ వ్యాపారంతో ఆటో డ్రైవర్లను నిలువు దోపిడీ చేయడానికి ఉచిత ఆటో పర్మిట్లను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని జెఎసి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం, ఎస్.అశోక్ (ఎఐటియుసి), వి.మారయ్య, మహేష్ (బిఆర్‌టియు), అజయ్‌బాబు (సిఐటియు), వి.ప్రవీణ్, లింగం గౌడ్ (టియుసిఐ), ఎం.ఎ.సలీం, రఫీక్ (యుటిఎడిడబ్ల్యుఎ)లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేష్ మాట్లాడుతూ నిరుద్యోగాన్ని రూపుమాపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఉచిత ఆటో పర్మిట్ల జారీకి ఉత్తర్వులు (జిఓ) జారీ చేసిందని, దీంతో తమ అక్రమ వ్యాపారం జరగదని భావించిన ఆటో ఫైనాన్సియర్లు ఈ జిఓను అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

ఉచిత ఆటో పర్మిట్లను అడ్డుకుంటే ఆటో ఫైనాన్షియర్లు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని, ఈ ప్రయత్నాలను ఆపకుంటే వేలాదిమంది ఆటో డ్రైవర్లతో ఆటో ఫైనాన్షియర్లు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గత 12 ఏళ్లుగా ప్రైవేట్ ఆటో ఫైనాన్సియర్ల అరాచకాలు కొనసాగుతూనే ఉన్నాయని, కాలం చెల్లిన పాత ఆటోలను తుక్కుగా మార్చి ఆ పర్మిట్లపై కొత్త ఆటో కొనుగోలు చేస్తూ ఆర్‌బిఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. నేటికీ సుమారు 80వేల ఆటో పర్మిట్లు ఆటో ఫైనాన్షియర్ల వద్ద ఉన్నాయన్నారు. ఆటో షోరూమ్ ధర రూ.2.70లక్షల ఉంటే ఆటో ఫైనాన్షియర్లు ఆటో డ్రైవర్‌కు రూ.5లక్షలకు అమ్మి మధ్యలో రూ.2.30 లక్షలను అదనంగా తీసుకుంటున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు కొత్త ఆటో కోసం రూ.5లక్షలకు ఫైనాన్స్ ఇచ్చి వారికి శాశ్వత రుణగ్రస్తులుగా మార్చి వందల కోట్ల వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు.

## కార్మికులకు అండగా ఉంటా

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న కార్మిక సంక్షేమ పథకాలు, చట్టాలను పటిష్టంగా అమలు చేసి కార్మికులకు అండగా ఉంటానని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజి శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి చెప్పారు. కార్మిక, మైనింగ్ శాఖల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, ఇసుకను సామాన్యులకు అందుబాటులో తెస్తామని, ఇందు కోసం ఇసుకపై ఒక మంచి విధానాన్ని తీసుకువస్తామన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం మంత్రి వివేక్ బాధ్యతలు స్వీకరించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా టాటా టెక్నాలజీస్‌తో కలసి ఐటిఐలలో 46 స్కిల్ డెవలప్‌మెంట్స్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన మొదటి ఫైల్‌పై మంత్రి తొలి సంతకం చేశారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి జి.వినోద్‌తో పాటు పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహించే చెన్నూరు, పెద్దపల్లి నియోజకవర్గంలో కూడా సింగరేణి మైనింగ్‌తో పాటు వేలాదిమంది కార్మికులు ఉన్నారని, వీరితో పాటు రాష్ట్రంలో ఉన్న కార్మికుల సంక్షేమానికి సాధ్యమైనంత మేరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నామని, ఈ అంశంపై త్వరలో సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ గ్యారంటీ స్కీమ్స్ అమలుకు ఆదాయాన్ని మెరుగు పర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు రూ. 2076కోట్ల వ్యయంతో 46 అడ్వాన్స్‌డ్ కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. వీటిని టాటా టెక్నాలజీస్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రారంభిస్తుందని, ఇవి దేశంలోనే రోల్ మోడల్‌గా ఉంటాయన్నారు. ఈ మంత్రి పదవి ద్వారా మరోసారి కార్మిక, బడుగు బలహీన వర్గాలకు సేవచేసే అవకాశం లభించిందన్నారు.

## ఎపి ఎఐఎస్‌ఎఫ్ నాయకులపై పోలీసుల దాడి గర్హనీయం

ప్రజాపక్షం/హైదరాబాద్ : శ్రీచైతన్య విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా విజయవాడలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్రనాయకులపై పోలీసులు దాడి చేయడాన్ని ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ తీవ్రంగా ఖండించారు. యాజమాన్యంతో కుమ్మక్కైన పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ విద్యార్థి నాయకులపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం గర్హనీయమన్నారు. పోలీసులు దాడిలో రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, రాష్ట్ర కార్యదర్శి నాసర్జి, ఉపాధ్యక్షుడు సాయి మరియు రాష్ట్ర నాయకులు తీవ్రంగా గాయపడ్డారని, దాడిచేసిన ఎస్‌సి శంకర్, కానిస్టేబుల్ వీరు, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్**

'e' NIT No. 05/J1IT/GHMC/2025-26/1st Recall ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్స్) తేది: 16.06.2025

**పని పేరు:** జూన్-2025 నుండి సెప్టెంబర్-2025 వరకు (అంటే, 01.06.2025 నుండి 30.09.2025) (4) నెలల వరకు 4G LTE (డేటా రేడియో) ఆధారిత వాకీ టాకీ వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెట్లను GHMCకి నియామకం, **అంచనా విలువ / ఇసివి:** రూ.8,85,064/-, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 18.06.2025న ఉ.11.00గం.ల నుండి, ఆఖరి తేది: 20.06.2025న సా.04.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఓ/ఓ అడిషనల్ కమిషనర్ (ఐటి), 3వ అంతస్తు, సిసి కాంప్లెక్స్ బిల్డింగ్, జిహెచ్‌ఎంసి, లిబర్టీ సర్కిల్, హైదరాబాద్ - 500063. ఫోన్: 6309999458. deeitghmc@gov.in.

సం/- అడిషనల్ కమిషనర్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), జిహెచ్‌ఎంసి

DIPR R.O. No. : 3749-PP/CL/ADVT/1/2025-26, Date: 18-06-2025


## గోదావరి—బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రితో కిషన్‌రెడ్డి భేటీ



న్యూఢిల్లీ:గోదావరి—బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో చర్చించినట్లు కేంద్ర గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తెలిపారు. తాము ఇరువురం బుధవారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో భేటీ అయ్యామని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా అనేక అంశాలతో పాటు ప్రత్యేకించి గోదావరి—బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చించామని తెలిపారు. ఈ ప్రాజెక్టును తమ మంత్రిత్వ శాఖలో కొనసాగుతున్న నిబంధనల ప్రకారం న్యాయబద్ధంగా పరిశీలిస్తామని, అనంతరం సంబంధిత భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు జరుపుతామని జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ హామీ ఇచ్చినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఏ రాష్ట్రం కూడా అన్యాయానికి గురికాకుండా చూసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. కాగా,గోదావరి – బనకచర్ల ప్రాజెక్టుపై బుధవారం సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని పార్టీల ఎంపిలతో సమావేశాన్ని నిర్వహించింది. దీనికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కూడా ఆహ్వానించగా, బిజెపి ఎంపిలు హాజరయ్యారు. అదే సమయంలో ఆయన ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రితో భేటీ అయిన ఫోటోలను 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

## కాలయాపన చేయొద్దు

### ఎమ్మెల్సీ కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో కాలయాపన చేయడం కాదని, ఢిల్లీలో లొల్లి పెడితే, ప్రాజెక్ట్ ఆగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సూచించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టులో భాగంగా 150 టిఎంసి సామర్థ్యంతో బొల్లాపల్లి వద్ద ఎపి ప్రభుత్వం నిర్మించబోతున్న భారీ రిజర్వాయర్ కారణంగా నల్లమల అడవి మునిగిపోతుందని, దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి బొల్లాపల్లి రిజర్వాయర్‌ను నిర్మించకుండా అడ్డుకోవాలని, లేదంటే పేపర్ పులిగా మిగిలిపోతారని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, బిసి బిల్లు విషయం లో ప్రధాని మోదీతో చర్చించకపోవడం దారుణమన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు చంద్రబాబు వ్యతిరేకం కాదని ఎపి మంత్రి నిమ్మల చెప్పడం విడ్డూరమన్నారు. చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు తెలంగాణ ప్రాజెక్టుల కు వ్యతిరేకంగా లేఖలు రాశారని, సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయించారని గుర్తు చేశారు.


**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము,**
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా

లేఖ నెం.యస్.యస్.టి/2025, (టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన) తేది: 18.06.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:21-06-2025 శనివారము రోజున మ. 2-00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి/నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 04-07-2025 నుండి 03-07-2026 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు, సిరికొండ నవీన్
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 3780-PP/CL/ADVT/1/2025-26, Date: 18-06-2025


## అవును..నా ఫోన్ ట్యాప్ చేశారు

### ఎపి పిసిసి ప్రెసిడెంట్ వై ఎస్. షర్మిల



విశాఖపట్నం : తన ఫోన్ ట్యాపింగ్ జరిగింది అనేది వాస్తవమని ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల అన్నారు. నా ఫోన్, నా భర్త ఫోన్,నా దగ్గర వాళ్ళ ఫోన్‌లు ట్యాప్ చేశారనేది ముమ్మాటికి పచ్చి నిజమని చెప్పా రు. విశాఖపట్నంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైసిపి ఎంపి వై.వి.సుబ్బారెడ్డి నిర్ధారించారని, అనాడు ట్యాపింగ్ జరిగిన నా ఆడియో ఒకటి నాకే వినిపించారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు ఎక్కడికి రమ్మని చెప్పినా వస్తానని చెప్పారు. బైబిల్ మీద ప్రమాణం చేసి చెప్తున్న... ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజమని షర్మిల అన్నారు. తెలంగాణ, ఎపి ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ వేగవంతం చేయాలని కోరారు. అనాడు జగన్, కెసిఆర్ మధ్య ఉన్న సంబంధం చూసి రక్త సంబంధం కూడా చిన్నబోయిందని, తెలంగాణలో తనను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకు ఇద్దరు కలిసి చేసిన జాయింట్ ఆపరేషన్ ఫోన్ ట్యాపింగ్ అని ఆమె ఆరోపించారు. వారిద్దరి అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ చాలా చిన్నదన్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ విషయంలో దర్యాప్తు ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేశారు.


**నేరేడుచర్ల మున్సిపాలిటీ కార్యాలయం, సూర్యాపేట - జిల్లా.**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

టెండర్ నోటీసు నెం.E1/936/03/1-2/MCNDCL/2025-26 తేది: 18.06.2025

దిగువ టెండర్లు ఆహ్వానించబడ్డాయి

| క్ర.సం. | పని పేరు | అంచనా మొత్తం (లక్షల్లో) |
|---|---|---|
| 01. | 2025-26 గ్రీన్ బడ్జెట్ కింద నేరేడుచర్ల మునిసిపాలిటీలో వన మహోత్సవం కింద అవెన్యూ ప్లాంటేషన్ కోసం మొక్కల సేకరణ. | 4.00 |
| 02. | 15వ ఎఫ్‌సిజి/స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ / జనరల్ ఫండ్ కింద నేరేడుచర్ల మునిసిపాలిటీలోని వివిధ ప్రదేశాలలో లోతట్టు ప్రాంతాలు మరియు గుంతలను కంకరతో నింపడం. | 2.00 |
| | బిడ్ డౌన్‌లోడ్ | 19-06-2025 @ 11:00 AM నుండి 23-06-2025 @ 11:00 AM వరకు |
| | సాంకేతిక బిడ్ ప్రారంభం | 23-06-2025 @ 11:01 AM వరకు |

నేరేడుచర్ల మున్సిపాలిటీలో గ్రీన్ బడ్జెట్ & 15వ ఎఫ్‌సిజి / స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ / జనరల్ ఫండ్ . 2025-26 కింద ఇ-ప్రొక్యూర్‌మెంట్ గవర్నమెంట్ పోర్టల్ తెలంగాణ ద్వారా. మరిన్ని వివరాల కోసం దయచేసి https://tender.telangana.gov.in ని సందర్శించండి. పూర్తి వివరాల కోసం పనివేళల్లో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాన్ని సంప్రదించండి. సంప్రదింపు వివరాలు: 9492256688, 6303571223

సం/- కమిషనర్,
నేరేడుచర్ల మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 3747-PP/CL/ADVT/1/2025-26, Date: 18-06-2025

ప్రజాపక్షం
గురువారం, 19 జూన్

# మళ్లీ హిందీ రభస

సమాఖ్య విధానాన్ని ధ్వంసం చేసి, ఏకీకృత పాలనే లక్ష్యంగా ఎంచుకున్న భారతీయ జనతా పార్టీ (బిజెపి), ఏక్షపక్షంగా ముందుకు వెళుతున్నది. దేశ వ్యాప్తంగా హిందీని అన్ని రాష్ట్రాలపై రుద్దడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తునే ఉంది. మహారాష్ట్రలో 'మూడో భాష'గా హిందీని చేర్చడం ద్వారా, బిజెపి తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకుంది. హిందీని విద్యా విధానంలో తప్పనిసరి చేయడం ప్రాంతీయ భాషలకు ముప్పుగా మారుతుందనేది నిజం. ప్రాంతీయ భాషల ప్రాధాన్యత తగ్గిపోతుందన్నది వాస్తవం. హిందీని బలవంతంగా విద్యా ప్రణాళికలో చేర్చడం సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమేకాదు... రాష్ట్రాలకు వారి భాషా విధానాన్ని నిర్ణయించుకునే స్వాతంత్ర్యాన్ని హరించడం కూడా. తమిళనాడు వంటి రాష్ట్రాలు తమ మాతృభాష ప్రాధాన్యతను కాపాడేందుకు ద్విభాషా విధానాన్ని పాటిస్తున్నాయి. హిందీని మూడో భాషగా బలవంతంగా ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎన్ని విమర్శలు ఉన్నప్పటికీ, అటు కేంద్రం, ఇటు బిజెపి పాలిత రాష్ట్రాలు హిందీపై మంకుపట్టు వీడడం లేదు. మహారాష్ట్ర ప్రభుత్వం హిందీని మూడో భాషగా తప్పనిసరి చేయాలన్న నిర్ణయాన్ని తీవ్ర ప్రతిఘటనల నేపథ్యంలో వెనక్కి తీసుకొని, 'సాధారణం' అనే పదాన్ని చేర్చి, మళ్లీ అదే తీర్మానాన్ని తెరపైకి తెచ్చింది. మొదటి తీర్మానంలో 'తప్పనిసరి' అనే పదాన్ని 'సాధారణం'గా మార్చడం మినహా ప్రజాభిప్రాయానికి ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదు. హిందీని తప్పనిసరి చేయడం లేదని, రాష్ట్రాలు తమకు నచ్చిన భాషలను ఎంచుకునే స్వేచ్ఛ ఉందని సన్నాయి నొక్కులు నొక్కుతున్న కేంద్రం, రాజకీయ ప్రయోజనాల కోసం హిందీపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీలపై ఎదురుదాడికి దిగుతోంది. కానీ, వాస్తవ పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి. ఏదో ఒక రూపంలో హిందీని జాతీయ విద్యావిధానంలో భాగం చేయడమే కేంద్రంలోని బిజెపి లక్ష్యంగా కనిపిస్తున్నది. ప్రాంతీయ భాషల ప్రాధాన్యం, భాషా స్వాతంత్ర్యం, సమాఖ్య వ్యవస్థపై ప్రభావం వంటి అంశాలను నిర్లక్ష్యం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం హిందీని విద్యా, పరిపాలన, అధికారిక వ్యవహారాల్లో ప్రోత్సహించే నిర్ణయాలు తీసుకుంటే, ఇతర భాషలు మాట్లాడే రాష్ట్రాల్లో ఇది భాషా ఆధిపత్యంగా మారడం తథ్యం. తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలు తమ భాషా హక్కులను కాపాడేందుకు నిరసనలు, ఉద్యమాలు నిర్వహిస్తున్నాయి. మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం, తిరిగి ఈ వివాదాన్ని మొదటికి తీసుకెళుతున్నది. కేంద్ర ప్రభుత్వం తీసుకునే హిందీ ప్రోత్సాహక లేదా అనుకూల నిర్ణయాలు ప్రాంతీయ అసంతృప్తిని, భాషా వివాదాలను రెచ్చగొడుతున్నాయి. హిందీని విద్యా విధానంలో ఏదో ఒక రకంగా జొప్పించడం దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకతకు దారి తీస్తున్నది. తమిళనాడు, కేరళ, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు తమ ప్రాంతీయ భాషల ప్రాధాన్యతను కాపాడేందుకు కృషి చేస్తున్నాయి. మరోవైపు కేంద్రంలోని బిజెపి కుట్రపూరిత వ్యూహాలతో హిందీని తప్పనిసరి చేసే ప్రయత్నాలు కొనసాగిస్తున్నది. 2020 జాతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలని కేంద్రం ఒత్తిడి చేయడం వల్ల తమిళనాడు వంటి రాష్ట్రాలకు కేంద్ర నిధులు నిలిపివేయడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇది కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో ఉద్రిక్తతకు దారి తీసింది. ఏదిఏమైనా, హిందీని ప్రోత్సహించడాన్ని ప్రాంతీయ భాషలపై ముప్పుగా భావిస్తూ, స్థానిక సంస్కృతి, భాషల మనుగడ రక్షణ కోసం ఆందోళనలు పెరుగుతున్నాయి. భాష ఆధారంగా ఉత్తర –దక్షిణ విభేదాలు, కేంద్ర–రాష్ట్ర విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఇది రాజకీయాలను మరింత ఉద్రిక్తత పరిస్థితుల్లోకి నెడుతున్నది. బిజెపి వారి దృష్టిలో హిందీ జాతీయ భాష. హిందీ–హిందుస్థాన్‌లాంటి నినాదాలు అందులో భాగమే. బిజెపి తన మొండివైఖరిని మానుకోకపోతే, హిందీ మాట్లాడే రాష్ట్రాలు మినహా, దేశ వ్యాప్తంగా భాషా ఉద్యమాలు ఉధృతం కావడం ఖాయం.

# ఆపరేషన్ సిందూర్‌పై భారత ప్రభుత్వ విఫల దౌత్యం



పల్లభ్ సేన్ గుప్తా
సిపిఐ జాతీయ కార్యదర్శి

పెహల్గామ్‌లో జరిగిన దారుణ ఉగ్రవాద దాడి, అమాయక ప్రాణాలను బలిగొని, దేశ ఆంతరాత్మను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడి విస్తృత స్థాయిలో ఖండించబడడంతోపాటు, బాధలో ఉన్న భారత ప్రజలను విభజించకుండా ఏకం చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని నిరంతరం ప్రోత్సహిస్తుందని పాకిస్తాన్‌ను ఎండగట్టే ప్రయత్నాలను దాడి జరిగిన తర్వాత భారత ప్రభుత్వం ముమ్మరం చేసింది. ఆపరేషన్ సింధూర్ ఊపందుకోవడంతో, ఇస్లామాబాద్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసే లక్ష్యంతో న్యూఢిల్లీ ఉన్నత స్థాయి దౌత్యపరమైన దాడిని ప్రారంభించింది. అంతర్జాతీయ అభిప్రాయాన్ని సమీకరించడానికి, భారత దేశ వైఖరికి మద్దతును కూడగట్టేందుకు కీలక ప్రపంచ దేశాల రాజధానులకు అఖిలపక్ష ప్రతినిధి బృందం పంపబడింది. పాకిస్తాన్ మీద స్పష్టమైన దౌత్యపరమైన అభిశంసనను కూడగట్టేందుకు, ఆ దేశానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) వంటి సంస్థల నుండి ఆర్థిక సహాయం లభించకుండా అడ్డుకోవడం అనే రెండు స్పష్టమన లక్ష్యాలతో ఈ చొరవ చేయబడింది.

భారతదేశం వైఖరిలో నైతిక స్పష్టత ఉన్నప్పటికీ, ఉగ్రవాదాన్ని పెంపొందించడంలో పాకిస్తాన్ ప్రమేయంపై బలమైన సాక్ష్యం ఉన్నప్పటికీ, దౌత్య ప్రచారం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంది. భౌగోళిక రాజకీయ లెక్కలు, వ్యూహాత్మక ప్రయోజనాల ఆధారంగా నడిచే ప్రధాన శక్తులు భారతదేశ ప్రయత్నాలకు సంపూర్ణ మద్దతు ఇవ్వడంలో అనాసక్తిగా ఉన్నాయి. అంతేకాకుండా, అఖిలపక్ష ప్రతినిధి బృందం ప్రయాణ ప్రణాళిక నుండి పొరుగు దేశాలను మినహాయించారు; వారు ఉగ్రవాద దాడులను ఖండించినప్పటికీ, పాకిస్తాన్‌పై భారత దేశ వైఖరికి మద్దతు ఇవ్వడంలో మౌనంగా ఉన్నారు.

ఈ మొత్తం కసరత్తును అధికార ప్రభుత్వ లోపభూయిష్ట , దిగజారుడు ప్రాధాన్యతలకు ప్రతిబింబంగా భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం చూసింది. విదేశీ సానుభూతిని పొందటానికి ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపేందుకు ప్రభుత్వానికి సమయం దొరికినప్పటికీ, ఆపరేషన్ సింధూర్ పర్యవసానాలు, లక్ష్యాలు, పరిణామాలను చర్చించేందుకు దేశంలో అత్యున్నత ప్రజాస్వామిక వేదిక అయిన భారత పార్లమెంటును ఉద్దేశపూర్వకంగా సమావేశపరచకుండా నివారించింది. పార్లమెంటును ఉద్దేశపూర్వకంగా దాటవేయడం ఒక నిరంకుశ వైఖరిని, ప్రజాస్వామ్య జవాబుదారీతనం పట్ల తీవ్ర అమర్యాదను ప్రతిబింబిస్తుంది. భారత ప్రజల ఎన్నికైన ప్రతినిధులకు తెలియజేయడం, వారిని భాగస్వామ్యం చేయడం కాకుండా, ప్రభుత్వం తన కథనాన్ని విదేశాలలో ప్రచారం చేయడానికి ఎంచుకుంది. అంతర్గత పారదర్శకత కంటే అంతర్జాతీయంగా ప్రచారం చేసుకోవడం కోసమే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది.



> కీలకమైన వ్యూహాత్మక, రాజకీయ, ప్రాంతీయ చిక్కులను కలిగి ఉన్న ఏదైనా ఆపరేషన్ గురించి పార్లమెంటులో చర్చించబడాలని మేము విశ్వసించాము. ఒకవేళ పరిస్థితి ఇతర దేశాలకు బహుళ–పార్టీల ప్రతినిధి బృందాలను పంపడానికి అనుమతించినట్లయితే, ఒకవైపు అంత–ర్జాతీయ శ్రోతలకే ఎంపిక చేసిన వివరా–లను ఇచ్చినప్పుడు, మన దేశంలోని ప్రజాస్వామ్య సంస్థలను ఎందుకు చీక–టిలో ఉంచారు? ఈ ప్రశ్నలకు సమా–ధానం లేదు. తన స్వంత చట్టసభల కంటే విదేశీ రాజధానులను మరింత గౌరవంగా చూసే ప్రభుత్వ నిర్ణయం పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు అవమానం.

అంతేకాకుండా, ప్రభుత్వం సైనిక కథనాలు, బాహ్య ప్రపంచానికి వెల్లడిపైనే అధికంగా ఆధారపడడం పట్ల సిపిఐ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అయితే ఎటువంటి గణనీయమైన దౌత్యపరమైన ప్రయోజనాలను సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. 33 దేశాలకు పంపిన ప్రతినిధి బృందాలకు ఉచ్ఛ స్వర మీడియా వాక్చాతుర్యం, జాతీయవా దం, భారతదేశం 'పాకిస్తాన్‌ను దౌత్యపరంగా ఒంటరి చేయబోతోంది' అనే వాదనలు తోడయ్యాయి. అయితే, ఫలితాలు భిన్నమైన కథను చెబుతున్నాయి. జపాన్, దక్షిణ కొరియా, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్ దేశాలను సందర్శించిన ప్రతినిధి బృందంలో సభ్యుడైన టిఎంసి ఎంపి అభిషేక్ బెనర్జీ 'ఎన్ని దేశాలు భారతదేశానికి స్పష్టమైన మద్దతును అందించాయి?' అని ప్రశ్నించారు.

మన ప్రతినిధి బృందాలు వివిధ దేశాలను సందర్శిస్తున్న సమయంలోనే పాకిస్తాన్ ప్రధాన శక్తులతో దౌత్యపరంగా నిమగ్నమై ఉంది. పాకిస్తాన్‌పై అంతర్జాతీయ సమాజం అర్థవంతమైన ఆంక్షలు విధించడానికి లేదా ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడానికి ఎటువంటి సంసిద్ధతను ప్రదర్శించలేదు. భారతదేశ అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ బెయిల్ ఔట్(బైటపడేందుకు ఆర్థిక సహాయం)ను ఆమోదించింది. ఎడిబి సహాయాన్ని స్తంభింపజేయడానికి బదులుగా, అక్కడ అభివృద్ధి ప్రాజెక్టులకు సహకరించడాన్ని కొనసాగించింది. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక సంస్థలలో భారతదేశం కలిగి ఉన్న వాస్తవ పరిమిత ప్రభావాన్ని స్పష్టం చేశాయి. మరీ ముఖ్యంగా, శాశ్వతమైన, సమస్య ఆధారిత ప్రపంచ కూటములను నిర్మించడంలో ప్రభుత్వం వైఫల్యాన్ని ఎత్తిచూపాయి.

మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, భారతదేశం కథనాన్ని తన స్వంత వ్యూహాత్మక భాగస్వామి పట్టించుకోలేదు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య 'సంఘర్షణను పరిష్కరించిన' ఘనత తనదేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బహిరంగంగా చెప్పుకున్నారు. తద్వారా సంక్షోభాన్ని భారతదేశ చట్టబద్ధమైన రక్షణాత్మక ఆపరేషన్‌గా కాకుండా, వాషింగ్టన్ మధ్యవర్తిత్వం చేసి పరిష్కరించిన ద్వైపాక్షిక వివాదంగా చిత్రీకరించబడింది. భారతదేశం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ఎత్తిచూపడానికి బదులు, అలాంటి ప్రకటనలు భారతదేశం స్థాయిని బాహ్య శక్తుల ద్వారా నిర్వహించబడే ఒక లొంగిపోయే ప్రాంతీయ రాజ్యంగా తగ్గించాయి. ఈ దౌత్యపరమైన ఇబ్బందిని భారత ప్రభుత్వం పరిష్కరించకుండా వదిలివేసింది. జయప్రదమైన విదేశాంగ విధాన ప్రచారాన్ని నిర్వహించామనే వాదనను మరింత దెబ్బతీసింది.

ఈ సంఘటన ప్రస్తుత పాలనలో భారత దౌత్యంలో విస్తృత మార్పునకు ప్రతీక. ఇది విషయం కంటే దృశ్యానికి, ఏకాభిప్రాయం కంటే ఏకపక్షవాదానికి, అంతర్గత ప్రజాస్వామ్య ప్రక్రియల కంటే బాహ్య ధృవీకరణకు ప్రాధాన్యత ఇస్తుంది.

> ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిజమైన లేదా ఆశించిన పోరాటం అనేది సాహసోపేత చర్యలకు లేదా నిరంకుశత్వానికి సాకుగా మారకూడదనే తన దీర్ఘకాలిక వైఖరిని సిపిఐ పునరుద్ఘాటిస్తుంది. ప్రజాస్వామ్య చర్చ, ప్రాంతీయ దౌత్యం, శాంతి, న్యాయంలో వేళ్ళూనుకున్న స్వతంత్ర విదే–శాంగ విధానానికి సైనికవాదం గానీ, ప్రపంచ లాబీయింగ్ గానీ ప్రత్యామ్నాయం కాదు.

దేశీయ ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరుస్తూ, ప్రతీకాత్మక అంతర్జాతీయంగా చేరువవడం ద్వారా బలప్రదర్శనకు ప్రభుత్వం చేసిన ప్రయత్నం జాతీయ ఐక్యత, అంతర్జాతీయ విశ్వసనీయతలను రెండింటినీ దెబ్బతీసే ప్రమాదకరమైన మార్గం.

అంతేకాకుండా, అంతర్గతంగా అసమ్మతిని క్రియాశీలంగా అణచివేసినప్పుడు, విమర్శకులను దేశద్రోహులుగా ముద్రవేసినప్పుడు, పార్లమెంటు ఎదుట ఈ విషయాన్ని ఉంచడానికి నిరాకరించినప్పుడు, బాహ్య ప్రచారం కోసం అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేశారనే ప్రభుత్వ వాదన డొల్లగా మారింది. నిజమైన ప్రజాస్వామ్య విదేశాంగ విధానం అంతర్గత ప్రజాస్వామ్య ఏకాభిప్రాయం నుండి ఉద్భవించాలి. పార్లమెంటును సమావేశపరచడంలో విఫలమవడం ద్వారా, శాంతి ప్రవచకులు, ప్రాంతీయ నిపుణులు, ప్రతిపక్ష నాయకులతో సహా ప్రత్యామ్నాయ గొంతుకలను భారతదేశ ప్రతిస్పందన రూపొందే ప్రక్రియ నుంచి వేరు చేశారు.

ఆపరేషన్ సిందూర్ అనంతర ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలతో దౌత్య ప్రయత్నం, మీడియా సంచలనాలు, పాకిస్తాన్‌ను ఒంటరి చేశామనే డొల్ల వాదనలు విఫలమైనట్లు బహిర్గతమైంది. ఇది సైనిక చర్యలను అర్థవంతమైన దౌత్య ఫలితాలుగా మార్చడంలో వర్తమాన ప్రభుత్వ అసమర్థతను బైటపెట్టింది.

మరింత ముఖ్యంగా, ఇది ప్రజాస్వామ్య ప్రక్రియలను దాటవేయడం, దేశంలో పారదర్శకతను నిరాకరిస్తూ విదేశాలలో చట్టబద్ధతను కోరడం వంటి చర్యలు కలవరపెట్టే విధానాలను ప్రతిబింబించింది. ఈ అప్రజాస్వామ్య విదేశాంగ విధాన విధానాన్ని తిరస్కరించి, ప్రజాస్వామ్య జవాబుదారీతనం, ప్రాంతీయ శాంతి, సూత్రప్రాయమైన దౌత్య విధానానికి తిరిగి రావాలని డిమాండ్ చేయాలని భారత ప్రజానీకానికి సిపిఐ పిలుపునిస్తోంది.

# కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైన కామ్రేడ్ సుగుణ

స్వాతంత్ర్య పోరాట యోధురాలు, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని, కీలక బాధ్యతలు నిర్వహించి, అనేక త్యాగాలు చేసిన పోరాట యోధురాలు కామ్రేడ్ సుగుణ 91 సంవత్సరాలపాటు జీవించి 2025 జూన్ 16న చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో చివరి శ్వాస విడిచారు. కామ్రేడ్ సుగుణ మరణంతో వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటంతో ప్రత్యక్ష సంబంధం ఉన్న తరమంతా దాదాపు ముగిసిందని భావించవచ్చు. మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో కామ్రేడ్ సుగుణకి ఆమె కుటుంబానికీ ప్రత్యేక స్థానం ఉంటుందని ఎలాంటి సందేహం లేదు.

తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచ విప్లవాల చరిత్రలోనే ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ సాయుధ పోరాటం ఆరు సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు కొనసాగింది. నిజాం రాచరికానికి వ్యతిరేకంగా, భూస్వాముల దోపిడీకి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, 'దొర నీబాంచన్ కాళ్ళు మొక్కుతా' అనే సామాన్య ప్రజలే సాయుధులై రాచరికాన్ని, రాజ్యాధికారాన్ని కూల్చిన చరిత్ర ఈ పోరాటానికి ఉంది. ఆ మహత్తర పోరాట రహస్యకేంద్ర స్థావరానికి బాధ్యులుగా పనిచేసిన విప్లవకారిణి కామ్రేడ్ సుగుణ.

### కుటుంబ నేపథ్యం

కామ్రేడ్ సుగుణ 1934లో నల్లగొండ జిల్లా బీబీ నగర్ దగ్గర్లో ఉన్న బ్రాహ్మణపల్లిలో జన్మించారు. తండ్రి కొమ్మిడి రామచంద్రారెడ్డి, తల్లి లక్ష్మ మ్మ. వీరిది ధనిక రైతు కుటుంబం. సుగుణ గారికి ఒక అన్నయ్య ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు అక్కలు. అన్నయ్య కోదండరామిరెడ్డి, తమ్ముళ్లు బుచ్చిరెడ్డి ,నరసింహారెడ్డి. అక్కలు అమృతమ్మ, శశిరేఖలు. చిన్నతనంలోనే అమృతమ్మ అనారోగ్యంతో, చిన్న తమ్ముడు బుచ్చిరెడ్డి యాక్సి డెంట్లో చనిపోయారు. సాయుధ పోరాటం కొనసాగే కాలంలో యుక్త వయసులో ఉన్న కోదండరామిరెడ్డి, శశిరేఖ, సుగుణమ్మ ఉద్యమమే వృత్తిగా స్వీకరించి ప్రాణాలకు తెగించి పోరాటంలో దూకారు. కోదండరామిరెడ్డి పోరాటంలో పోలీసుల కాల్పుల్లో వీరమరణం పొందాడు. శశిరేఖ భర్త కాల్వ నారాయణరెడ్డి తన దళంలో ఉన్న నలుగురు కామ్రేడ్స్ పోలీస్ కాల్పులలో చనిపోగా తాను తప్పించుకొనే క్రమంలో తీవ్రంగా గాయపడి పోలీసులకు చిక్కి సంవత్సరాల తరబడి జైలు పాలయ్యారు. మరో చోట అక్క శశిరేఖ అరెస్టు అయి సంవత్సరాల తరబడి జైల్లో ఉంది. అలాంటి త్యాగమూర్తుల కుటుంబం నుండి వచ్చినవారే కామ్రేడ్ సుగుణ.

సుగుణ అన్నయ్య కోదండరామిరెడ్డి, సుగుణ యుక్త వయసు వచ్చేనాటికే కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా పని చేస్తున్నాడు. భీమిరెడ్డి నరసింహారెడ్డి, కోదండరామిరెడ్డి మంచి మిత్రులు. భీమిరెడ్డి నరసింహారెడ్డి నల్లగొండ జిల్లా బాధ్యతలు చూసేవారు. ఆ సమయాన కోదండరామిరెడ్డి హైదరాబాదు, పరిసర జిల్లాలను కలిపి పిలువబడే 'అత్రఫ్ బల్దా' జిల్లా బాధ్యతలు చూసేవారు. సుగుణకి అన్నయ్య కోదండ రామిరెడ్డే గురువు. స్ఫూర్తి ప్రదాత.

### ఉద్యమ ప్రస్థానం

అన్నయ్య కోదండరామిరెడ్డి ద్వారానే కామ్రేడ్ సుగుణకు చిన్నతనం నుండే ఆర్య సమాజ్, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలతో అనుబంధం ఏర్పడింది. రావి నారాయణ రెడ్డి, భీమిరెడ్డి నరసింహా రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు తరచుగా సుగుణ ఇంటికి వచ్చేవారు. వారిని చూసే అవకాశం, కలిసే అవకాశం, చర్చించే అవకాశం ఆమెకు లభించింది. తన అన్నయ్య కోదండరామిరెడ్డి తన సోదరి శశిరేఖను, భీమిరెడ్డి గారి సోదరి మల్లు స్వరాజ్యమును విజయవాడలో జరిగే రాజకీయ ట్రైనింగ్ క్యాంపుకి పార్టీ పంపింది. తనని ఇంకా చిన్న పిల్లవేనని పంపకపోవటానికి సుగుణ చాలా బాధపడింది. మరింత పట్టుదలని పెంచుకున్నారు. తాను దళాల్లోకి వెళ్లాలని, తుపాకి పట్టుకోవాలనే ఆకాంక్షను ఎప్పుడు నాయకుల ముందు పెట్టేవారు. వారు నీకు ఇంకా సమయం ఉందిలే అనేవారు. తన అక్క శశిరేఖ, మల్లు స్వరాజ్యం ఆయుధాలతో, దళాలతో కనపడుతుంటే ఉడికి పోయేవారు.



పార్టీ నాయకులు కలిసినప్పుడల్లా తనకు ఎప్పుడు పార్టీ సభ్యత్వం ఇస్తారు అని అడిగేవారు. నీకు ఇంకా వయసు రాలేదు కనీసం 16 సంవత్సరాలు ఉంటేనే నీకు సభ్యత్వం ఇస్తారని నాయకులు చెప్పేవారు. కామ్రేడ్ సుగుణ పోరు భరించలేకనో, పార్టీ అవసరాల రీత్యానైతేనేమి 16 సంవత్సరాల లోపే స్వయంగా రావి నారాయణరెడ్డి గారి ద్వారానే ఆమె పార్టీ సభ్యత్వం పొందారు.

పార్టీ కేంద్ర రహస్య స్థావరంగా ఉండే 'డెన్' బాధ్యతలు అప్పచెప్పారు. కామ్రేడ్ సుగుణతోపాటు కామ్రేడ్ వెంకటాచారి (చారి), అనిరెడ్డి అనంతరెడ్డి (హైకోర్టు అడ్వకేట్‌గా పని చేశారు) కూడా ఉన్నారు. ఈ ముగ్గురితో 'డెన్' నిర్వహణకు కమిటీ ఉండేది. పార్టీ కేంద్రం చాలా రహస్యంగా ఉండేది. పరిమితమైన అతి ముఖ్య నాయకులు మాత్రమే జాగ్రత్తగా వచ్చి పోయేవారు. 'డెన్' (పార్టీ రహస్య కేంద్రం) నిర్వహించే ఆ ముగ్గురి ప్రధానమైన పని పార్టీ డాక్యుమెంట్‌ని కాపీలు చేయటము, సర్క్యూలర్స్ తయారుచేసి పంపడం, సమాచారాన్ని సేకరించటం, అవసరమైన కామ్రేడ్స్‌కి అందజేయడం. కామ్రేడ్ సుగుణ దృష్టి అంతా తుపాకీ పోరాటం చుట్టే ఉండేది. కాబట్టి తన అసంతృప్తిని కామ్రేడ్ రావి నారాయణరెడ్డి సమక్షాన వెలుబుచ్చారు. మీరు చేసే పని చిన్నదిగా తక్కువగా భావించవద్దు. ఇది చాలా కీలకమైనది. ఇది అందరూ చేయలేనిది. ఎంతో నమ్మకం, క్రమశిక్షణ కలిగిన వారు మాత్రమే చేయగలిగింది. వారికి ప్రత్యేకంగా నైపుణ్యం ఉండాలి. వారికి రాయగలిగే శక్తి, అర్థం చేసుకోగలిగే శక్తి అవసరం. అవన్నీ మీకు ఉన్నాయని భావించే పార్టీ మిమ్మల్ని ఇక్కడ ఉంచింది. ఇది మన విప్లవ కార్యక్రమంలో ఒక ప్రధా నమైన భాగంగా మీరు గుర్తించాలి. మేము ఏ దళంలో లేము కదా? అంటే మా పనికి ప్రాధాన్యత లేదా? ప్రశ్నించారట. అందరు నాయకులు చెప్పటంతో కొంత కుదుటబడ్డారు. ప్రత్యేకంగా కామ్రేడ్ సుందరయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు కూడా రహస్య డెన్ యొక్క ప్రాధాన్యతని అర్థం చేయించారు.

ఆ కేంద్రానికి సుందరయ్య, బసవపున్నయ్య, చంద్ర రాజేశ్వరరావు, మగ్దుం మొయినుద్దీన్, రాజ్ బహదూర్ గౌర్, రావి నారాయణ రెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, మేజర్ జైపాల్‌సింగ్‌లాంటి కేంద్ర జాతీయ నాయకులు మాత్రమే వచ్చేవారు. ఆ కేంద్రం ప్రాధాన్యతేమిటో నెమ్మదినెమ్మదిగా ఆమె అర్థం చేసుకున్నారు.

### ఎస్‌వికె ప్రసాద్‌తో వివాహం

సాయుధ పోరాటం ప్రారంభమైన తర్వాత ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ తెలంగాణలో పార్టీని పటిష్ట పరచటానికి ఆంధ్ర నుండి ఎస్వీకే ప్రసాద్‌ని తెలంగాణకు పంపడం జరిగింది. ఆయన కూడా అప్పుడప్పుడు 'డెన్'కి వచ్చి పోయేవారు. పరిచయాలు పెరిగాయి. ఆ పరిచయం పెళ్ళి వరకు వచ్చింది. 1949 నవంబర్ 25వ తారీఖు నాడు వారి పెళ్లి జరిగింది. ఆ పెళ్లి నిర్వహించింది రావి నారాయణరెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు గారలే. పెళ్లయిన కొంతకాలానికే ఎస్‌వికె ప్రసాద్ హైదరాబాదులో పోలీసుల చేతికి చిక్కాడు. దాదాపు నాలుగు సంవత్సరాల పాటు జైల్లో ఉండి 1954లో సుప్రీంకోర్టు జోక్యంతో విడుదలైనారు.

పార్టీలో కామ్రేడ్ సుగుణ కీలకపాత్ర వహించిన విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చి ఆమెపై వారంట్ అయింది. ఆమె కోసం పోలీసులు తిరగటం ప్రారంభించారు. కొంతకాలం రహస్య జీవితం గడిపిన తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. రెండు సంవత్సరాల పాటు జైల్లో ఉండి 1952లో విడుదల అయింది. తెలంగాణలోనే ఉండి ఇక్కడ కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి భార్యాభర్తలిద్దరు జీవితాంతం కృషి చేస్తూ వచ్చారు. వరంగల్లు జిల్లా చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994లో ప్రసాద్ చనిపోయారు. ఆ ఆదర్శ దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులున్నారు. కూతురు డాక్టర్ శోభ, కుమారులు రవి, రమేష్‌లు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు. సుగుణ చివరి వరకు మహిళా ఉద్యమాల్లో చురుకైన పాత్ర వహించారు.

### కమ్యూనిస్టు ఉద్యమంలోనే కొనసాగుతూ వచ్చారు

వారు చివరి దశలో, ఆరోగ్యం క్షీణిస్తున్నా కూడా ప్రజల పరిస్థితి గురించే చర్చించేవారు. పెచ్చరిల్లుతున్న మూఢ నమ్మకాలు, అవినీతి, మతోన్మాదం తదితర అంశాల పట్ల ఆవేదన వ్యక్తపరిచేవారు. ప్రస్తుత పరిస్థితులలో కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యం కావలసిన అవసరం ఉందని నొక్కి చెప్పేవారు. ఎన్నికలలో పాల్గొనే కమ్యూనిస్టు పార్టీలైనా, ఒక సంఘటనగా ఏర్పాటు కావాలని ఆకాంక్షించేవారు. 2001 నుండి ఈ అంశాలు గురించి నేను చెప్తూనే వస్తున్నాను అని తాను ఇంగువ మల్లికార్జున శర్మకి ఇంటర్వ్యూలో చెప్పిన విషయాలని ఎప్పుడూ జ్ఞాపకం చేస్తూ ఉండేవారు.

కామ్రేడ్ సుగుణ ఈ తరానికి పెద్దగా తెలువకపోవచ్చు కూడా. కానీ గత తరాల వారందరికీ ఆమె గొప్పతనం, ఆమె త్యాగం, ఆమె కుటుంబ నేపథ్యం ఏమిటో తెలుసు. ఆ కుటుంబం యొక్క ప్రత్యేకత ఏంటో తెలుసు. సుగుణ గారి ఆశయాలను నెరవేర్చటమే ఆమె గారికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

**— జి.రాములు**
**9490098006 (17-6-2025)**

**కామ్రేడ్ సుగుణ అంత్యక్రియలు 19 జూన్ 2025న (నేడు) మధ్యాహ్నం 2 గంటలకు మహాప్రస్థానంలో..**

# ప్రపంచ వినాశనం తప్పదా?

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న సాయుధ పోరాటం ఎటువంటి మలుపులు తిరుగుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. ఇరాన్ అణు కార్యక్రమం విస్తరణను ఆపాలనే లక్ష్యంతో ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ అనే సంకేత నామంతో, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్, మొసాద్ కీలకమైన అణు స్థావరాలు, సైనిక స్థావరాలు, పౌరులు నివసించే నివాస ప్రాంతాలపై దాడి చేశాయి. జూన్ 13 సాయంత్రం నుండి ప్రారంభమైన ఇరాన్ యొక్క ప్రతీకార ఆపరేషన్ ట్రూ ప్రామిస్ III బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లతో సైనిక స్థావరాలు, నిఘా ప్రదేశాలు, నివాస ప్రాంతాలలో ప్రయోగించారు.

ఇరాన్ అణు కార్యక్రమంతో పాటు, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ ముప్పుగా భావిస్తోంది. ఇరాన్ ప్రతి నెలా 300 బాలిస్టిక్ క్షిపణులను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఇది ఇజ్రాయెల్ నగరాలకు ప్రత్యక్ష ముప్పుగా భావిస్తున్నారు ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు.

**ఎవరి సామర్థ్యమెంత.?**

ఇరాన్ భౌగోళికంగా ఇజ్రాయెల్ కంటే పెద్దది. అలాగే 9 కోట్ల జనాభా ఉంది. ఇది ఇజ్రాయెల్ జనాభా కంటే పదింతలు ఎక్కువ. ఈ లెక్కలను బట్టి ఇరాన్ గొప్ప సైనిక శక్తి అనుకోలేం. క్షిపణులు, డ్రోన్స్‌పై ఇరాన్ భారీగా ఖర్చు చేస్తోంది. దానికి విస్తారమైన ఆయుధ సంపత్తి ఉంది. అలాగే యెమెన్‌లోని హౌతీలకు, లెబనాన్‌లోని హిజ్బుల్లా గ్రూపులకు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ఆయుధ సంపత్తిని సరఫరా చేస్తోంది. అయితే ఆధునిక రక్షణ వ్యవస్థ, యుద్ధ విమానాలు ఇరాన్‌కు కొరతగానే మిగిలాయి. యుక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు టెహ్రాన్ ఇచ్చిన మద్దతుకు బదులుగా ఇరాన్ తన ఆయుధసంపత్తిని ఆధునీకరించేందుకు రష్యా సహకరిస్తుందని నమ్ముతున్నారు. ఇరాన్ రష్యాకు షాహిద్ డ్రోన్లను అందించింది. ప్రస్తుతం రష్యా వీటిని సొంతంగా తయారుచేసుకుంటోంది.

అయితే ఇజ్రాయెల్ వద్ద ప్రపంచంలోనే అధునాతన వైమానిక దళం ఉంది. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్ట్రాటిజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్) నివేదిక ప్రకారం ఇజ్రాయిల్ వద్ద ఎఫ్15, ఎఫ్16 తోపాటు అధునాత ఎఫ్35 స్టెల్త్ ఎయిర్‌క్రాఫ్ట్స్ సహా కనీసం 14 ఎయిర్‌క్రాఫ్ట్ స్క్వాడ్రన్స్ ఉన్నాయి. శత్రువుల భూభాగంలో దాడులు చేసిన అనుభవం కూడా ఇజ్రాయెల్‌కు ఉంది. ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్ భూభాగంపై దాడికి దిగడంతో మధ్యప్రాచ్యంలో ఈ పాత శత్రుదేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి.

**యుద్ధంలో అమెరికా పాత్ర..**

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో, అమెరికా ఈ యుద్ధంలో చేరే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికాకు చెందిన పదుల సంఖ్యలో యుద్ధవిమానాలు మధ్యప్రాచ్య ప్రాంతం (మిడిల్ ఈస్ట్) వైపుగా తరలిస్తున్నట్టు సామాజిక మాధ్యమాల్లో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. యుద్ధానికి మద్దతుగా అమెరికా రంగంలోకి దిగుతుందని అనుమానాలు వ్యక్తమవుతున్న సందర్భంలో ఇది ఇజ్రాయెల్‌కు మరింత బలాన్నిచ్చే పరిణామం. ఈ నేపథ్యంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు యుద్ధంలో అమెరికా పాత్రపై మరింత ఆసక్తి రేపుతున్నాయి.

**— జాజుల దినేష్**
**9666238266**

# 'సికిల్ సెల్ రక్తహీనత' ప్రాణాంతకం!

తల్లితండ్రుల నుంచి సంక్రమించే జన్యులోప రుగ్మతగా సికిల్ సెల్ రక్తహీనత ప్రమాదకరంగా మారుతోంది. శరీర కణజాలానికి ప్రాణవాయువు, ఆక్సీజన్‌ను అందించే రక్తంలోని ఎర్ర రక్తకణాలతో కూడిన హీమోగ్లోబిన్ ఉపకరిస్తుంది. ఆక్సీజన్‌ను సరఫరా చేస్తున్న ఎర్ర రక్త కణాలు గుండ్రంగా, మృదువుగా, ఫ్లెగ్జిబుల్‌గా ఉంటూ రక్త నాళాల గుండా సులభంగా ప్రవహిస్తూ, మన ఆరోగ్యానికి పునాదులు వేస్తున్నాయి. సికిల్ సెల్ రుగ్మత బారిన పడిన వ్యక్తుల ఎర్ర రక్త కణాలు దృఢంగా, గట్టిగా, అంటుకునే గుణంతో, సిఆకారంలో కొడవలి లేదా సికిల్ ఆకారంలో ఉంటాయి. ఆ సికిల్ కణాలు రక్తనాళాల్లో సులభంగా ప్రవహించకుండా, త్వరగా చనిపోతూ ఉంటాయి. ఇలాంటి సికిల్ సెల్ రుగ్మత ఉన్న వారిలో దీర్ఘకాలిక రక్తహీనత, నొప్పులు, అవయవాలకు హాని, ఇతర తీవ్రమైన అనారోగ్యాలను కలిగిస్తుంది. దీనినే సికిల్ సెల్ రుగ్మతగా పిలవడం జరుగుతోంది.

సికిల్ సెల్ రక్త రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షలతో గుర్తించడం, వ్యాధిగ్రస్తుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం, రోగుల కుటుంబాల్లో ఆత్మ విశ్వాసం పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఐక్యరాజ్యసమితి కృషి చేస్తున్నది.

భారత గిరిజన తెగల్లో అత్యధికంగా కనిపిస్తున్న సికిల్ సెల్ వ్యాధి ప్రమాదకరంగా మారుతోంది. 2011 వివరాల ప్రకారం 8.6 శాతం గిరిజన జనాభా లేదా 67.8 మిలియన్ల అభాగ్యులు సికిల్ సెల్ రుగ్మత బారిన పడ్డట్లు స్పష్టం అవుతున్నది. భారతదేశంలో యంపీ, ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, ఒడిసా, గుజరాత్, మహారాష్ట్ర లాంటి 17 రాష్ట్రాలు/యూటీల్లో అధికంగా కనిపిస్తున్న సికిల్ సెల్ వ్యాధిగ్రస్థులు కనిపిస్తున్నారు. వ్యాధి తీవ్రతను గుర్తించిన భారత ప్రభుత్వం జాతీయ సికిల్ సెల్ రక్తహీనత నిర్మూలన మిషన్‌ను తీసుకోని 2047 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించడానికి పథక రచన చేసి అమలు పరుస్తున్నారు. ఈ మిషన్‌లో భాగంగా 2026 నాటికి 7 కోట్ల గిరిజనులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి కృషి జరుగుతోంది.

జన్యువుల్లో మ్యుటేషన్ లేదా ఒకదానితో మరొకటి మార్పు చెందడం వల్ల హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో లోపం జరుగుతుంది. తల్లిదండ్రులు ఇద్దరిలో ఇలాంటి జన్యు లోపాలు ఉన్నట్లు అయితే వారి సంతానానికి కూడా సికిల్ సెల్ రుగ్మత సంక్రమిస్తుంది. తల్లిదండ్రుల్లో ఒక్కరికి మాత్రమే జన్యు లోపం ఉన్నట్లైతే పిల్లల్లో జన్యు లోపాలు కనిపించినప్పటికీ రోగ లక్షణాలు మాత్రం కనిపించకపోవచ్చని తెలుసుకోవాలి.

సికిల్ సెల్ వ్యాధులు (హీమోగ్లోబిన్ ఎస్ఎస్, ఎస్‌ఐ, ఎస్ బీటా తలసేమియా లాంటివి) పలు రకాలుగా ఉంటాయని, వీటిని త్వరగా గుర్తించడం వల్ల వ్యక్తుల జీవితాల్లో ఆరోగ్యాలను పెంచవచ్చని, ఆరోగ్య సురక్ష గొడుగు పట్టవచ్చని తెలుసుకోవాలి.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఇకపై 15 రోజుల్లోనే ఓటర్ ఐడి కార్డులు డెలివరీ

**న్యూఢిల్లీ :** ఓటర్లకు ఐడి కార్డులు త్వరితగతిన అందించేందుకు కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. ఎన్నికల రిజిస్టర్‌లో దరఖాస్తుకు సంబంధించిన మార్పులు జరిగిన 15 రోజుల్లోపే ఓటర్ ఐడి కార్డులు (ఇపిఐసి) ఓటర్లకు చేరేలా ఈ కొత్త విధానం తీసుకొచ్చినట్లు పేర్కొంది. కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్న వారితో సహా, ఇప్పటికే ఉన్న ఓటరు వివరాల్లో మార్పులు చేసిన వారికి కూడా 15 రోజుల్లోనే కార్డును డెలివరీ చేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం ఓటర్లకు ఓటర్ ఐడి కార్డులు అందడానికి ఒక నెలకు పైగా సమయం పడుతోందని అధికారులు చెబుతున్నా రు. అయితే, ఈ కొత్త వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయబోతున్నారు. ఈ కొత్త విధానంలో, ఓటర్ కార్డు తయారవడం నుంచి ఓటరుకు అందే వరకు ప్రతి దశలో పర్యవేక్షించడం కోసం రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు ఇసి వివరించింది. ఈ ప్రక్రియను ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. అంతేకాక, ప్రతి దశలో ఓటర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా ఓటర్లు తమ ఓటర్ ఐడి కార్డు స్థితిని తెలుసుకోవడానికి వీలవుతుంది.

# ఉగ్రవాద సవాల్‌పై ఉదాసీన వైఖరి తగదు

జి7నేతలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ
పహల్గామ్ ఉగ్రదాడి ప్రతీ భారతీయుడి
'ఆత్మ, గుర్తింపు, గౌరవం'పై ప్రత్యక్షదాడి అని వ్యాఖ్య



**కననాస్కిస్ (కెనడా) :** భారతదేశ పొరుగు ప్రాంతం ఉగ్రవాదానికి నిలయంగా మారుతోన్న నేపథ్యంలో ఈ సవాల్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఉగ్రవాదం పట్ల 'మానవత్వానికి ద్రోహం' చేయడమే అవుతుందని, చూసీచూడనట్లు ప్రవర్తించడం తగదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జి7 నాయకులకు ఉద్బోధించారు. సరిహద్దు ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్న పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ వారిని కోరారు. ఆయన ఇక్కడ జరిగిన జి7 సభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ దాడి ప్రతీ భారతీయుడి 'ఆత్మ, గుర్తింపు, గౌరవం'పై ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని సమర్థించే ఏ దేశమైనా జవాబుదారీగా ఉండాలని, అంతేకాకుండా మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద ప్రమాణాలకు తావు ఉండరాదన్నారు. 'ఉగ్రవాదం వ్యాప్తి చేసే వారిని, ఉగ్రవాదంతో బాధపడేవారిని ఒకే త్రాసులో తూకం వేయాలా' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశ్నించారు. మంగళవారం ఇక్కడ 'ఇంధన భద్రతపై' జరిగిన ఔట్ రీచ్ సెషన్‌లో మోదీ ప్రసంగించారు.'ఉగ్రవాదం అనేది మానవత్వానికి శత్రువు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే అన్ని దేశాలకు ఉగ్రవాదం వ్యతిరేకం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఐక్యత తప్పనిసరి' అని మోదీ చెప్పారు. 'కానీ దురదృష్టవశాత్తు మన పొరుగుప్రాంతం ఉగ్రవాదానికి నిలయంగా మారింది. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం మన ఆలోచనలు, మన విధానాలు చాలా స్పష్టంగా ఉండాలి. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే ఏ దేశమైనా జవాబుదారీగా ఉండాలి. అంతేకాకుండా మూల్యం చెల్లించేలా చేయాలి' అని నరేంద్ర మోదీ అన్నారు. వాస్తవం దీనికి పూర్తి విరుద్ధంగా ఉందని ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు.ఒక వైపు మన సొంత ప్రాధాన్యతలు, ఆసక్తుల ఆధారంగా వివిధ ఆంక్షలను విధించడానికి మేం తొందరపడుతున్నాం. మరోవైపు ఉగ్రవాదాన్ని బహిరంగంగా మద్దతు ఇస్తున్నదేశాలకు నిరవధికంగా ప్రతిఫలం లభిస్తోంది అని ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఈ సందర్భంగా కొన్ని ప్రశ్నలు సంధించారు. మనం నిజంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సీరియస్‌గా ఉన్నామా? ఉగ్రవాదం మనపై దాడిచేసినప్పుడు మాత్రమే మనం దాని నిజమైన అర్థాన్ని అర్థం చేసుకుంటామా? అని అడిగారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసేవారిని, ఉగ్రవాదంతో బాధపడే వారిని ఒకే త్రాసులో ఉంచవచ్చా? మన ప్రపంచ సంస్థలు వాటి విశ్వసనీయత కోల్పోయే ప్రమాదం ఉందా? అని అడిగారు.ఈ సందర్భంగా ఉగ్రవాదంపై నిర్ణయాత్మక ప్రపంచ చర్య'కు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు'. ఇంధన పరివర్తన దిశగా అన్ని దేశాలు కలిసి ముందుకు సాగడం అత్యంత అవసరమని మోదీ నొక్కిచెప్పారు. గ్లోబల్ సౌత్ ఆందోళనలను ప్రపంచ వేదికగా తీసుకురావడాన్ని భారతదేశం తన బాధ్యతగా భావిస్తుంది.'ఏ రూపంలోనైనా ద్వంద ప్రమాణాలు కొనసాగితే, స్థిరమైన, మానవత్వానికి సంబంధించిన సమ్మిళిత అభివృద్ధిని కలుపుకోవడం అనేది అందుబాటులో ఉండదనేది మేం నమ్ముతున్నాం' అని మోదీ చెప్పారు. భారతదేశం ఎల్లప్పుడూ మానవత్వం కోసం పనిచేస్తుందని, తన స్వార్థానికి అతీతంగా పనిచేస్తుందని మోదీ నొక్కిచెప్పారు. భవిష్యత్తులోనూ జి7తో చర్చలు, సహకారంలో భారతదేశం పాల్గొంటుందన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

**ట్రంప్‌నిష్క్రమణ తర్వాత...ఉమ్మడి ఒప్పందాలు కుదుర్చుకోవడంలో జి7నేతల విఫలం**

జి7దేశాల నేతలు ట్రంప్ నిష్క్రమణ తర్వాత ప్రతిష్టాత్మక ఉమ్మడి ఒప్పందాలు కుదుర్చుకోవడంలో విఫలమయ్యారు. ప్రస్తుతం అత్యంత కీలక సమస్యలైన ఉక్రేన్‌లో రష్యా యుద్ధం, ఇజ్రాయెల్‌ఇరాన్ సంఘర్షణలపై ఏడుగురు నేతలతో కూడిన ఆరుగురి గ్రూప్ ప్రధాన ఒప్పందాలు కుదుర్చుకోవడంలో వైఫల్యంచెందారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందస్తుగా నిష్క్రమించినప్పటికీ, సంపన్నదేశాల క్లబ్ ఇప్పటికీ ప్రపంచ విధానాన్ని ఎలా రూపొందిస్తుందో చూపించడానికి ప్రయత్నించాల్సిన అవసరం ఏర్పడింది. మంగళవారం జరిగిన చివరి సమావేశంలో కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ సహా యుకె, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ నుంచి సహచర ప్రధానులు, ఉక్రేన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్స్కీ, నాటో చీఫ్ మార్క్ రుట్టే పాల్గొన్నారు. 'మాకు మిత్రదేశాల నుంచి మద్దతు అవసరం. అందుకే నేను ఈ సమావేశంలో ఉన్నాను' అని జెలెన్స్కీ జోడించడానికి ముందు 'మేం శాంతి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నాం. షరతులు లేని కాల్పుల విరమణ ముఖ్యమైనదని నేను భావిస్తున్నాను. కానీ దీనికోసం మాకు ఒత్తిడి అవసరం ఉంది' అని జెలెన్స్కీ అన్నారు.రష్యాతో చర్చలను ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా ఉక్రేన్‌పై సంయుక్త ప్రకటనను అమెరికా వ్యతిరేకించిందని కెనడాకు చెందిన ఒక సీనియర్ అధికారి విలేకరులకు వెల్లడించారు. సోమవారం శిఖరాగ్ర సమావేశం జరగకపోవడమే దీనికి కారణమని ఆయన చెప్పారు. ట్రంప్‌లేని సమయంలో మిగిలిన ఆరుగురు నేతలు ఉక్రేన్‌పై సమావేశం నిర్వహించారు.ఏకాభిప్రాయం లేకపోవడంతో నేతలు వ్యక్తిగతం గా జెలెన్స్కీ వద్దకు వెళ్లి తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

# ట్రంప్‌తో ఏం మాట్లాడారు?


ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరించాలి
దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటన నుండి తిరిగి వచ్చిన వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయాలను నాయకులకు వివరించాలని, దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలని సూచించింది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ ట్రంప్‌తో భోజనం చేయడాన్ని ప్రతిపక్ష పార్టీ 'భారీ ఎదురుదెబ్బ'గా అభివర్ణించింది. ఈ విషయంపై భార అసంతృప్తిని ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి ఫోన్‌లో చెప్పాల్సిందన్నారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రి అయి ఉంటే అమెరికా అధ్యక్షులు ఎవరు ఉన్నా ఆమె కచ్చితంగా భారత దేశ అసంతృప్తిని తెలియజేసేసే వారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధం జరిగిన మూడు రోజుల తర్వాత కమిటీ ఏర్పాటు చేసిన మాదిరిగానే 'పహల్గామ్ సమీక్ష కమిటీ'ని ఏర్పాటు చేయాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడానికి వాణిజ్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నారనే ట్రంప్ వాదనలను ప్రధానమంత్రి పార్లమెంటులో తిప్పికొట్టాలని సూచించారు. మోదీ ప్రభుత్వ దౌత్యం ఆప్టిక్స్‌పై తక్కువగా ఆధారపడి, సారాంశంపై ఎక్కువగా ఆధారపడి ఉండాలని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మోడీ ఫోన్‌లో మాట్లాడిన తర్వాత జై రమేష్ స్పందించారు. మంగళవారం ట్రంప్‌తో 35 నిమిషాల పాటు ఫోన్‌లో సంభాషించిన మోదీ పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారతదేశం ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ గురించి అమెరికా అధ్యక్షుడికి వివరించారు. ఎటువంటి మూడవ పక్ష మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని, భవిష్యత్తులోనూ దానిని ఎప్పటికీ అంగీకరించదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి స్పష్టం చేశా రు. కాగా, మునీర్‌తో ట్రంప్ భోజనం గురించి రమేష్ మాట్లాడుతూ 'ఇది భారత దౌత్యానికి ముమ్మారు టిపుల్ ఝట్కా అని అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి నేపథ్యంగా మారిన రెచ్చగొట్టే, ఆమోదయోగ్యం కాని వ్యాఖ్యలకు కారణమైన ఫీల్డ్ మార్షల్ మునీర్ ట్రంప్‌తో భోజనం చేయబోతున్నారన్నారు. ప్రభుత్వ అధిపతి కాని వ్యక్తి అదే సైనికుడిని ట్రంప్‌తో ప్రత్యేకంగా లంచ్‌కు ఆహ్వానిస్తున్నారని, ఇది భారత్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని అన్నారు. ట్రంప్ వాణిజ్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకుని, భారత్, పాకిస్తాన్‌ను సమానంగా చేస్తున్నానని చెబుతున్నాడని, దీనిని 14 సార్లు చెప్పినా మే 10 నుండి ప్రధానమంత్రి ఏమీ మాట్లాడలేదు, ఇది మూడుసార్లు ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ప్రధాని తిరిగి వచ్చిన వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, ట్రంప్‌తో 35 నిమిషాలు జరిగిన సంభాషణ చెప్పాలన్నారు. ట్రంప్ 14 సార్లు చేసిన వాదనలపై ప్రధాని మౌనం వీడటానికి 37 రోజులు పట్టిందని, మోదీ దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలని రమేష్ పునరుద్ఘాటించారు.

# రూ.3 వేలతో ఏడాదంతా ప్రయాణం..

కొత్త ఫాస్టాగ్ పాలసీని
తీసుకొచ్చిన కేంద్రం




**న్యూఢిల్లీ :** వాహనదారులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఫాస్టాగ్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ హైవేలపై ప్రయాణాన్ని సులభతరం చేయడానికి కొత్త ఫాస్టాగ్ పాలసీని తీసుకొచ్చింది. అన్ని రహదారులపై ప్రతిసారీ టోల్‌ట్యాక్స్ చెల్లించాల్సిన పనిలేకుండా ఒకేసారి ఏడాదికి చెల్లించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను తీసుకొచ్చింది. ఈ పాస్ ద్వారా వాహనదారులు రూ.3 వేలు చెల్లించి ఏడాదంతా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణించొచ్చు. ఇందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఎక్స్‌లో పంచుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ వార్షిక పాస్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. యాక్టివేట్ చేసిన పాస్‌లు ఏడాదిపాటు లేదా 200 ట్రిప్పులు (ఏది ముందైతే అది) చెల్లుబాటు అవుతాయని వెల్లడించారు. కార్లు, వ్యాన్లు వంటి నాన్ కమర్షియల్ వాహనాలకు మాత్రమే ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ పాస్ యాక్టివేషన్ కోసం త్వరలోనే లింక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు నితిన్ గడ్కరీ వెల్లడించారు. రాజ్‌మార్గ్ యాప్‌తో పాటు ఎన్‌హెచ్‌ఎఐ, ఎంఒఆర్‌టిహెచ్ వెబ్‌సైట్లలో ఈ లింగ్ అందుబాటులోకి వస్తుందన్నారు.

# 11 ఏళ్ల నాటి కేసులో..
# ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు జైలు శిక్ష

**జైపూర్:** సుమారు 11 ఏళ్ల నాటి కేసులో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సహా 9 మంది దోషులకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. అయితే వారందరికీ బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పును హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు నెల గడువు ఇచ్చింది. 2014 ఆగస్టు 13న జైపూర్‌లోని రాజస్థాన్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం బయట జెఎల్ఎన్ మార్గాన్ని సుమారు 20 నిమిషాలపాటు నిరసనకారులు దిగ్బంధించారు. ఈ నిరసన సందర్భంగా చట్టవిరుద్ధంగా సమావేశమై ప్రజా రహదారిని అడ్డుకున్నందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. 2016 ఆగస్ట్ 11న ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. కాగా, ఈ కేసుపై 11 ఏళ్లుగా కోర్టులో విచారణ కొనసాగింది. జైపూర్ జిల్లా కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సహా తొమ్మిది మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. ఒక్కొక్కరికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. వారందరికీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పు, శిక్ష నిలిపివేతపై హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు నెల సమయం ఇచ్చింది. మరోవైపు జైలు శిక్ష పడిన 9 మందిలో లడ్నన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ముఖేష్ భాకర్, షాపురాకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మనీష్ యాదవ్, జోత్వారా అసెంబ్లీ స్థానానికి చెందిన మాజీ కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ చౌదరి ఉన్నారు. అయితే దోషిగా నిర్ధారించిన ఇద్దరు కాంగ్రెస్ నేతల అసెంబ్లీ సభ్యత్వంపై ఎలాంటి ప్రభావం ఉండదు.

# డిసెంబరు 4న ఐక్యరాజ్యసమితి 'ఏకపక్ష నిర్బంధచర్యల' వ్యతిరేక దినం



**న్యూయార్క్ :** ఇకమీదట ప్రతి సంవత్సరం డిసెంబరు నాలుగో తేదీని అంతర్జాతీయ 'ఏకపక్ష నిర్బంధ చర్యల' వ్యతిరేక దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి పాటిస్తుంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఈ మేరకు మంగళవారంనాడు ఒక తీర్మానం చేసింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 116 దేశాలు ఓటు వేశాయి. 51 దేశాలు వ్యతరేకించాయి. మరో 6 దేశాలు తీర్మానానికి దూరంగా ఉండిపోయాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, జపాన్, అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశాయి. అంతర్జాతీయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌కు విరుద్ధమైన ఏకపక్ష ఆర్థిక, వాణిజ్య చర్యలను అమలు చేయడం లేదా వాటిని స్వీకరించడం వంటి చర్యలు తీసుకోవద్దని ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్నదేశాలు ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని ఈ తీర్మానంలో జనరల్ అసెంబ్లీ కోరింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామాజిక అభివృద్ధికి ఆటకం కలిగించే ఎలాంటి ఏకపక్ష,నిర్బంధ, బలాత్కార చర్యలూ తీసుకోవద్దని తీర్మానం కోరింది. ఈ విధంగా తీసుకునే ఏకపక్ష బలవంతపు, నిర్బంధ చర్యలవల్ల కలిగే ప్రభావాల గురించి ప్రపంచ దేశాలలో ప్రచారం చేసేందుకు వీలుగా ప్రతి సంవత్సరం డిసెంబరు నాలుగో తేదీని అంతర్జాతీయ 'ఏకపక్ష నిర్బంధ చర్యల' వ్యతిరేక దినోత్సవంగా ఇక మీదట పాటించాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఎరిత్రియా దేశ దౌత్యవేత్త సోఫియా ఎహెన్నెస్ ఒక ముసాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. సభ్యదేశాలు, పరిశీలకులు, ఐక్యరాజ్యసమితి వ్యవస్థలకు చెందిన ప్రతినిధులు, పౌరసంఘాల ప్రతినిధులు, వ్యక్తులు ఈ తీర్మానాన్ని ఆహ్వానించారు. ఈ మేరకు తీర్మానం ఆమోదం పొందింది.

# దేశ ఆర్థికవృద్ధికి కార్పొరేట్ రంగమే కీలక స్తంభం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
ఐసిఎల్ఎస్ 'ఆఫీసర్ ట్రైనీల'ను ఉద్దేశించి ప్రసంగం



**న్యూఢిల్లీ :** దేశ ఆర్థికవృద్ధికి, అభివృద్ధికి 'కార్పొరేట్ రంగమే కీలక స్తంభం' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. బుధవారం ఇక్కడ జరిగిన ఇండియన్ కార్పొరేట్ లా సర్వీస్ (ఐసిఎల్ఎస్) ఆఫీసర్ ట్రైనీలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. మీ నిర్ణయాలు కేవలం పాలసీలు, నిబంధనలనే ప్రభావితం చేయకుండా పౌరులు, పెట్టుబడిదారులు నమ్మకం కలిగి ఉన్న దేశంలోని సంస్థలన్నింటినీ ప్రభావితం చేస్తాయని రాష్ట్రపతి ముర్ము నొక్కిచెప్పారు. కార్పొరేట్ చట్టాల అమలు, అమలుకు అప్పగించబడిన అధికారిగా నవీకరణ, వ్యవస్థాపతకు జవాబుదారీగా ప్రయోజనకరంగా ఉండే వ్యాపార వాతావరణాన్ని పెంపొందించడంలో మీ పాత్ర కేంద్రంగా ఉంటుందని ఆఫీసర్ ట్రైనీలకు విశదీకరించారు. మనదేశ ఆర్థికవృద్ధి, అభివృద్ధికి కార్పొరేట్ సెక్టారే కీలక స్తంభమని ఆమె రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటుచేసిన శిక్షణార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి 2013నాటి కంపెనీల చట్టాన్ని ప్రస్తావించారు. ఆమె వారి బాధ్యతను ప్రధానంగా గుర్తు చేశారు. చట్టం కేవలం అమలుచేయడం కోసమే కాదని, ఆ చట్టాన్ని అర్థంచేసుకుని గౌరవించడం, అందరికీ న్యాయం, అవకాశాన్ని ప్రోత్సహించే విధంగా వర్తింపచేయడం అనే బాధ్యతను రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. డిఫెన్స్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్వీస్, సెంట్రల్ లేబర్ సర్వీస్ ఆఫీసర్ ట్రైనీలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన వారిలో ఉన్నారు. ట్రైనీలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ నాణ్యమైన విమానయానం అంటే కార్యాచరణ భద్రత, మిషన్ సంసిద్ధత, విశ్వసనీయత, ఆధిపత్యాన్ని నిర్ధారించే సాంకేతిక వివరణలను పాటించడం మాత్రమే కాదని ఆమె నొక్కిచెప్పారు. 'స్వదేశీయంగా ఉత్పత్తి చేయబడిన లేదా దిగుమతి చేసుకున్న విమానయాన స్టోర్స్‌లు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యత, యోగ్యత, అవసరాలను తీర్చేలా చూసుకోవడం మీ ప్రధానబాధ్యత' అని ముర్ము చెప్పారు.ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

## విమాన ప్రమాదం నుంచి బతికిన రమేష్ డిశ్చార్జ్..

సోదరుడి అంత్యక్రియలకు హాజరు



**అహ్మదాబాద్ :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈనెల 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఒకే ఒక్క ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ రమేష్ గాయాల నుంచి కోలుకున్నాడు. దీంతో అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ నుంచి అతడ్ని డిశ్చార్జ్ చేశారు. అదే విమాన ప్రమాదంలో మరణించిన రమేష్ సోదరుడు అజయ్ మృతదేహాన్ని డిఎన్ఎ టెస్ట్ ద్వారా గుర్తించారు. లండన్ నుంచి గుజరాత్ చేరుకున్న రమేష్ కుటుంబానికి అప్పగించారు. బుధవారం దయ్యూలో అతడి సోదరుడి మృతదేహానికి అంత్యక్రియలు జరిగాయి. గాయాల నుంచి కోలుకున్న రమేష్ ఇందులో పాల్గొన్నాడు. సోదరుడి పాడే కూడా మోశాడు. కాగా, బ్రిటన్ పౌరసత్వం ఉన్న విశ్వాస్ కుమార్ రమేష్, జూన్ 12న లండన్ వెళ్లేందుకు సోదరుడు అజయ్‌తో కలిసి ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణించాడు. అయితే అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఎంచి అయిన ఆ విమానం కొన్ని క్షణాల్లోనే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కూలి పేలిపోయింది. మరోవైపు ఎమర్జెన్సీ డోర్‌కు దగ్గరగా 11ఎ సీటులో ఉన్న విశ్వాస్ కుమార్ రమేష్ ఒక్కడే అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. అతడి సోదరుడు అజయ్‌తోపాటు ఆ విమానంలోని మిగతా 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితోపాటు కొందరు మెడికల్ స్టూ డెంట్స్, ఇతరులతో సహా 270 మంది మరణించగా పలువురు గాయపడ్డారు.

# 190 బాధితుల గుర్తింపు



**అహ్మదాబాద్ :** గత వారం అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో ఇప్పటివరకు కనీసం 190 మంది బాధితులను డిఎన్ఎ పరీక్షల ద్వారా గుర్తించామని, 32 మంది విదేశీయులు సహా 159 మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని అధికారులు బుధవారం తెలిపారు. జూన్ 12న 242 మంది ప్రయాణికులు, సిబ్బందితో లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ఎఐ 171 అహ్మదాబాద్‌లో కూలిపోయింది. ఒకరు తప్ప అందరూ మరణించారు. విమానం వైద్య సముదాయంలోకి దూసుకెళ్లడంతో అక్కడ కూడా మరో 28 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అనేక మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. ఈ నేపథ్యంలో బాధితుల గుర్తింపును నిర్ధారించడానికి అధికారులు డిఎన్ఎ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం వరకు, 190 డిఎన్ఎ నమూనాలు సరిపోలాయి. 159 మృతదేహాలను ఇప్పటికే సంబంధిత కుటుంబాలకు అప్పగించారు. ఇతర మృతదేహాల డిఎనె గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది అని అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ జోషి విలేకరులకు తెలిపారు. 159 మంది బాధితుల మృతదేహాలను వారి బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. వారి బంధువులకు అప్పగించిన 127 మంది భారతీయుల మృతదేహాలలో నలుగురు ఆసుపత్రిలో మృతి చెందిన వారు కాగా, 123 మంది విమానంలో ఉన్నారని జోషి చెప్పారు. ప్రమాదం తరువాత, 71 మంది గాయపడిన వారిని ఆసుపత్రులలో చేర్చినట్లు ఆయన చెప్పారు. వారిలో, ప్రస్తుతం ఏడుగురు మాత్రమే సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, మరో 12 మంది రోగులు అహ్మదాబాద్, దాహోద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులలో చేరారన్నారు. ఇక్క డ (సివిల్ ఆసుపత్రి) చికిత్స సమయంలో ముగ్గురు రోగులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు.

# శుభాంశు శుక్లా అంతరిక్షయాత్ర మరోసారి వాయిదా



**న్యూఢిల్లీ :** అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ యాక్సియం స్పేస్ చేపట్టిన రోదసి యాత్ర మరోసారి వాయిదా పడింది. స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసిలోకి వెళ్లాల్సి ఉంది. జూన్ 19న యాత్ర ఉంటుందని ముందుగా ఇస్రో ప్రకటించగా, ఇప్పుడు 22కు వాయిదా వేశారు. ఇప్పటికే సాంకేతిక కారణాలతో యాక్సియం–4 ప్రయోగం పలుమార్లు వాయిదా పడింది. అయితే యాక్సియం–4 మిషన్ కోసం ఉపయోగిస్తున్న ఫాల్కన్–9 రాకెట్‌లో ద్రవ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు కొద్ది రోజుల క్రితం అధికారులు గుర్తించారు. దీంతో 11వ తేదీన జరగాల్సిన ప్రయోగాన్ని వాయిదా వేశారు. ఆ తర్వాత సమస్యను పరిష్కారమైనట్లు గుర్తించి 19న రోదసి యాత్ర ఉంటుందని తెలిపారు. కానీ ఇప్పుడు మళ్లీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 'యాక్సియం–4 ప్రయోగ తేదీపై ఇస్రో బృందం సుదీర్ఘ చర్చలు జరిపింది. ప్రయోగ సంసిద్ధతపై నాసా, స్పేస్ఎక్స్‌తో యాక్సియం స్పేస్ సంప్రదింపులు జరిపింది. ఇటీవల చేపట్టిన మరమ్మతులు, వాతావరణ పరిస్థితులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్నాక జూన్ 22ను తదుపరి ప్రయోగ తేదీగా యాక్సియం స్పేస్ వెల్లడించింది' అని ఇస్రో తెలిపింది. ఆ తర్వాత కేంద్రమంత్రి జితేందర్ సింగ్ కూడా అదే చెప్పారు. కాగా, యాక్సియం–4 కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుభాంశు రోదసియాత్ర చేపట్టనున్నారు. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ యాక్సియం స్పేస్ మిషన్‌ను నిర్వహిస్తోంది. ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఇఎస్ఎ)లు ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నాయి. స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులో శుభాంశు మిషన్ పైలట్ బాధ్యతలు నిర్వహిస్తారు. భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత శుభాంశు పైలట్‌గా బాధ్యతలు వహించే వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేం ద్రం (ఐఎస్ఎస్)తో అనుసంధానమవుతుంది. ఆ తర్వాత అతడి బృందం అక్కడే 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో ముచ్చటించనుంది.

# స్కూళ్లల్లో' హిందీ 3వ భాష 'కంపల్సరీ' కాదు



వెనక్కి తగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం
ఏ భారతీయ భాషనైనా మూడోభాషగా ఎంచుకోవచ్చు

**ముంబయి / పుణే :** మహారాష్ట్రలోని ఇంగ్లీష్, మరాఠీ మీడియం స్కూళ్లలో 1వ తరగతి నుంచి 5వరకు చదివే విద్యార్థులకు విధిగా హిందీని బోధించాలని ఇటీవల హిందీని 'సాధారణంగా' మూడవ భాషగా చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం కాస్త వెనక్కు తగ్గింది. గత ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంపై ఆందోళనలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ, ఎంఎన్ఎస్ ప్రెసిడెంట్ రాజ్ థాకరే నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో మహారాష్ట్ర సర్కారు తన నిర్ణయాన్ని మార్చుకుంది. సాధారణంగా 3వ భాష తప్పనిసరికాదు' అని స్పష్టంచేసింది. బుధవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ హిందీని నేర్చుకోవడం 'కంపల్సరీ(తప్పనిసరి)' అనే పదాన్ని తొలగిస్తున్నామని, ఏ భారతీయ భాషనైనా మూడవ భాషగా ఎంచుకోవచ్చని స్పష్టం చేశారు. హిందీని మూడవ భాషగా చేస్తూ జారీచేసిన ఉత్తర్వులపై వివాదం తీవ్రస్థాయిలో రాజుకోవడంతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. హిందీని సాధారణంగా మూడవ భాషగా మారుస్తూ మంగళవారం నాడు మహారాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి ఉత్తర్వులు జారీ చేసింది. హిందీ లేదా ఏదైనా మరో ఇతర భాషను ఎంచుకోవాలంటే తరగతిలో ఆ భాషను ఎంచుకునేవారు కనీసం 20మంది విద్యార్థులు ఉండాలని స్పష్టంచేసింది. కాంగ్రెస్ పార్టీ దీనిపై స్పం దిస్తూ 'మరాఠీ ప్రజల ఛాతీపై సిఎం ఫడ్నవీస్ కత్తిదించారు' అని ఆరోపించింది. జాతీయ విద్యా విధానం పాలసీ (ఎన్ఇపి)2020తో అనుసంధానిస్తూ 'స్టేట్ కర్రిక్యులమ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ 2024'అమలు చేయడంలో భాగంగా ప్రభుత్వ తీర్మానం ఉత్తర్వులను పాఠశాల విద్య విభాగం జారీచేసింది.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదు : ఎస్‌పి

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్** : మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులను బుధవారం నల్లగొండ స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష వెయ్యి రూపాయలు జరిమానా, మరొకరికి ఒక రోజు జైలు శిక్ష రూ రెండు వెయ్యిల రూపాయలు జరిమానా విధించడంతోపాటు మరో ఇద్దరికి పది వెయ్యిల రూపాయలు జరిమానా విధించారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు ట్రాఫిక్ రూల్స్ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు శిక్ష తప్పదని తెలిపారు. అనంతరం ఎస్పీ ట్రాఫిక్ సీఐ జి.మహాలక్ష్మయ్యను సిబ్బందిని అభినందించారు.

## విధుల పట్ల అలసత్వం వహించిన ముగ్గురు సస్పెన్షన్

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** పోలీస్ ఉన్నతాధికారుల సూచనలు పాటించకుండా విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు అధికారులను సస్పెండ్ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాజోలి పోలీస్ స్టేషన్ కు సంబంధించిన ఇథనాల్ కేసులోని వ్యక్తులను పోలీస్ అధికారులు మహబూబ్ నగర్ జైలు నుండి అలంపూర్ కోర్టు కు తీసుకవచ్చే క్రమంలో పోలీస్ ఉన్నతాధికారుల సూచనలు పాటించకుండా విధుల పట్ల అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనలో ఒక ఆర్ఎస్ఐ, ఇద్దరు ఏఆర్ఎస్ ఐ లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చెయ్యడం జరిగిందని జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు తెలిపారు.





## రైతులకు బేడీలు హేయమైన చర్య

ప్రజాసంఘాల నాయకులు, అఖిలపక్ష కమిటీ నాయకులు

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** ఇథనాల్ బాధిత రైతులకు బేడీలతో అల్లంపూర్ కోర్టుకు హాజరు పరచడం సిగ్గుచేటని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మిస్తున్న ఇత్తనాలు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఈనెల నాలువ తేదీన ప్రజలు పెద్ద ఎత్తున చేయబడిన 12 మంది రైతులను 14 రోజుల రిమాండ్ తర్వాత బుధవారం అల్లంపూర్ రెండవ క్లాసు మెజిస్ట్రేట్ ముందర హాజరు పరిచారు. హాజరు పరిచే ముందు రైతులను బేడీలు వేసి హాజరు పరచడం కలకలం రేగింది. ఈ దారుణాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాసంఘాల నాయకులు, అఖిలపక్ష కమిటీ నాయకులు బుధవారం గద్వాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. రైతులకు గతంలో లగచర్లలో బేడీలు వేసిన విషయాన్ని హైకోర్టు తీవ్రంగా మందలించినా పోలీసుల తీరు మారకపోవడం దారుణమన్నారు. తీవ్రమైన నేరాలు చేసిన వారికి వేసిన విధంగా బేడీలు వేయడం సరైనది కాదన్నారు. నడిగడ్డలో పోలీసు రాజ్యం ఏలుతున్నదా అనే విధంగా బాధిత గ్రామాలను సందర్శించకుండగా గత వారం రోజుల క్రీతం అఖిలపక్ష కమిటీ నాయకులను అరెస్టు చేసి అడ్డుకున్నారన్నారు. రాష్ట్ర పౌర హక్కుల సంఘం నేతలు బాధిత గ్రామాలను సందర్శించడానికి వెళుతున్న సందర్భంగా వారిని ఎర్రవల్లిలో అరెస్టు చేసి ఇటిక్యాల పోలస్ స్టేషన్లో ఉంచడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగ్ దొడ్డి వెంకటరాములు సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు మోహన్ రావు టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు శంకర్ ప్రభాకర్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు టిఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువపల్లయ్య రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ యాదవ్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ బహుజన రాజ్యసమితి నాయకులు వాల్మీకి వినోద్ కుమార్ , టిఆర్ఎస్ నాయకులు, టవర్ మబ్బుల్, పౌర హక్కుల సంఘం నాయకులు మహేష్ ,సామాజిక సంఘాల నాయకులు సాధతుల్లా కృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టంతో చదవాలి




**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్** : విద్యార్థులు కష్టంతో కాదు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి సూచించారు.ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో నల్లగొండ ఎస్ ఆర్ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించగా బుధవారం డీఎస్పీ శివరాంరెడ్డి, కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు . అనంతరం నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించిన విద్యార్థిని బచ్చు ప్రియాంకకు డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డి, డి.ఎస్.పి కె.శివరాంరెడ్డితో కలిసి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సైదా బాబు, కళాశాల అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు మనోజ్ రెడ్డి, డీన్ కిశోర్ బాబు, ఏఓ సరితారెడ్డి, అధ్యాపకులు వర్ధన్, ప్రసన్న కుమార్, శ్రీనివాస్, శోభ ఉన్నారు.

## సిపిఐ గుండాల మండల 13వ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/గుండాల** : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామంలో సిపిఐ మండల 13వ మహాసభల కరపత్రాలను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదిన గుండాల మండల పరిధిలోని మాజీ ఎంఎల్‌ఏ కామ్రేడ్ గుర్రం యాదగిరిరెడ్డి సభా ప్రాంగణం శ్రీ వాసవి గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని ఈ మండల మహాసభలను సిపిఐ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేద లబ్దిదారులకు అందజేయాలని, కుల, మతాలకు తేడా లేకుండా ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని, సన్నాలకు 500 బోనస్ అందజేయాలని, రేషన్ కార్డులు త్వరితగతిన లబ్దిదారులకు అందజేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, కార్యదర్శి పడకంటి సత్యనారాయణ, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ బద్దుల శ్రీను, కృష్ణహరి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం ఎంఎల్‌ఏ మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో రైతు వేదిక సమీపంలో నూతనంగా నిర్మించిన కేజిబివి పాఠశాల భవనాన్ని ప్రజా ప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రభుత్వం దేవరకొండకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు అనుమతినిచ్చిందని అన్నారు. 200 కోట్లతో 25 ఎకరాల్లో సువిశాలంగా ఈ పాఠశాలను నిర్మించి అన్ని వర్గాల విద్యార్థులకు సమానత్వంతో బోధన చేయడంతో పాటు నాణ్యమైన భోజన వసతులు కల్పించనుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్‌తో అత్యధిక లాభాలు

వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు శ్రద్ధ పెట్టాలి

సమీకృత వ్యవసాయ సాగు పద్ధతిని పరిశీలన

కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/చివ్వెంల:** ఆయిల్‌ఫామ్ సాగు చేయడం ద్వారా అత్యధిక లాభాలు పొందవచ్చు అని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. బుధవారం చివ్వెంల మండలంలో బి.చందుపట్ల గ్రామంలో గల మార్కల వెంకటరెడ్డి ఆయిల్‌ఫామ్ తోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫామ్ సాగు వివరాలను, వారి క్షేత్రంలో ఆయిల్‌ఫామ్‌తో పాటు మామిడి, కొబ్బరి అన్ని రకాల పండ్లు, నాటుకోళ్లు, గొర్రెలను సమీకృత పద్ధతిలో సాగు విధానంను రైతు నుండి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫామ్ సాగులో తీసుకోవాల్సిన యాజమాన్యంపై పలు సూచనలు చేశారు. జిల్లాలో ఆయిల్‌ఫామ్ గెలల కోతలు ప్రారంభమైనందున ప్రభుత్వం ఆయిల్‌ఫామ్ సాగుకై అందిస్తున్న ప్రోత్సహకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయిల్‌ఫామ్‌ను సాగు చేయాల్సిందిగా జిల్లా రైతులకు కలెక్టర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలో నాలుగేండ్ల క్రితం సాగు చేసిన ఆయిల్‌ఫామ్ పంట చేతికి వస్తుండటం అలాగే గెలల ధర భారీగా పెరగడంతో రైతుల్లో నూతన ఉత్సాహం నెలకొంటుందని, ఇన్నాళ్లు ఎప్పుడో నాలుగేళ్లకు వచ్చే పంటకోసం ఇప్పటి నుండే కష్టపడి సాగు చేయాలనుకున్న రైతులు ఇప్పుడు ఆయిల్‌ఫామ్‌ను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారని, దీంతో జిలాలలో సాగు పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 4885 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ పథకంలో పెట్టిన టార్గెట్‌లో ఇప్పటి వరకు సుమారు 400 ఎకరాల్లో తాజాగా పంట చేతికి వస్తుండటంతో పంటను చూసిన ఇతర రైతులు ఆయిల్‌ఫామ్ సాగుకు ఆకర్షితులవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు పలు చర్యలు తీసుకుంటోందని దిగుబడి వచ్చేంత వరకు అంతర్ పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. వరి, పత్తి పంటలతో పోల్చితే రైతులు తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో మంచి లాభాలు సాధించే అవకాశం ఉందని అన్నారు. ఆయిల్‌ఫామ్ మొక్కలను ఒకసారి నాటితే 30 ఏండ్ల వరకు దిగుబడి వస్తుందని, నాటిని నాలుగో సంవత్సరం నుండి దిగుబడి వస్తుందని మొదటి నాలుగేండ్ల వరకు ప్రభుత్వమే ఖర్చులు భరిస్తుందని అన్నారు. మొదటి మూడేండ్లు మొక్కజొన్న, పత్తి, వేరుశనగ లాంటి పంటలను అంతరపంట సాగు చేసుకోవచ్చని తెలిపారు. నాలుగోయేడు నుండి పంట ఎకరాకు కనీసం 8 నుండి 10 టన్నులకు తక్కువ కాకుండా దిగుబడి వస్తుందని చెట్టు పెరిగే కొద్ది మెలకువలు పాటిస్తూ 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి రాబట్టవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఎకరానికి 4200 ఆర్థికసాయం చేయడం, మొక్క మార్కెట్‌లో 193 నుండి 200 రూపాయల మొక్కను సబ్సిడీతో రైతుకు 20 రూపాయలకే అందిస్తుందని తెలిపారు. డ్రిప్ సౌకర్యం కల్పించేందుకు యూనిట్ ఖర్చులో ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం బిసిలకు 90 శాతం,ఇతరులకు 80 శాతం సబ్సీడిగా అందిస్తోందని, ఒక ఎకరానికి మొత్తం రాయితీగా 50918 రూపాయలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సంతోష్‌కుమార్, ఉద్యానవన డివిజన్ అధికారి స్వాతి, మండల ఉద్యానవన అధికారి మహేష్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, పతంజలి కంపెని ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## మోతెలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మా

**ప్రజాపక్షం/మోతె:** మండలంలో అసాంఘిక కార్యకలాపలను అరికట్టాలని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలలో భాగంగా బుధవారం జిల్లా ఎస్‌పి మోతె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ డైరీ, రిసెప్షన్ రిజిస్టర్‌ను తనిఖీచేసి మండల పరిధిలో తరుచుగా నమోదవుతున్న నేరాలు, ఫిర్యాదుల తీరుతెన్నులను, కేసుల స్థితిగతులు, పలు అంశాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, పారదర్శకంగా పనిచేయాలని, బాధితులకు సత్వర సేవలించాలని అదేశించారు. నాణ్యమైన వేగవంతమైన దర్యాప్తు చేయాలని, బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామ రిజిస్టర్లు, హిస్టరి షీట్స్, రౌడి షీట్స్, సస్పెక్ట్ షీట్స్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. బ్లూకోట్ విధులు, పెట్రోకార్ విధులు ప్రధానమైవని సంఘటన స్థలాన్ని త్వరగా చేరుకుని ప్రాథమికంగా బాధితులకు బరోసా కల్పించాలని సూచించారు. కేసులు పెండింగ్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, మోతె పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగమైన వాసాలమర్రిని ఆదుకుంటాం

ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేయనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** గత ప్రభుత్వం, స్వయానా వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకొని బంగారు వాసాలమర్రి చేస్తానని హామీలు గుప్పించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగం చేసిన వాసాలమర్రి గ్రామాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీనిచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ హయంలో ఆగమై, ఇండ్లను కూల్చి మొండి గోడలుగా మిగిలిపోయిన బాధితులకు అండగా ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, అందులో భాగంగా గ్రామంలో సర్వే చేసి అధికారులు గుర్తించిన 227 మంది లబ్ధిదారులకు గురువారం రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ, ఆదాయ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులను పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఆకుల ఆగవ్వ పరిస్థితి ఆగమైందని, ఆమెకే మొదటి ఇందిరమ్మ ఇళ్ళు ప్రొసీడింగ్ కాపీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాజకీయ కోణంతో కాకుండా, ప్రజా శ్రేయస్సును కోరే ప్రభుత్వంగా వాసాలమర్రిని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని, గ్రామస్థులెవరుకూడా అధైర్యపడొద్దని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, వాసాలమర్రి గ్రామస్థులు పాల్గొన్నారు.



## మండల కేంద్రంలో సొంత ప్రభుత్వ కార్యాలయాల భవనాలను నిర్మించాలి

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** 2016లో నూతనంగా ఏర్పడిన మోటకొండూర్ మండల కేంద్రానికి నేటికీ సొంత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించలేకపోవడం విచారకరమని వెంటనే సొంత భవనాలు నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మోటకొండూర్ మండల పార్టీ 4వ మహాసభ మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఆలేటి బాల్‌రాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా మోటకొండూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి ఫంక్షన్ హాల్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించి మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రేగు సిద్దయ్య ఆవిష్కరించారు. ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన విప్లవ గేయాలు అందర్నీ అలరించాయి. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో గోద శ్రీరాములు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఈ దేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రజా సమస్యలే ఎజెండగా తీసుకొని రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తున్న చరిత్ర సిపిఐ పార్టీకే ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ మాట్లాడుతూ బునాదిగాని కాలువకు మంజూరైన నిధులతో వెంటనే పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని, స్థానిక సంస్థ ఎన్నికల్లో సిపిఐ అన్ని గ్రామాలలో సర్పంచులు, ఎంపిటిసిలుగా పోటీ చేసి అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కాగార్ పేరుతో వందలాది మంది నక్సలైట్లను హత్య చేస్తుందని ఆయన ఆరోపించారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, ముస్కు పెంటారెడ్డి, మంచాల రాదమ్మ, ఎండీ ఇమ్రాన్, రైతు సంఘం జిల్లా నాయకులు జక్క దయాకర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఇంజా హేమలత, అన్నేమైన వెంకటేష్, ప్రజానాట్యమండలి కళాకారులు పోతు ప్రవీణ్, రేణుక మండల కార్యవర్గ సభ్యులు పశుల నరసింహ, బోళ్ల శ్రీను, పల్లె వెంకన్న, బీరకాయల మల్లేష్, ఏనుగు వెంకట్ రెడ్డి, మండల కౌన్సిల్ సభ్యులు జీవిలకపల్లి పాండు, బోలగాని అశోక్ పాల్గొన్నారు.

# పేదోళ్లకు న్యాయం సహా అభివృద్ధి చేస్తా

బంగారిగడ్డ రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇండ్లను పరిశీలించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** కనగల్లు నుండి మాల్ ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణలో భాగంగా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇండ్లను బుధవారం మునుగోడు ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పరిధిలో రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ నిర్మాణం తో కలుపుకొని 66 ఫీట్ల వెడల్పు తో రోడ్డును అభివృద్ధి చేస్తున్న సందర్భంగా రోడ్డు వెడల్పులో పూర్తిగా ఎన్ని ఇండ్లు పోతున్నాయి ,సాక్షికంగా ఎన్ని ఇండ్లకు ఇబ్బంది కలుగుతుందని క్షేత్రస్థాయిలో ఇంటిటింటికి తిరుగుతూ పరిశీలించారు. అంతకు ముందు ఇండ్లు కోల్పోతున్న బాధితులు మునుగోడులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో రాజగోపాల్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వినిపిస్తూ తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పేదోళ్ళకు అన్యాయం జరిగితే అభివృద్ధి చేయమని ,పేదలకు న్యాయం చేస్తూనే అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇరువైపుల అండర్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు 66 ఫీట్ల రోడ్డు వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులు జరగబోతున్న పేపథ్యంలో ఇండ్లు కోల్పోతున్న నిరుపేదలకు ఏదో ఒక రకంగా న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుభం శ్రీనివాస్‌రెడ్డి , కాంగ్రెస్ నాయకులు దోటి వెంకటేశ్ యాదవ్ , ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు , ఇరిగి రాజు, సాపిడి రాములు , కావలి ఆంజనేయులు , సుంకరి నర్సింహ్మా, బొడ్డు ముత్తయ్య ,బోయపల్లి రాములు ,బోయపల్లి సైదులు , పంతంగి గిరిగౌడ్ ,ఇరిగి వెంకటేశం పాల్గొన్నారు.

## అబద్ధాలతో కాంగ్రెస్ పాలన

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ అబద్ధాలతో పాలన సాగిస్తుందనీ నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. బుధవారం పట్టణంలోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతుభరోసా 15 వేలు ఇస్తా అని చెప్పి అధికారంలోకి రాగానే మోసం చేసిందనీ కానీ కెసిఆర్ ఏ హామీ లేకుండనే ఎకరానికి 12 వేల రైతుబందు ఇచ్చారనీ తెలిపారు.రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకుండా ఇటు రైతులను అటు ప్రజలను అన్ని విధాలుగా మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కెసిఆర్ జమ చేసిన డబ్బులను కూడా రైతులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్ల వద్ద కమిషన్లు తీసుకుని బిల్లులు ఇచ్చారనీ ఇపుడు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని రైతు భరోసా ఇస్తానని మాయమాటలు చెబుతున్నాడనీ ఒక్కొక్క రైతుకు కాంగ్రెస్ సర్కార్ 30 వేలు బాకీ పడ్డదన్నారు.కుప్పలు కుప్పలుగా అప్పులు తెస్తూ కమిషన్ల కోసం బిల్లులు చెల్లెస్తు ఉమ్మడి జిల్లా రైతులకే యాసంగిలో 800 కోట్లు బాకీ పడ్డారనీ జిల్లాకు చెందిన ఇద్దరు చేతగాని మంత్రులుగా మిగిలిపోయారని. జిల్లా కు ఏమి చేయలేక పోతున్నారని ఆరోపించారు. ఈ ఫార్ములా కేసులో నూ జరిగిన తప్పేమి లేదని కానీ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కేటీఆర్ కు పదే పదే విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు.

# కేసు నమోదుతోనే సరి...?



ప్రధాన నిందితుల అరెస్టు ఏదీ?

భ్రూణహత్య కేసులో కనిపించని పురోగతి

రాజకీయ ఒత్తిడే ఇందుకు కారణామా...?

**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత నెల 20వ తేదీన ఓమేగ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు చేసిన వచ్చిరాని వైద్యంతో అబార్షన్ వికటించి ఓ నిండు గర్భిణి ప్రాణాలుపోయిన సంఘటన కలకలం రేపింది. అబార్షన్ చేస్తున్న సమయంలో అధిక రక్త స్రావం కావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆమెను హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న గర్భిణి మృతి చెందింది. దీనిపై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆసుపత్రిని సీజ్ చేయడంతో పాటు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆసుపత్రి నిర్వాహకులతో పాటు దీనికి సంబంధం ఉన్న మరికొంతమందిపై ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు కేవలం ఓ గ్రామీణ వైద్యుడిని, అతనికి సహయకులుగా ఉన్న మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపి చేతులు దులుపుకున్నారు. ఈకేసులో ప్రధాన నిందితులను మాత్రం పోలీసులు నేటికి అరెస్టు చేయలేదు. దీంతో ఈ భ్రూణహత్య కేసులో నేటికి ఏలాంటి పురోగతి లేకపోవడం పోలీసుల తీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న వారిని పోలీసులు నేటికి అరెస్టు చేయకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని ఓ మేగ ఆస్పటల్ నిర్వహిస్తున్న ఓ ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ కుమారుడు, పట్టణానికి చెందిన మరో రాజకీయ నాయకుడితో పాటు ఆసుపత్రి వైద్యుడు, సర్వారం, గ్రామాలకు చెందిన గ్రామీణ వైద్యులను, నకిరేకల్ స్కానింగ్ సెంటర్ నిర్వాహకున్ని నేటికి పోలీసులు అరెస్టు చేయకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. వారిపై కేసు నమోదై నెల రోజులవుతున్నా పోలీసులు అరెస్టు చేయకపోవడంపై ప్రజలు తప్పుబడుతున్నారు. భ్రూణహత్య కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అరెస్టు చేయకపోవడం వెనుక ప్రధాన కారణం రాజకీయ ఒత్తిడే నని తెలుస్తోంది. అందుకే వారిని పోలీసులు నేటికి అదుపులోకి తీసుకోవడంలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. నిందితులు ప్రధా న రాజకీయ పార్టీలో కొనసాగడంతో వారిని నియోజకవర్గ స్థాయి కీలక నాయకులు పోలీసులు అరెస్టు చేయకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం.

**నిందితులను పట్టుకుంటాం : పట్టణ ఇన్‌ఛార్జి సిఐ రాజశేఖర్**

భ్రూణ హత్య కేసులో ప్రధాన నిందితులను పట్టుకుంటామని సూర్యాపేట పట్టణ ఇన్‌ఛార్జి సిఐ రాజశేఖర్ చెప్పారు. ప్రధాన నిందితులను అరెస్టు చేయకపోవడంపై ప్రజాపక్షం వివరణ కొరగా ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశామని తెలిపారు. ఈ కేసులో మరో ఐదుగురు అరెస్టు చేయాల్సి ఉందని, వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

## రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఖరీఫ్ పంటకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్తన్న

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం గణపురం మండలంలోని గణప సముద్రం సరస్సు నుండి ఖరీఫ్ పంటకు ఇరిగేషన్ అధికారులతో కలిసి నీటిని విడుద ల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్తన్న మాట్లాడుతూ రైతుల పొలాలకు నీరు వెళ్లేందుకు కాలువలు తీయించాము. రైతులు ముందస్తుగా వరి నాళ్లు పోసుకొని వరి పంటలను వేసుకోవాలని సూచించారు. నీటిని ముందస్తుగా విడుదల చేయడంతో గణపురం రైతులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఈ ఈ బసవ ప్రసాద్ గౌడ్,ఏ ఈ సమ్మారావు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్,సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్ యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ, నాయకులు మాజీ వైస్ ఎంపీపీ అశోక్, మోటపోతుల శివశంకర్ గౌడ్, సిరిగినేని బాబూరావు, కాల్వ రామ్ రెడ్డి, దూడపాక శంకర్, మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ:** రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్ బుధవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మొక్కను అందజేశారు. అదేవిధంగా సచివాలయంలోని సిఎస్ ఛాంబర్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## అక్షరాభ్యాసంలో పాల్గొన్న కలెక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** తల్లితండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని, విద్యతోనే గౌరవం సాధ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం ఖిలా వరంగల్ మండలంలోని కరీమాబాద్, మధ్య కోటలలో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. హాజరు పట్టికలు, రిజిస్టర్లు, తరగతి గదులను పరిశీలించారు. కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి కలెక్టర్ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఖిలా వరంగల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 800 మంది చిన్నారులను చేర్పించామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారి చదువు సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం స్కూళ్లలో మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ మరుపల్లి రవి, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, డిఈఓ జ్ఞానేశ్వర్, ఎంఈఓ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్‌ను కలిసిన బల్దియా కమిషనర్ చాహత్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** బల్దియా కమిషనర్ గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్ పాయ్ బుధవారం హన్మకొండ లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో నగర పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకం గా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భం గా సిపి కమిషనర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం



**ప్రజాపక్షం/తొర్రూరు :** రాష్ట్రంలో పెద్దవాళ్లు, పేదవాళ్లు అనే తేడా లేకుండా అందరూ ఒకే రకమైన అన్నం తినాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉచిత సన్న బియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మకమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నునావత్ రాధ, మహిళా నాయకురాలుతో కలిసి బుధవారం డివిజన్ కేంద్రంలోని 12వ వార్డు ముదిరాజ్ కాలనీలోని వెలుగు సోమయ్య ఇంట్లో మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పింగిలి ఉష ఆధ్వర్యంలో ప్రభుత్వం పంపిణీ చేసిన సన్న బియ్యంతో వండిన అన్నం తిన్నారు. వంటకాలను ఎమ్మెల్యే ఇతరులకు వడ్డించారు. భోజనం చేసిన ఇంట్లో కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం పంపిణీతో 80శాతం నిరుపేదలు ప్రయోజనం పొందుతున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదలకు సన్న అన్నంతో కడుపు నింపుతుందన్నారు. బియ్యం పక్కదారి పట్టకుండా ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాటోతు హామ్యానాయక్, విజయపాల్‌రెడ్డి, సుంచు సంతోశ్, మహిళా నాయకురాలు వెలుగు మహేశ్వరి, మాలోతు సునీత రాజేందర్, దొంగరి రేవతి, స్వాతి, శిరీష, ఉపేంద్ర, హరిత, అమల, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## 12ఏళ్ళ తర్వాత పునఃప్రారంభమైన పాఠశాలలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లాలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంలో భాగంగా, అందులోనూ ప్రభుత్వ బడులను పరిరక్షించడంలో ప్రయత్నంగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి కృషి, ప్రోత్సాహంతో గత 12సంత్సరాల తర్వాత జిల్లాలో రెండు ప్రాథమిక పాఠశాలలు పునఃప్రారంభం చేయడం విశిష్టత సంతరించుకుంది. పెదవంగర మండలం డిఎస్‌టిపిఎస్ రాజ్‌మాన్సింగ్, మహబూబాబాద్ మండలం హాజారియా తండాలో ప్రాథమిక పాఠశాలలను బుధవారం డిఇఓ రవీందర్‌రెడ్డి జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి రాజేంద్రప్రసాద్, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందంతో మండల విద్యాశాఖాధికారి బుద్దారం శ్రీనివాస్, పెద్దవంగర మండల కాంప్లెక్స్ హెచ్ఎం, స్పెషల్ ఆఫీసర్ కళాధర్, జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్, ఆజాద్, మహబూబాబమాద్ మండల ఎంయుఎస్ వెంకటేశ్వర్లు, ఏసిజి, కాంప్లెక్స్ హెచ్ఎం మందుల శ్రీరాములు, పాఠశాల హెచ్ఎంలు, పంచాయతీ సెక్రటరీలు, అంగన్‌వాడీ, ప్రజాప్రతినిధులు, చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసి పండుగ వాతావరణంలా రెండు పాఠశాలలను ప్రారంభించారు. అలాగే ప్రజంటేషన్ స్కిల్స్, హ్యాండ్ రైటింగ్ అన్నింటిలో మార్పులు వస్తేనే పరీక్షల పట్ల భయం పోయి పరీక్షలు మంచిగా రాస్తారని విద్యార్థులను డిఇఓ ప్రోత్సహించారు.

## సిఐగా బాధ్యతలు చేపట్టిన జానకిరామ్ రెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** పాలకుర్తి సబ్ ఇన్స్‌పెక్టర్‌గా జానకీరామ్ రెడ్డి బుధవారం బాధ్యతలను చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన మహేందర్‌రెడ్డి మహబూబాబాద్ టౌన్‌కు బదిలీ కావడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన సీఐ జానకీరాం రెడ్డి బదిలీపై వచ్చి సీఐగా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం

ఒక్క రూపాయి అవినీతి లేకుండా సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** నియోజకవర్గంలో ఏ మండలానికి ఎం కావాలి, ఏ గ్రామానికి ఎం కావాలి అని వారి అవసరాలను గుర్తించి పనులు మంజూరు చేస్తూ ముందుకు వెళ్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో కస్తూరిబా గాంధీ పాఠశాలలో 25లక్షల ఎస్డిఎఫ్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, 3లక్షల 50 వేల ఎంపి నిధులతో ఏర్పాటు చేసిన హై మాస్ లైట్లను అలాగే ముప్పారం గ్రామంలో 27లక్షల కూడా నిధులతో నిర్మించిన సిసి డ్రైన్, 20లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు.

అనంతరం ధర్మసాగర్ మండలం ముప్పారం శివారు లోనీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీ కాడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు.వంటగదిలో భోజనం, బియ్యం, కూరగాయలతో పాటు వంట సరుకులు, వసతులను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మమేకమై వారితో ముచ్చటించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో 10/10 సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తానని వారిని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థినిలకు పౌష్టికాహారం అందించాలని వారు సూచించారు.అలాగే ముప్పారం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం గత 15ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని, గత పాలకులు ఏనాడూ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి ప్రతీ క్షణం నియోజకవర్గంపైనే తన ఆలోచన ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో 800కోట్ల అభివృద్ధి నిధులు తీసుకువచ్చానని, స్వయంగా ముఖ్యమంత్రి వచ్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని ఇపుడు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు వెళ్తున్నాని తెలిపారు. బుధవరం ముప్పారం గ్రామంలో సుమారు 80లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నామని అన్నారు. కేజీబీవి పాఠశాలలో 25లక్షల సిసి రోడ్డు, 3లక్షల 50రూపాయలతో హైమాస్ లైట్ల ప్రారంభోత్సవం అలాగే ముప్పారం గ్రామంలో 27లక్షల సిసి డ్రైన్, 20లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభించుకున్నామని తెలిపారు. అలాగే ముప్పారం గ్రామానికి 35 ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయని, త్వరలోనే మరో 35ఇల్లు మంజూరు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, డీఎంహెచ్వో అప్పయ్య, పీఆర్ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ సదానందం, ఎంపిడివో అనిల్, ఏఈలు, మెడికల్ ఆఫీసర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో శిక్షణ పొంది లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా రాణించాలి



**ప్రజాపక్షం/జనగామప్రతినిధి:** సర్వేయర్లు పూర్తి స్థాయిలో శిక్షణ పొంది లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా రాణించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. గత నెల 26 నుండి జులై 2025 వరకు యశ్వంతాపూర్ గ్రామంలోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ పొందుతున్న సర్వేయర్ల శిక్షణ కేంద్రాన్ని డిప్యూటి కలెక్టర్ సుహాసిని, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ల్స మన్యంకొండలతో కలిసి బుధవారం సందర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా శిక్షణ పొందిన వారికి లైసెన్స్‌లు జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వంలోనే రెవెన్యూ శాఖలో, ఎల్ఆర్ఎస్ మున్సిపాల్టీలో టౌన్ ప్లానింగ్ జియోగ్రఫీ సర్వీసెస్ జిఎస్ మ్యాపింగ్‌లో సర్వేయర్ల ఆవిష్యకత ఉన్నందున ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కలెక్టర్ వెంట డిప్యూటి కలెక్టర్ సుహాసిని, మన్యంకొండ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

**స్టాఫ్ సెలక్షన్ కమీషన్‌కు ధరఖాస్తు చేసుకోవాలి**

భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు సంస్థలు నివేధించిన వివిధ పోస్టులకు ప్రత్యక్ష నియామకం కోసం ఓపెన్ కాంటటీటివ్ కంప్యూటర్ ఆధారిత పరీక్షలను ప్రాంతీయ సంచాలకు నిర్వయిస్తున్నందున స్టాఫ్ సెలక్షన్ కమీషన్ కోసం ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. పోస్టుల వివరాలు, వయో పరిమితి అవసరమైన విద్యార్హాత, చెల్లించాల్సిన రుపసుము, పరీక్ష పథకం, ధరఖాస్తు చేసే విధానములు కొరకు వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారం తెలుసుకోవాలన్నారు.

## ఎసిపిని కలిసిన పాత్రికేయులు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ ఏసీపిగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న నరసింహారావుని హనుమకొండ పాత్రికేయులు కుక్కల రాజు, కొడపాక శ్రీకాంత్, కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. కలిసిన వారిలో ప్రజాపక్షం రిపోర్టర్ రాజు, శ్రీకాంత్, శ్రీను, కుమార్‌పాల్గొన్నారు.

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్ళు

ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇండ్లని, సొంత ఇంటి కలతో పేదల కుటుంబాలు కళకళలాడుతున్నాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలంలో పలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నడివాడ, గడ్డగూడెం, గడ్డిగూడెం తండా, గ్రామ పంచాయతీల్లో అధికారికంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరకాల ఆశతో ఎదురు చూస్తున్న సొంత ఇంటి వసతి నెరవేరుతోందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదల కలల ఇందిరమ్మ రాజ్యం పునర్జీవం పోసుకుందని సుమారు దశాబ్ద కాలంతర్వాత ఇందిరమ్మ ఇండ్లతో పేదల కళ్ళలో వెలుగులు కనిపిస్తున్నాయని, అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఇబ్బందిపడాల్సిన అవసరంలేదని, ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన అర్హులైన వారికి ఇండ్లు అందేలా అధికార యంత్రాంగాన్ని ప్రత్యేకంగా నియమిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నిర్మాణాల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా పర్యవేక్షణ జరుగుతుందని, అర్హులకే మొదట ప్రాధాన్యం ఇస్తామన్న విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్యాల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు, లబ్దిదారులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రజాప్రభుత్వ ప్రాధాన్యత

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** గ్రామాలను అభివృద్ధి పరుచడమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వావిలాల, మల్లంపల్లి, దర్దేపల్లి, శాతాపురం, ఈరవెన్ను, తిరుమలగిరి, గూడూరు, గోపాలపురం, బమ్మెర గ్రామాలలో సీఆర్ఆర్ నిధులతో చేపట్టే సీసీ రోడ్లు డ్రైనేజి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామాలలో బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి తగిన మౌళిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రయత్నిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, పార్టీ నాయకులు కుమార్, సోమేశ్వర్, వేణు, వెంకన్న, అనిల్ కుమార్, దేవేందర్, పుల్లయ్య, కర్ణాకర్, యాకయ్య, రాఘవరావు, యాకాంతరావు, సోమిరెడ్డి, రమేష్, మల్లేష్, మహేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన కోసం దేశవ్యాప్త ఉద్యమం



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** కరెన్సీపై అంబేద్కర్ పోటో సాధన కోసం ఈ నెల 23 నుండి జనవరి 26 వరకు జ్తాయ స్థాయిలో ఉద్యమమం చేపడుతున్నట్లు కరెన్సీపై అంబేద్కర్ పోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ అన్నారు. బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యులు మల్లు రవి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు జి వంశీకృష్ణ, వినోద్‌లను కలిసి ప్రారంభ కార్యక్రమానిక ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ పరశురామ్ మాట్లాడుతూ కరెన్సీపై అంబేద్కర్ పోటో ముద్రించాలని గత కొన్నేళ్లుగా పోరాటం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 19సార్లు డిల్లీ కేంద్రంగా ఆందోళనలు చేయడంతో పాటు రాష్ట్రపతితో పాటు కేంద్ర మంత్రులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలవడం జరిగిందన్నారు. పలువురు ఎంపిలు పార్లమెంట్‌లోనూ ప్రస్తావించారని తెలిపారు. కరెన్సీపై అంబేద్కర్ పోటో ముద్రించాలని డిమాండ్ చేయడానికి కారణం ఉందన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆప్ ఇండి సృష్టికర్తనే అంబేద్కర్ అని అన్నారు. అందుకే తాము కరెన్సీపై అంబేద్కర్ పోటో ముద్రించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జాతీయ స్థాయి ఉద్యమంలో భాగం ప్రధానమంత్రికి పోస్టుకార్డులు వేయనున్నామని, అన్ని రాష్ట్రాల్లో యాత్ర చేపట్టి ప్రతి రాష్ట్రం నుండి వెయ్యికి తగ్గకుండా పోర్డుకార్డులు వేయిస్తామన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 23న జరిగే ప్రారంభ కార్యక్రమానికి తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలవడం జరిగిందన్నారు. ఆయనతో పాటు మల్లురవి, ఎంపి వంశీకృష్ణలు సానుకూలంగా స్పందించడంతో పాటు తప్పక కార్యక్రమానికి రానున్నారన్నారు. కరెన్సీపై అంబేద్కర్ పోటో సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.

## నెక్కొండ రైల్వేస్టేషన్లో కనీస సౌకర్యాలు ఏవీ?



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం లోని రైల్వే స్టేషన్ లోని రెండవ నెంబర్ ప్లాట్ ఫారం పై కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు నిత్యం ఎదుర్కొంటున్నారు. కూర్చోవడానికి కుర్చీలు లేవు, నిలువ నీడ లేదు, తాగడానికి నీరు లేదు.దాదాపు పది మండలాలకు ఒకే ఒక రైల్వే స్టేషన్ సంవత్సరానికి లక్షలాది రూపాయల ఆదాయం ఇస్తున్న కనీస వసతులు కరువై ప్రజలు నిలబడి రైళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. కూర్చోవడానికి కనీస సౌకర్యాలు కల్పించని అధికారులు, ఆదాయం మీద ఉన్న శ్రద్ధ ప్రయాణికులకు కనీస వసతుల సౌకర్యాలు కల్పించాలేని దుస్థితి కొందరు ప్రయాణికు లైతె ఫ్లై ఓవర్ వంతెన మెట్లపై కూర్చుంటున్నారు. ఇంత దీనమైన పరిస్థితి ఏ రైల్వే స్టేషన్ లో కూడా ఉండకపోవచ్చు అని ప్రయాణికులు వారి అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## పాఠశాలలన్నీ బలోపేతం చేసేందుకు కృషి

'ప్రజాపక్షం' ప్రచురణకు కదిలిన ప్రభుత్వ యంత్రాంగం



**ప్రజాపక్షం/గూడూరు:** బుధవారం ప్రజాపక్షం ప్రచురించిన మూసివేత దిశగా ప్రభుత్వ పాఠశాలలు అనే శీర్షిక వెలువడగా జిల్లా యంత్రాంగం స్పందించి బుధవారం గూడూరు మండల కేంద్రంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఏకంగా జిల్లా స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాకుండా మూతపడిన పాత పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని నిర్ణయాలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గిరిజన ఆశ్రమ పాఠశాలలకు సంబంధించినటువంటి ప్రధానోపాధ్యాయులు ఎస్సిఆర్పిలతో ఏటిడీవో భాస్కర్ ఏసీఎంవో రాములు డిప్యూడి ఈవో సారయ్య జిసిడిఓ విజయ డిఆర్పి శ్రీకాంత్ అదే విధంగా స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలిసి పాఠశాలలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈసందర్భంగా ఏటీడీవో భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ అదేశానుసారం గతంలో మూతబడ్డ పాఠశాలలను తిరిగి పున ప్రారంభించి పాఠశాలలను బలోపేతం చేయాడానికీ టీచర్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు కు దృష్టికి తీసుకుపోయి నియమించేలా కృషి చేస్తానని అన్నారు.మూతబడిన పాఠశాలలను తిరిగి ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈప్రక్రియ ఈ నెల 19 వరకు కొనసాగుతుందని తెలిపారు.అదేవిధంగా గత సంవత్సరంలో రాష్ట్రంలో 10 వ తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచిన మహబూబాబాద్ జిల్లా అందులో గిరిజన సంక్షేమశాఖ నుండి టెన్త్ క్లాస్‌లో రాష్ట్రంలో నే ప్రథమ స్థానంలో నిలిచిందని అది తిరిగి పురాతన చేయడానికి మేము ఇప్పటినుండి ప్రణాళికలు సిద్దం చేస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సుగుణ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న పోరాట యోధురాలు శాఖమూరి సుగుణ(91) ఆదివారము రాత్రి హైదరాబాదులోని సిఆర్ వృద్ధాశ్రమంలో మృతిచెందడం అత్యంత బాధాకరమని సిపిఐ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి, బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. సుగుణ ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు దివంగత ఎస్వీకే ప్రసాద్ సతీమణి ఎస్‌వికే ప్రసాద్ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర వహించారని, వారితో పాటు వారి సతీమణి సుగుణ ఆ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. ఎస్‌వికే ప్రసాద్ భారత కమ్యూనిస్టు పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శిగా 1953 నుండి 1961 వరకు బాధ్యతలు నిర్వహించి జిల్లాలో పేద ప్రజలకు భూమికోసం భుక్తి కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. 1957లో చెన్నూరు శాసనసభ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభలో ప్రజావాణిని వినిపించారన్నారు. భర్త అడుగు జాడలలోపయనిస్తూ కార్మిక కర్షక ఉద్యమాలలో సుగుణ గారు పాల్గొన్నారని, మహిళా హక్కుల కోసం మహిళా సమాఖ్య నాయకత్వ అనేక ఉద్యమాలు నడిపారన్నారు. కొన ఊపిరి ఉన్నంతవరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడిన సుగుణ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు తీరనిలోటని జోహార్లు అర్పించారు.

## సైనికులకు మద్దతుగా దివ్యాంగుల 'తిరంగ ర్యాలీ'

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా యుద్ధం చేసిన సైనికులకు మద్ధతుగా తెలంగాణ దివ్యాంగుల జెఎసి ఆధ్వర్యంలో బుధవారం తిరంగ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో సాయిబాబా దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ, పొట్టిశ్రీరాములు సెంటర్ మీదుగా ఎంపిడిఒ కార్యాలయం నుంచి మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు సాగింది. జాతీయ జెండాలను చేత పట్టి నినాదాలు చేశారు. త్రివిధ దళాలకు సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. త్రివిధ దళాల సత్తాను చాటారని అన్నారు. దేశం అంతా సైనికులకు రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘీభావంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు అల మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మల్లెబోయిన గోవిందరావు, కొండా హర్ష, తెలంగాణ దివ్యాంగుల జెఎసి చైర్మన్ పివి.చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

## 23న ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో చలోరాజ్‌భవన్ ముట్టడి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈనెల 23న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చలోరాజ్ భవన్ ముట్టడి చేపడుతున్నట్లు ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు గణపారపు ఉపేందర్, పాలేరునియోజకవర్గ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురంలో అఖిల భారత యుజవన సమాఖ్య ముఖ్య నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉగ్రవాదుల సమస్యలపరిష్కారానికి పాకిస్తాన్‌తో ఒప్పందం చేసిన ప్రధాని మోదీ ఈ దేశ బిడ్డలను మాత్రం ఎందుకు హతమారుస్తున్నారని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మావోయిస్టులతో తక్షణమే శాంతి చర్చలు జరపాలని సూచించారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్రకోణంతో ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు, అమాయక గిరిజనులపై కేంద్రం ప్రభుత్వం నరమేధానికి పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార దర్పంతో ప్రజా సమస్యలపై ప్రశ్నించే మావోయిస్టులను మట్టుబెట్టినంతమాత్రాన పోరాటం ఆగదని, మరో రూపంలో ప్రతిఘటన వస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు, ఎఐవైఎఫ్ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాజ్‌భవన్ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఇన్‌చార్జి మంత్రి శ్రీహరి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరిని ఉప ముఖ్యమంత్రి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియామకమైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశానని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఖమ్మం పర్యటనలో ఉన్నారని తెలుసుకుని హైదరాబాద్ నుంచి వచ్చి మర్యాదపూర్వకంగా కలిశానని ఇన్‌చార్జి మంత్రి మీడియాకు తెలిపారు. త్వరలో ఖమ్మం జిల్లాకు సంబంధించిన ముగ్గురు మంత్రులతో సంప్రదించి ఒక తేదీ ఖరారు చేసుకుని జిల్లా సమీక్షా సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. తొలుత ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

## 23న సిపిఐ కారేపల్లి మండల మహాసభ

**ప్రజాపక్షం/కారేపల్లి :** సిపిఐ కారేపల్లి మండల 17వ మహాసభ 23వ తేదీన మాదారం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబాబు అన్నారు. బుధవారం మండల మహాసభను జయప్రదం చేయాలని సూర్యతండా, ఉసిరికాయలపల్లి, సీతారాంపురం, మాణిక్యారం, గాదెపాడు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉంగరాల సుధాకర్, మండల నాయకులు పాపిని సత్యనారాయణ, రాయల రామారావు, అమెజాన్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, గుగులోతు మాంగు, భాగం వెంకటేశ్వర్లు, చెన్నాశెట్టి భూషయ్య, పారనంతా రామయ్య, బానోతు సింగ్, బానోతు రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రాప్ అవుట్ లేకుండా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధవహించాలి

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గిరిజన సంక్షేమ శాఖ గురుకులం కళాశాలలు ప్రారంభమైనందున విద్యార్థులు ఎవరు డ్రాప్అవుట్ కాకుండా అందరూ కళాశాలలకు వచ్చేవిధంగా సంబంధిత ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండలంలోని కృష్ణసాగర్‌లోని గురుకుల కళాశాలలోని తరగతి గదులు డార్మెటరీ వంట రూములు, పరిసరాలు, స్టోర్ రూములను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కళాశాలలో వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభమైనందున విద్యార్థులు ఎవరు ఆబ్సెంట్ కాకుండా అందరూ కళాశాలలో చేరే విధంగా ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలని, కొత్త మెనూ ప్రకారం విద్యార్థులందరికీ సమయానుకూలంగా పౌష్టికాహారమైన ఆహారం అందించాలని, విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా సంబంధిత ప్రిన్సిపాల్‌లు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండి వారికి సలహాలు, సూచనలు ఇస్తూ ఉండాలని, రూ.12లక్షల వ్యయంతో జిల్లా కలెక్టర్ క్రీడా మెటీరియల్ అందించినందున విద్యార్థులు వారికి ఇష్టమైన క్రీడలలో సంబంధించిన సమయము కేటాయించాలన్నారు. కళాశాలకు ఏమైనా మైనర్ రిపేర్లు ఉంటే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు పంపించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదోడి సొంత ఇంటికల సాధ్యమయ్యేనా?

సంపన్నులకు సొంతింటి కల స్వప్నం

జాడే లేని అధికారుల రీ సర్వే

**ప్రజాపక్షం/తిరుమలయాపాలెం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలనే లక్ష్యంతో విడతల వారీగా ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా, తిరుమలాయపాలెం మండలానికి 729 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఏలూవారిగూడెం గ్రామానికి మరో 39 ఇండ్లను మంజూరు చేసింది. మండల పరిధిలోని 40 గ్రామపంచాయతీల పరిధిలో గల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారికి కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు, వ్యవసాయ భూములు అంతకుముందే నాలుగైదు గదుల భవనాలు ఉన్న, వాహనాలు, ట్రాక్టర్లు ఉన్న సంపన్నులకు సొంతింటి కల స్వప్నం సహకారమైందని, నిరుపేదలు గుడిసెల్లోనే నివసించే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన పేర్లకు అధికారులు ఇండ్లు మంజూరు చేశారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నిరుపేదలు, గ్రామాల్లో ఇళ్లు లేని వారు అధికారులను నిలదీయగా ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన పేర్లను మళ్లీ రీ సర్వే చేస్తామని చెప్పటినప్పటికీ రీ సర్వే ఊసేలేదు. తిరుమలాయపాలెం మండలంలో ఇంతవరకు ఏ ఒక్క గ్రామంలో రీ సర్వే చేసి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన పాపాన పోలేదు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే నిరుపేదలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లు వేయలేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో రీ సర్వే చేసి అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## వైరా మద్యం డిపోకు నేడు విచారణ కమిటీ?

### ఐడి కార్డులు లేని 20మంది గుర్తింపు?

**ప్రజాపక్షం/వైరా :** వైరాలోని మద్యం డిపోనందు బుధవారం ఐఎంఎల్ మేనేజర్ హమాలీల ఐడి కార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 20 మందికి ఐడి కార్డులు లేనట్లు గుర్తించి పక్కన ఉంచినట్లు సమాచారం. వైరా మద్యం డిపోలో విచారణ చేపట్టేందుకు గురువారం అధికారులు వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే హమాలీ పోస్టు అమ్మకం వ్యవహారంపై సమాచారం అందుకున్న డిసితో పాటు మరికొంతమంది అధికారులు వైరా మద్యం డిపోకు వచ్చి ఎవరెవరు హమాలీలుగా పనిచేస్తున్నారు?, ఎవరి స్థానంలో మరొకరు పనిచేస్తున్నారు, అసలు హమాలీ పోస్టులు అమ్ముకోవాల్సిన అవసరం ఏమిటి, దీనికి సూత్రధారులు ఎవరు అనే కోణంలో విచారణ చేయనున్నారు. ఇప్పటికే ఐడి కార్డులు తనిఖీ చేయడంతో కొంతమంది అమ్ముకున్న వారిలో ఆందోళన ప్రారంభమైనట్లు సమాచారం. నేడు జరిగే విచారణలో ఏం జరగబోతుందో వేచిచూడాల్సిందే.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య



**ప్రజాపక్షం/మణుగూరు :** ప్రజా సమస్యలు పరిష్కరించాలని, పేద ప్రజలకు అండగా ఎర్రజెండా పనిచేస్తుందని, దాని హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని దీనికి అందరూ అండగా నిలవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య పిలుపునిచ్చారు. మంగళవారం మణుగూరు మండల రిక్షా కాలనీ, బాపూజీ నగర్ గ్రామం లో జరిగిన సిపిఐ గ్రామ శాఖ సమావేశం జంగం మోహన్ రావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బి.అయోధ్య హాజరై మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా కార్మికులు, కర్షకుల పక్షాన, రైతులు, వ్యవసాయ కూలీల పక్షాన సిపిఐ నిలబడి వారికోసం పోరాటాలు కొనసాగిస్తుందని, 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీ ఎర్రజెండా సిపిఐ ఒక్కటే అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలుస్తూ వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, డ్రైనేజీ వ్యవస్థ శుభ్రపరచాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీన గురువారం మణుగూరు కిన్నెర కల్యాణ మండపంలో జరుగు మణుగూరు మండల, పట్టణ మహాసభను జయప్రదం చేయాలని ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా హాజరు కానున్నారని, కావున పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, ఎఐటియుసి మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, కణితి సత్యనారాయణ, వేర్పుల నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీలు ఎన్నుకున్నారు. రిక్షా కాలనీ శాఖ కార్యదర్శిగా రవి, బాపూజీ నగర్ శాఖ కార్యదర్శిగా పి.వెంకటేశ్వర్లులను ఎన్నుకున్నారు.

## ప్రజల సమస్యలపై నిరంతర పోరాటాలు

సిపిఐ రాష్ట సమితి సభ్యుడు మిర్యాల రంగయ్య, కె.సారయ్య పిలుపు

ఈనెల 29న సిపిఐ పట్టణ మహాసభ




**ప్రజాపక్షం/ఇల్లెందు:** పట్టణంలోని 24ఏరియాలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఈనెల29న నిర్వహించతలపెట్టిన సిపిఐ పట్టణ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మిర్యాల రంగయ్య, కె.సారయ్య పిలుపునిచ్చారు. స్థానిక విఠల్‌రావ్ భవన్‌లో బుధవారం ఏర్పాటైన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ముందుగా అమరులైన సిపిఐ నాయకులకు, ఆపరేషన్ కగార్‌లో అమరులైన మావోయిస్టులకు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ మూడు సంవత్సరాల కాలంలో సిపిఐ పోరాటాలు, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలను చర్చించి తగు సూచనలు, సలహాలు అందించారు. అధికార పార్టీతో మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ప్రజల సమస్యలకోసం నిత్యం పోరాడతామని తెలిపారు. ఈనెల29న జరిగే మహాసభకు ప్రజలు, పార్టీశ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మగాని హరీశ్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాస శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్, బొల్లి కొమరయ్య, సదానందం, మహిళా నాయకురాలు చంద్రకళ పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం గురుకులాల నిర్వహణ




నూతన బస్ రూట్లకు ప్రతిపాదనలు

వివిధ పథకాలపై మంత్రి పొన్నంతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి సమీక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం నిర్దేశించిన నిబంధల ప్రకారం పక్కాగా గురుకులాలను నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బుధవారం మల్లు భట్టివిక్రమార్క రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి పాటిల్, సిపి సునీల్ దత్‌లతో కలిసి ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై సమీక్షించారు. గురుకులాల నిర్వహణ, స్టడీ సర్కిల్ పనితీరు, గ్రామీణాభివృద్ధి పనితీరు, రవాణా శాఖ, విద్యుత్ శాఖ పనితీరు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పురోగతిపై సంబంధిత అధికారులు వివరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గురుకుల పాఠశాలలు ప్రారంభం నాటికి పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలని, దీనికి అవసరమైన నిధులు ముందుగానే విడుదల చేయడం జరిగిందన్నారు. సరైన వసతులు లేని గురుకుల భవనాలను అవకాశం ఉన్నచోట ప్రత్యామ్నాయ భవనాలకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కామన్‌డైట్ ప్రోగ్రాంకు సంబంధించి షెడ్యూల్ తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులు, స్థానిక ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు గురుకులాలను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురుకులాల్లో చేపట్టిన చర్యలు, గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ, వన మహోత్సవ కార్యక్రమంలో తాటి, ఈత, ఖర్జురం మొక్కల పెంపకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి వాటిని సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తర్వాత నూతన బస్సు సర్వీసుల కోసం డిమాండ్ వస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మావోయిస్టులను కాల్చిచంపే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భాను ప్రసాద్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మావోయిస్టులను కాల్చి చంపే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులను అంతం చేయడం కాదు, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కౌన్సిల్ సభ్యులు పాలపాటి అశోక్, కాశ బోయిన అయోధ్య, చిరప్రసాద్ పాల్గొన్నారు.

## చినుకుకోసం రైతన్న ఎదురుచూపు

మొలకెత్తని పత్తి విత్తనాలు

ఆవేదనలో రైతులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** అకాలంలో కురిసిన వర్షం రైతులను నష్టపరిచింది. అదునులో కురవాల్సి వచ్చినప్పుడు వరుణుడు ముఖం చాటేశాడు. ముందే కేరళను తాకిన రుతుపవనాలు రాష్ట్రాన్ని కమ్మేస్తున్నాయంటూ ఊదరగొట్టిన వాతావరణ శాఖాధికారుల ప్రకటనలు ఏమయ్యాయో కానీ చినుకు రాలకపోగా ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. రోహిణి కంటే మృగశిర కార్తెలోనే ఎండలు ఎక్కువగా ఉన్నాయి. నాలుగు రోజులుగా ఎండ వేడిమికి తోడు బలమైన వడగాలులు వీస్తున్నాయి. రోహిణిలో గట్టి వర్షాలు రెండు, మూడు పడడంతో రైతులు వేలాది ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటారు. మొలిచిన మొక్కలు ఎండ వేడి గాలులకు వడబడి చనిపోతుండగా చాలాచోట్ల పత్తి విత్తనాలు మొలకెత్తలేదు. వేలాది రూపాయలు ఖర్చు చేసి విత్తనాలు కొనుగోలు చేసి నాటిన తర్వాత మొలకెత్తక పోవడంతో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. మిగిలిన పునాస పంటలకు కూడా అదును తప్పుతుందని, విత్తనాలు నాటడం ఆలస్యమైతే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు. దశాబ్ద కాలంగా రైతులకు ప్రకృతి సహకరించడంలేదు. అతివృష్టి, అనావృష్టితో పంటలు అధిక వర్షాలకు కుళ్లిపోవడం లేదా కొట్టుకుపోవడం కాదంటే ఎండిపోవడం జరుగుతుంది. అననుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడులు తగ్గడంతో పాటు పెట్టుబడులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మే మాసంలో వాతావరణ శాస్త్రవేత్తల ప్రకటనలు చూసి ఈ ఏడాది పంటల సాగుకు సానుకూల వాతావరణ పరిస్థితులు ఉంటాయని భావించిన రైతాంగానికి ప్రస్తుత పరిస్థితులు తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఇప్పటికైనా వర్షం కురిస్తే బాగుంటుందని రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. పగలంతా తీవ్రమైన ఎండ సాయంత్రం ఆకాశం మేఘావృతం కావడం మినహా వర్షం కురవడం లేదు. ఈ ఏడాది వరపటి కాలమే అవుతుందన్న ఆవేదన రైతుల నుంచి వ్యక్తమవుతుంది.



## మార్కెట్ యార్డుల్లో విశ్రాంతి భవనాలను నిర్మించండి

వ్యవసాయ మంత్రికి వినతి పత్రం అందించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ యార్డులలో విశ్రాంతి భవనాలను నిర్మించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి బుధవారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ లోని సెక్రటేరియట్ వ్యవసాయ శాఖామత్యులు తుమ్మల నాగేశ్వరరావుని ఎమ్మెల్యే రాగమయి మర్యాదపూర్వకంగా కలిసి నూతన విశ్రాంత భవనాలను నిర్మించాలని కోరి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు త్వరలోనే విశ్రాంతి భవనాలకు అనుమతులు ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## 'ధర్తీ ఆభాయోజన' పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసించే గిరిజన కుటుంబాల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కలిసి ధర్తీ ఆభాయోజన అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, దానిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధర్తీ ఆభా యోజన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఐటిడిఎ పిఒ రాహుల్‌కు గ్రామస్తులు గిరిజన సాంప్రదాయ ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ధర్తీ ఆభాయోజన గ్రామ సభకు వచ్చిన గిరిజనులకు గ్రామ సభలో అధికారులు చేపడుతున్న కార్యాచరణ, గిరిజనులకు అందిస్తున్న వివిధ రకాల కార్డుల గురించి ఆయన వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనుల సౌకర్యార్థం 'ధర్తీ ఆభాయోజన' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని, భద్రాద్రి కొత్తగూడెంలోని ఏజెన్సీ ఏరియాలో 130 గ్రామ పంచాయతీలను సెలెక్ట్ చేయడం జరిగిందన్నారు. ఆ గ్రామ పంచాయతీలో కృష్ణసాగర్ కూడా ఉందని, అందుకు గ్రామ పంచాయతీలో నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి మనిషికీ గుర్తింపు కార్డు అనేది తప్పనిసరి అని, అటువంటి గుర్తింపు కార్డులను అధికారులే వచ్చి మీ గ్రామస్తుల సమక్షంలో మీకు కావాల్సిన కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పకుండా వారికి కావలసిన కార్డులు రిజిస్ట్రేషన్ చేసి అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ బాలయ్య, ఎంఎఒ కృష్ణయ్య, డాక్టర్ లక్ష్మి, ఎఒ శంకర్, ఎపిఒ విజయలక్ష్మి, ఆర్ఐ నరసింహారావు, ఎపిఎం నాగార్జున, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, మీసేవ నిర్వాహకులు నాగేశ్వరరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులు ఫిర్యాదు చేసినా బాధ్యత లేదా?

ఆల్ఫా స్కానింగ్ సెంటర్ పై చర్యలేవి?

ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలి




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** తమకు అన్యాయం జరిగింది, న్యాయం చేయాలంటూ సాక్షాత్తు బాధితులు ఫిర్యాదు చేసినా జిల్లా ఉన్నతాధికారులు అంటిముట్టనట్లు వ్యవహరించడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినా అధికారులకు బాధ్యత లేదా అంటూ మండిపడుతున్నారు. గత నెలలో పట్టణంలోని ఆల్ఫా స్కానింగ్ సెంటర్, బాలాజీ నర్సింగ్ హోంలపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని కోరుతూ గర్భిణీ భర్త కిరణ్ కుమార్ కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా అధికారులు ఇప్పటి వరకు ఆసుపత్రి, స్కానింగ్ సెంటర్‌లపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ఉన్నతాధికారులను పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత కొన్ని నెలలుగా సత్తుపల్లి ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యం వికటించి రోగులు మరణిస్తుండటం,స్కానింగ్ సెంటర్లలో తప్పుడు రిపోర్టులతో రోగులు ఇబ్బందులు పడి ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల వద్ద ఆయా బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిన విషయమే. తమకు అన్యాయం జరిగిందని ఓ గర్భిణీ భర్త లిఖితపూర్వకంగా ఆల్ఫా స్కానింగ్ సెంటర్, లలిత కుమారి ఆసుపత్రులపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో జిల్లా ఉన్నతాధికారులు వెనకడుగు వేయడం వెనుక మర్మం ఏమిటని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఆల్ఫా స్కానింగ్ సెంటర్ లలితకుమారి ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే జిల్లా ఉన్నతాధికారులపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలుపుతున్నారు. ఈ విషయంపై జిల్లా వైద్య శాఖ అధికారిణి కళావతిని వివరణ కోరగా తాము ఎంక్వయిరీ చేసి నోటీసులు ఇచ్చామని చెప్పారు. బాధితులకు ఈ విషయంలో ఎటువంటి సమాచారం లేకపోగా పత్రికలలో వార్తలు వచ్చిన మరుసటి రోజు డిప్యూటీ డిఎంహెచ్ఒ స్కానింగ్ సెంటర్‌ను సందర్శించారు. బాధితులు ఫిర్యాదు అనంతరం స్కానింగ్ సెంటర్, ఆసుపత్రులపై ఎటువంటి విచారణ జరగకుండానే విచారణ జరిపామని ఉన్నతాధికారిణి తెలపటం వారి నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తుంది.

## రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపికలు

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జూలూరుపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశ ఎంపికలు నిర్వహించారు. మండలంలోని నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు సుమారుగా 40 మంది పాల్గొన్నారు. వీరందరికీ బ్యాటరీ టెస్టులు నిర్వహించి, బ్యాటరీ టెస్ట్ అంటే ఎత్తు, బరువు స్టాండింగ్ బ్రాడ్ జంప్ 30 మీటర్స్ ఫ్లయింట్ 10 ఇంటూ సిక్స్ మీటర్స్ మెడిసిన్ బాల్ 800 మీటర్స్ రన్నింగ్ ఫ్లెక్సిబిలిటీ వర్టికల్ జంప్ విటన్నిటినీ కలిపి బ్యాటరీ టెస్ట్ అంటారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి బానోతు జుమ్కీలాల్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.లక్ష్మీ నరసయ్య, వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు బానోతు అరుణ, చింతలపూడి యుగంధర్, సురేఖ, రవ్వ కనకమ్మ, గుగులోత్ నాగేశ్వరరావు, నాగమణి, బానోతు నేతాజీ, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఇంగ్లాండ్‌కు సూర్యకుమార్..

### స్పోర్ట్స్ హెర్నియాకు ట్రీట్మెంట్



టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. ఇంగ్లాండ్‌కు పయనమయ్యాడు. అతను అక్కడ శస్త్ర చికిత్స చేయించుకోనున్నాడు. గజ్జల్లో గాయానికి అతను ట్రీట్మెంట్ తీసుకోనున్నాడు. ఒకవేళ అవసరం అయితే స్పోర్ట్స్ హెర్నియాకు శస్త్ర చికిత్స తీసుకునే అవకాశాలు ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఇటీవల ముగిసిన ఐపిఎల్‌లో.. సూర్యకుమార్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఆ టోర్నీలో అతను ముంబై ఇండియన్స్ తరఫున 700 పైగా రన్స్ స్కోర్ చేశాడు. ఆ తర్వాత ఈ మధ్యే ముంబై ప్రీమియర్ లీగ్ టీ20 కూడా ఆడాడతను. అయితే ముంబై టీ20 టోర్నీ ఆడుతున్న సమయంలో.. అతని గజ్జల్లో నొప్పి మరింత తీవ్రమైనట్లు తెలుస్తోంది. వరుసగా బ్రేక్ లేకుండా క్రికెట్ ఆడడం వల్ల కూడా సమస్య అధికంగా అయినట్లు అనుమానిస్తున్నారు. స్పోర్ట్స్ హెర్నియా చికిత్స కోసం యూకేకు సూర్య వెళ్లినట్లు బిసిసిఐ అధికారి ద్వారా తెలిసింది. అయితే మళ్లీ ఆగస్టు నెల వరకు టీ20 మ్యాచ్‌లు లేకపోవడంతో.. ఈ సమయంలో ట్రీట్మెంట్ తీసుకోవాలని సూర్య భావించాడు. చికిత్స ముగిసిన తర్వాత బెంగళూరులోని ఎక్సలెన్స్ సెంటర్‌లో కోలుకునే అవకాశాలు ఉన్నట్లు బిసిసిఐ అధికారి ఒకరు వెల్లడించారు.

## రెడిట్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ తెండూల్కర్



రెడిట్ సోషల్ మీడియా సంస్థ.. భారత లెజెండరీ క్రికెటర్ సచిన్ తెండూల్కర్ బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. క్రీడా వర్గాల్లో, క్రీడా అభిమానుల్లో తమ ప్లాట్‌ఫామ్‌ను విస్తరింపజేయాలన్న ఉద్దేశంతో సచిన్‌ను అంబాసిడర్‌గా నియమించినట్లు తెలుస్తోంది. తన అఫిషియల్ రెడిట్ అకౌంట్ ద్వారా సచిన్ అభిమానులకు అందుబాటులో ఉంటారు. ఆ ప్లాట్‌ఫామ్‌లో యూజర్లతో యాక్టివ్ ఎంగేజ్ అవుతారు. సబ్‌రెడిట్‌లో వర్చువల్‌గా సచిన్ పాల్గొంటున్నారు. వర్చువల్ స్టోరీలు, మ్యాచ్ విశ్లేషణలు, విశిష్టమైన కాంటెంట్‌ను తన ఫ్యాన్స్‌తో సచిన్ షేర్ చేసుకోనున్నారు. భారత్ క్రికెట్, భారతీయ క్రీడల గురించి రెడిట్‌లో చర్చించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు సచిన్ పేర్కొన్నారు. ఫ్యాన్స్‌తో కొత్త రీతిలో తమ అనుభవాలు పంచుకునే అవకాశం వచ్చిందన్నారు.

## ఇంగ్లాండ్–భారత్ సిరీస్..

# సమరానికి సిద్ధం

**భారత్ తుది జట్టును ఎంపిక చేసిన మాజీ బ్యాటర్..**

**నితీశ్, అర్ష్‌దీప్‌లకు నో ఛాన్స్**




ఇంగ్లాండ్ భారత్ మధ్య ఐదు టెస్టుల సమరానికి సమయం ఆసన్నమవుతోంది. జూన్ 20న ప్రారంభంకానున్న ఈ సిరీస్‌తోనే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–2027 ప్రారంభంకానుంది. లీడ్స్ వేదికగా జరగనున్న మొదటి టెస్టుకు కోసం ఇరుజట్లు నెట్స్‌లో సాధన చేస్తున్నాయి. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో తుది జట్టు ఎలా ఉండనుంది అనే దానిపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత మాజీ బ్యాటర్ వసీమ్ జాఫర్ తన అంచనా ప్రకారం తొలి టెస్టు కోసం టీమ్ఇండియా తుది జట్టును ఎంపిక చేస్తూ ఎక్స్ (ట్విటర్)లో పోస్టు చేశాడు. భారత్ ప్లేయింగ్ ఎలెవన్‌లో నితీశ్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్‌కు వసీమ్ అవకాశం కల్పించలేదు. భారత ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌లను జాఫర్ ఎంపిక చేశాడు. మూడో స్థానంలో అభిమన్యు ఈశ్వరన్ లేదా సాయి సుదర్శన్‌కు అవకాశం దక్కొచ్చని అంచనా వేశాడు. దేశవాళీ క్రికెట్‌లో అభిమన్యు, ఐపీఎల్ 2025లో అదరగొట్టిన సాయి సుదర్శన్ అదరగొట్టిన సంగతి తెలిసిందే. జాఫర్ ఎంపిక చేసిన భారత్ తుది జట్టులో నాలుగో స్థానంలో శుభ్‌మన్ గిల్, ఐదో స్థానంలో రిషభ్ పంత్ ఉన్నారు. వసీమ్ తర్వాతి రెండు స్థానాల్లో కరుణ్ నాయర్, రవీంద్ర జడేజాలను తీసుకున్నాడు. ఎనిమిదో స్థానంలో పేసర్ శార్దూల్ ఠాకూర్, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌లలో ఒకరు చోటు దక్కించుకుంటారని అభిప్రాయపడ్డాడు. వసీమ్ చివరి మూడు స్థానాలకు ప్రసిద్ధ్ కృష్ణ, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లను ఎంపిక చేశాడు. దీనికి నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. కొంత మంది జట్టు ఎంపిక బాగుందని పేర్కొంటుండగా.. మరికొందరు బాగోలేదని కామెంట్లు చేస్తున్నారు. శార్దూల్‌కు బదులు అంశుల్ కాంబోజ్, ప్రసిద్ధ్ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌ను ఎంపిక చేయాల్సిందని అభిప్రాయపడుతున్నారు.

### భారత జట్టులోకి హర్షిత్ రాణా

ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు కోసం హర్షిత్ రాణాను టీమ్ఇండియాలోకి తీసుకున్నారు. ఈ మేరకు బిసిసిఐ అధికారికంగా ప్రకటన చేసింది. భారత్ ఎ జట్టులో ఉన్న పేసర్ హర్షిత్ రాణా టీమ్ఇండియాతో కలిశాడు. దీంతో జట్టులో ప్రధాన బౌలర్ల సంఖ్య 6కి చేరింది.

### మొదటి టెస్ట్ మ్యాచ్ పిచ్



ఇంగ్లాండ్, టీమ్ఇండియా మధ్య జూన్ 20 నుంచి అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. తొలిపోరు లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా జరగనుంది. ఈ నేపథ్యంలో అక్కడ పిచ్ ఎలా ఉండనుందో.. లీడ్స్ గ్రౌండ్స్ హెడ్ రిచర్డ్ రాబిన్సన్ వివరించే ప్రయత్నం చేశాడు. 'ఇక్కడ అసాధారణంగా పొడి వాతావరణం వల్ల మంచి సర్ఫేస్ ఉన్న పిచ్ ఉండొచ్చు. ఇంగ్లాండ్ టీమ్ కూడా ఇలాంటి ఉపరితలం ఉండే పిచ్‌నే కోరుకుంటోంది. తొలి రోజున పిచ్ ఫాస్ట్ బౌలర్లకు సహాయపడుతుంది. ఈ తర్వాత వేడి కారణంగా క్రమంగా ఫ్లాట్‌గా మారొచ్చు. ఇంగ్లాండ్ బజ్‌బాల్ క్రికెట్‌కు సరిపోవడమే కాకుండా.. అంతగా అనుభవం లేని టీమ్ఇండియా బ్యాటింగ్ లైనప్‌కు పరీక్ష పెట్టొచ్చు' అని పేర్కొన్నాడు. గతంలో ఎప్పుడైనా సరే ఈ మైదానంలో టెస్ట్ సిరీస్ మధ్యలోని మ్యాచ్‌లను నిర్వహించేవారు. కానీ ఈ సారి మొదటి మ్యాచ్‌తో సిరీస్ ఇక్కడే ప్రారంభం కాబోతోంది. దీంతో ఈ అంశం క్రికెట్ అభిమానులు, విశ్లేషకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఫోకస్

# కళారంగం




## సకల కళా కేంద్రం.. సంగీతం

**21న ప్రపంచ సంగీత దినోత్సవం**



**అన్ని కళల్లోకీ సంగీతానిది అగ్రస్థానం. అందుకే 'శిశుర్వేత్తి పశుర్వేత్తి... వేత్తి గానరసం ఫణిః' అంటారు. మనుషులేకాదు.. పశుపక్షాదులు సైతం సంగీతాన్ని ఆస్వాదిస్తాయి. తల్లి గర్భంలోని శిశువును సైతం సంగీతం ప్రేరేపిస్తుందని పరిశోధనల్లో తేలింది. సంగీతం మూలాలు కొన్ని వేల సంవత్సరాలనాటివి. అప్పటి నుంచి అధునాతన కంప్యూటర్ యుగం వరకూ సంగీతం అజరామరంగా విరాజిల్లుతునే ఉంది. గానం, వాద్యం వేరువేరుగా ఉన్నా... ఒకటిగా కలిసినా.. రెండూ సంగీత పార్శ్వాలే. పురాతన కాలం నుంచి సంగీత ఝురి ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూసింది. అడ్డంకులు ఎదురైన ప్రతిసారీ దారి మార్చుకుందేగానీ, ప్రస్థానాన్ని ఆపలేదు. అందుకే, సాంప్రదాయమైనా... ఆధునికమైనా.. సంగీతం ప్రజలను పరవశింప చేస్తునే ఉంది.**

జనపదాల్లో పాడుకునే పాటల నుంచి జాజ్.. ర్యాప్ మ్యూజిక్ వరకూ సంగీతం ప్రజల జీవితాలతో మమేకమైంది. ఇంతటి ప్రాధాన్యతను కలిగి ఉన్నది కాబట్టే, సంగీతానికి ప్రత్యేక గుర్తింపునిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో, ఏటా 21న ప్రపంచ సంగీత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. 1982లో ఫ్రాన్స్‌లో మొదలైన ఈ ఉత్సవానికి మూలకర్త అప్పటి ఫ్రాన్స్ సంస్కృతి శాఖ మంత్రి జాక్ లాంగ్. 'ఫిటే డె లా మ్యూసికె' (సంగీతాన్ని జరుపుకుందాం) పేరుతో, లాంగ్‌తో పాటు సంగీతశాస్త్రవేత్త మారిస్ ఫ్లూరెట్ సంగీతాన్ని ప్రజల జీవితాల్లో భాగం చేయాలనే సంకల్పంతో ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. క్రమంగా ఈ దినోత్సవానికి ఆదరణ పెరిగింది. ఫ్రాన్స్‌లో మొదలైన సంబరాన్ని ఇప్పుడు 120కి పైగా దేశాల్లో జరుపుకుంటున్నారు. సంగీతం అందరికీ ఉచితంగా అందాలనీ, అది ప్రతి ఒక్కరి హక్కు అనే భావలను ప్రోత్సహించడమే ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా వివిధ రకాల సంగీత శైలులకు గుర్తింపు ఇవ్వడం, యువ సంగీత కళాకారులను ప్రోత్సహించడం, స్థానిక కళాకారులకు తమ తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు కల్పించడం తదితర అంశాలను ప్రధానంగా ముందుకు తీసుకెళ్లే అంతర్జాతీయ దినోత్సవమిది. ఇందులో భాగంగా, బహిరంగ సంగీత ప్రదర్శనలు, కళాశాలలు, స్కూల్‌లు, సంగీత సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. ప్రజలు రోడ్లపై లేదా పార్కుల్లో స్వయంగా వాయిద్యాలు వాయించడం ద్వారా తమలో దాగివున్న సంగీత కళను ప్రదర్శిస్తారు. రేడియో, టీవీ ఛానళ్ల ద్వారా ప్రత్యేక సంగీత కార్యక్రమాల ప్రసారం ఉంటుంది. సంగీతాన్ని విశ్వజనీనం చేయడం ఈ ఉద్యమ ధ్యేయం. సంగీతానికి భాషా భేదాలు లేవు. ఇది మానవ హృదయాలను కలుపుతుంది. సంగీతం వల్ల మనలో భావోద్వేగాలు, సృజనాత్మకత, ఆనందం, శాంతి పెరుగుతాయి. సంగీతం కేవలం వినోదం మాత్రమే కాదు, ఒక జీవన శైలి కూడా. సంగీతం అనేది మనసుకు అందే అమృతం. దీనితో జీవితం రాగరంజితమవుతుంది. సంగీతం అనేది ప్రపంచవ్యాప్తంగా మాట్లాడే ఏకైక భాష. అర్థం తెలిసికూడా వినిపించే ధ్వనులు భావోద్వేగాలను ఉత్పత్తి చేస్తాయి. సున్నితమైన సంగీతం వినడం వల్ల హృదయ స్పందన మెల్లగా మారుతుంది, రక్తపోటు తగ్గుతుంది. మానసికంగా ఇష్టమైన సంగీతాన్ని వినడం వల్ల మెదడులో డోపమిన్ అనే ఆనంద హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. చిన్నప్పటి నుంచి సంగీతాభ్యాసం చేసిన పిల్లల్లో గణిత, భాషా నేర్పు మెరుగ్గా కనిపిస్తుంది. సంగీతాన్ని థెరపీగా ఉపయోగించి అనేక మానసిక రుగ్మతలకు చికిత్స చేస్తున్నారు. దీనిని 'మ్యూజిక్ థెరపీ' అంటున్నారు. మన మెదడు ఒకసారి విన్న పాటను పదాలకంటే ముందు దాని ధ్వనిని గుర్తు పట్టగలదు. కొన్ని అధ్యయనాల ప్రకారం, మృదువైన సంగీతం మొక్కల వృద్ధికి సహాయపడుతుందని చెబుతారు. గర్భస్థ శిశువులు 25 వ వారం తర్వాత సంగీతానికి స్పందించగలవని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. కొన్ని పక్షులు నిర్దిష్ట రాగాల సైకిల్‌తో మానవ గీతాల మాదిరిగా గానం చేస్తాయి. జాన్ కేజ్ అనే సంగీతకారుడు 4 నిమిషాల 33 సెకన్ల పాటలో ఏ ధ్వనికూడా వాడలేదు...కానీ అది సంగీతంగా గుర్తింపు పొందింది. భారతీయ శాస్త్రీయ సంగీతంలో ప్రతీ రాగం ఒక ప్రత్యేక సమయానికి చెందుతుంది. ఉదాహరణకు భూపాలి రాగం ఉదయాన్నే వినాలి అంటారు. కొన్ని అధ్యయనాల ప్రకారం, మ్యూజిక్ మెమరీ శక్తిని, మనోవికారాలను మెరుగుపరచి మానసిక వృద్ధిని నిరోధించగలదు. పశువులకు సంగీతం వినిపించడమే కాదు.. అది పాల ఉత్పత్తిని పెంచుతుందని చెప్తారు. బీట్స్ పరిమాణం మన పాదాల వేగాన్ని ప్రభావితం చేస్తుంది. మ్యూజిక్ వింటూ నడిచేవారు మెల్లగా లేదా త్వరగా నడుస్తారు. సంగీతంతో భాష కూడా నేర్చుకోవచ్చు. చిన్నారులకు గీతాల ద్వారా కొత్త పదాలు నేర్పటం అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. సంగీత రహిత సినిమాల్లో కూడా నేపథ్య సంగీతం ఉంటుంది. నదుల ప్రవాహం, గాలిలో చెట్ల రేగుడు.. ఇవే సంగీత స్వరాలకు ప్రేరణగా మారాయి. వినే మనసు ఉండాలేగానీ, ప్రపంచమంతా సంగీతమయమే.



## సిపిఐ జిల్లా మహాసభలకు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/ నస్పూర్ :** మంచిర్యాల జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) నాలుగో జిల్లా మహాసభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, జూన్ 21, 22 తేదీల్లో జరిగే ఈ కీలక సమావేశాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. బుధవారం నస్పూర్ మండలంలో సిపిఐ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణ్, మహాసభల వివరాలను వెల్లడించారు. జిల్లా భవిష్యత్తు, ప్రజల సమస్యలపై చర్చించడమే ప్రధాన లక్ష్యమని, సిపిఐ జిల్లా మహాసభలకు రాష్ట్ర స్థాయి నాయకత్వం హాజరుకానున్నారన్నారు. జూన్ 21న మధ్యాహ్నం 3 గంటలకు ఐబి చౌరస్తా నుండి బాయ్స్ హైస్కూల్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించబడుతుందని, ఈ ప్రదర్శనలో కార్మికులు, కర్షకులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేయాలని కోరారు. జూన్ 22న సుమారు 300 మంది ప్రతినిధులతో ప్రత్యేక సభ జరుగుతుందని. సభలో జిల్లా సమగ్ర అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపై కీలక తీర్మానాలు చేయబడతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నూతన బొగ్గు బావులను తీసుకురావాలని, ఓపెన్‌కాస్ట్ (ఓసి) గనులలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ మహాసభల్లో చర్చించి, వాటి పరిష్కారం కోసం తీర్మానాలు చేయబడతాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట్ల చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరు నగేష్, జిల్లా సమితి సభ్యులు దొడ్డిపట్ల రవీందర్, పౌలు, సింగపూర్ కార్యదర్శి పూజారి రామన్న తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుబాట

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్**



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసం చేస్తున్నాయని, వాటి విధానాలపై ఉద్యమిద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన జిల్లా మహాసభల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాస్ పథకం లబ్ధిదారులకు అందకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిస్తామని, కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దేశానికి ప్రమాదకరమని తెలిపారు. అధికారంలో లేనప్పటికీ, కార్మికులు, కర్షకులు, రైతులు, వ్యవసాయ కూలీల పక్షాన సిపిఐ నిలబడి పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీ ఎర్ర జెండా సిపిఐ ఒక్కటే అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలిచి, వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ పౌరులకు అందించాల్సిన సంక్షేమ ఫలాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, అమాయక గిరిజనులను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణమే నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, తక్షణం కాల్పుల విరమణ (సీజ్ ఫైర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అనంతరం జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ మాట్లాడుతూ, పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని, తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ టౌన్ అధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి, సత్యనారాయణ, రామగిరి దోన్నాజీ, సప్తే జయరాం, తోట రామచందర్, బద్రి సాయి, అజయ్, మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఎర్ర జెండానే భరోసా


**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. షాబీర్ పాషా**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యద ర్శి ఎస్కే షాబీర్ పాషా విమర్శించారు. బుధవా రం మండల పరిధిలోని సారపాక కపర్తి భవనం కామ్రేడ్ ఆళ్లగురు ప్రసాద్ ప్రాంగణంలో బూర్గంపాడు మండల 18వ మహాసభ ఎండి సాజిద్ అ ధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీం కోర్టు ఈ కేసును సు మోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపా రు. పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలకు సిద్ధంగా ఉండాలని, ప్ర తి పంచాయితీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధం గా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మాట్లాడుతూ దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నంది పలికి ఆధునికతవైపు నడిపించింది ఎర్ర జెండానేనని, అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీ కుమారి, సిపిఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వర్లు(లడ్డా), నాయకులు పేరాల శ్రీనివాసరావు, అలవాల సీతారాంరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/ పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనుమతులు లేని, నియమ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రామగుండం మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్యకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు అనుమతులు లేకున్నా, రంగు రంగుల కరపత్రాలతో, హంగు ఆర్భాటాలతో, ఆకర్షించే విధంగా, లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ, మా పాఠశాలలో చేరితే ఫీజులో రాయితీ కల్పిస్తామని, మాయ మాటలు చెప్పి, చేరిన తర్వాత మొత్తం ఫీజు కట్టాలంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తూ, మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలలకు ప్రభుత్వం నుండి అనుమతులు ఉన్నా యా! లేవా! అని తెలుసుకొని చేర్పించాలని ఆయన అన్నారు. ధనార్జనే ధ్యేయం గా పెట్టుకొని అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా నడుపుతున్న, ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని, అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశా రు. లేని పక్షంలో విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, రామగుండం మండ లం అధ్యక్షులు మాతంగి సాగర్ తదితరులు పాల్గొన్నారు.




## అధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలను సీజ్ చేయాలి

**ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్**

**ప్రజాపక్షం/చొప్పదండి :** అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో చొప్పదండి మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మచ్చ రమేష్ మాట్లాడారు. ప్రభుత్వ గురుకులాలు, బెస్ట్ అవెలేబుల్ స్కీమ్ పాఠశాలలు మూతపడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకపోతే మంత్రులను అడ్డుకుంటామని హెచ్చరించారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగంపై సమీక్షించి ప్రభుత్వ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విద్యారంగం గాడి తప్పిందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేవన్నారు. విద్యార్థులు లేరనే సాకుతో ప్రభుత్వం 12 ఎస్‌సి గురుకుల ఇంటర్ కళాశాలలను మూసివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్,కార్పోరేట్ విద్యాసంస్థలు అదిక ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల, కళాశాల గుర్తింపు రద్దు చేసే విధంగా కఠిన చట్టం తేవాలని, ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో ఆ విద్యాసంస్థల ముందు ధర్నాలు చేస్తామన్నారు. అన్ని రకాల బకాయిలను విడుదల చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల చదువులకు నిధులు విడుదల చేయకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు పవన్ కళ్యాణ్, రామ్, రేవంత్, ప్రశాంత్, శ్రీకాంత్, కృష్ణ, రఘు, మనోజ్ తదితరులున్నారు.



## విద్యను వ్యాపారంగా మార్చిన విద్యాసంస్థలు


**అధిక ఫీజులు వసూలు చేసే వాటిపై దాడులు : మణికంఠ రెడ్డి**



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నారని ప్రభుత్వం ఫీజులను నియంత్రించకుండా ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతుందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి విమర్శించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎఐఎస్ఎఫ్ సమావేశంలో మణికంఠ రెడ్డి మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ విద్యాసంస్థలపై దాడులు తప్పవని అన్నారు. ప్రభుత్వ గురుకులాలు బెస్ట్ అవలేబుల్ స్కీమ్ పాఠశాలలు మూతపడుతున్న ప్రభుత్వాన్ని నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆర్టిసి బస్ పాస్ చార్జీలను పెంచడం సరికాదని విద్యార్థులకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభం అయిన నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి విద్యారంగంపై సమీక్ష చేసి ప్రభుత్వ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఫీజు రియింబర్స్మెంట్ వెంటనే చెల్లించాలన్నారు. పాఠశాల కళాశాలలో యూనివర్సిటీలలో టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గురుకులాలు మోడల్ స్కూల్లో కేజీబీవీ లలో నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేయాలన్నారు.రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల,కళాశాలల గుర్తింపు రద్దు చేసే విధంగా కఠిన చట్టం తేవాలని, ప్రతి ప్రవేట్ విద్యాసంస్థ నిబంధనలు పాటించాలని లేని పక్షంలో ఆ విద్యాసంస్థల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాకేష్,మంద అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి సొల్లు సాయి, రజినీకాంత్,మెతుకు అజయ్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

**ఎఐఎస్ఎఫ్ డిమాండ్**



**ప్రజాపక్షం/ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీ సుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎ ఫ్) ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కు మార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్‌లు డి మాండ్ చేశారు. బుధవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జి ల్లా విద్యాశాఖ సూపరిండెంట్ రాజన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్, జోసఫ్‌లు మా ట్లాడుతూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉ న్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పాఠశాలలోనే పుస్తకాలు, యూనిఫామ్ అ మ్ముతూ అక్రమంగా లక్షల రూపాయలను దోచుకుంటున్నారన్నారు. విద్యా అర్హత లేని వారితో విద్య బోధన చేయిస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో పేదలకు 25 శాతం ఉచిత విద్యను అమలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలను గు ర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ ప్రవేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టకపోతే అఖిల భారత విద్యా ర్థి సమా ఖ్య ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## రెవెన్యూ సదస్సులో దరఖాస్తులకు పరిష్కారం

అదనపు కలెక్టర్ అబ్దుల్ హైమద్

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రెవెన్యూ సదస్సులో వచ్చిన ధరఖాస్తులకు సత్వర పరిష్కారం జరుగుతుందని అదనపు కలెక్టర్ అబ్దుల్ హైమద్ అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. పహణీలో తప్పుడు పేర్లు, పట్టా భూములు ప్రభుత్వ భూములుగా రెవెన్యూ రికార్డులో తప్పుడుగా నమోదు కావడం లాంటివి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి సవరణ చేస్తామన్నారు. జిల్లాలో అధికంగా భూ రికార్డుల్లో ధరణి ఫోర్టల్ ద్వారా పొరపాట్లు జరిగినట్లుగా ఫిర్యాదులు రావటంతో వాటి సవరణ కోసం ప్రభుత్వం భూభారతి కొత్త చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 30 వేల దరఖాస్తులు ఈ సదస్సుల ద్వారా వచ్చినట్లు ఆయన తెలిపారు.

## సిపిఐతోనే ప్రజా సమస్యలు పరిష్కారం : మంద పవన్




**ప్రజాపక్షం/చేర్యాల :** సిపిఐ పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. బుధవారం చేర్యాల మండల పరిధిలోని కడవెరుగు గ్రామానికి చెందిన సిపిఎం మండల కమిటీ సభ్యుడు పొనుగోటి శ్రీనివాస్ రెడ్డి, మేస్త్రీ సంఘం జిల్లా నాయకుడు కొమ్ము కనకరాజులు సిపిఐలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి మంద పవన్ సాధరంగా ఆహ్వానించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్న పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్,అందె అశోక్,కనుకుంట్ల శంకర్,జిల్లా కౌన్సిల్ సభ్యులు జెరిపోతుల జనార్ధన్, చేర్యాల మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, మద్దూర్ మండల కార్యదర్శి జంగిలి యాదగిరి పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి చేర్చుకోవాలి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండలంలోని దుమాల ఏకలవ్య గురుకులంలో ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ఎఐటియుసి కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ప్రిన్సిపల్ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని కోరారు. విధుల్లోకి తీసుకోని పక్షంలో ఆందోళన చేయడానికి సిద్ధమన్నారు. జిల్లా నాయకురాలు రజిత, మంజుల, లావణ్య, రాజేష్, రాకేష్, మల్లేషం పాల్గొన్నారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు ఇబ్బందులు రానివ్వొద్దు : సిపిఐ




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిలో అనేక సంవత్సరాలు పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులకు ఇబ్బందులు రానివ్వొద్దని సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ యజమాన్యాన్ని కోరారు. బుధవారం స్థానిక భాస్కర రావు భవన్‌లో ఏర్పాటుచేసిన రిటైర్డ్ కార్మిక సంఘం సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై గోషిక మోహన్, నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్యతో కలిసి కనుకరాజ్ మాట్లాడారు. సింగరేణి హాస్పిటల్‌లో మందుల కొరత లేకుండా చూడాలని బిపి షుగర్, ఇతరాత్ర సమస్యలతో బాధపడేవారికి తక్షణ వైద్య సహాయం అందించాలన్నారు. రిటైర్డ్ కార్మికుల సలహాలు, సూచనలు తీసుకొని పార్టీని ప్రజాసంఘాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సభలో రిటైర్డ్ కార్మిక నాయకులు పడాల కనకరాజు, ఎర్రగొల్ల చేరాలు, దాసరి రామస్వామి, చెప్యాల మహేందర్ రావు, బూడిద మల్లేష్, సిరిసిల్ల మల్లేష్, వి.లక్ష్మీపతి, కల్వల జగన్, దావీదు, మాతంగి బానయ్య, నూకల మొండి. తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పడాల కనకరాజు, సహాయ కార్యదర్శిగా ఎర్రగొల్ల చేరాలు, కోశాధికారిగా రాపోలు రాజేశ్వర్‌రావులను ఎన్నుకున్నారు.

## జాప్యం లేకుండా ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులు : అదనపు కలెక్టర్



**ప్రజాపక్ష/హుస్నాబాద్ :.** హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులను బుధవారం మున్సిపల్ స్పెషల్ అధికారి, సిద్ధిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పరిశీలించారు. కట్టకు జరుగుతున్న రౌతు కట్టడిని మెట్లను, కట్ట ఇరువైపుల చేపట్టిన పనుల గురించి కంట్రాక్టర్‌ను అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, జాప్యం లేకుండా తొందరగా చేయాలని సంబంధిత కంట్రాక్టర్‌ను అదేశించారు. అమె వెంట మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున్, డిఇ మహెశ్, ఎఇ పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల పట్టణ 8వ వార్డు గణేష్ నగర్ సంక్షేమ మండలి సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్‌ను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తాగునీటి పైప్‌లైన్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఎల్ జి రమేష్, గౌరవ అధ్యక్షుడు సంతోష్‌రావు, అధ్యక్షులు ఎల్లాల రాజేశ్వర్‌రెడ్డి, కమటాల రవీంధర్, శేఖర్, సుభాష్, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు

# సమర్థవంతంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** అంగన్‌వాడీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమశాఖ పని తీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఆదేశించారు. టాయిలెట్‌లేని అంగన్‌వాడీ కేంద్రాల జాబితా సిద్ధం చేసి వెంటనే నిర్మించాలని, అవసరమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల సరిగ్గా పనిచేస్తే కేంద్రాలకు ఎక్కువమంది పిల్లలు వస్తారని, పిల్లల హాజరు వివరాలను సూపర్‌వైజర్లు నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. స్థానిక పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒలతో సమన్వయం చేసుకుంటూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో అవసరమైన పౌష్టికాహారం నిల్వలు, తాగు నీటి సరఫరా చెక్ చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు ప్రతి రోజూ రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు రాబోయే 6 నెలల కాలంలో అక్షరాలు, సంఖ్యల గుర్తింపు, రాయడం వంటి అంశాలలో పురోగతి రావాలని, పూర్వ ప్రాథమిక విద్య గురించి ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పిల్లల ఎదుగుదల నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు సంబంధిత పౌష్టికాహారం తప్పనిసరిగా అందేలా చూడాలన్నారు. పిల్లల తల్లిదండ్రులతో ప్రతి నెలా పేరెంట్ టీచర్స్ మీటింగ్ పెట్టి బరువు, ఎత్తు ఎంత ఉంది ,ఎటువంటి పౌష్టిక ఆహారం అందిస్తున్నాం, విద్య ఎలా అందుతుంది వాటి అంశాలను వివరించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### మహిళాసమాఖ్యకు ఆస్పత్రి డైట్ కాంట్రాక్ట్

చైతన్య జ్యోతి జిల్లా మహిళా సమాఖ్యకు ఆసుపత్రిలో డైట్ కాంట్రాక్ట్ కేటాయించామని కలెక్టర్ కోయశ్రీ హర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో చైతన్య జ్యోతి జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు డైట్ కాంట్రాక్ట్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ , పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన ఆహారం సరఫరా చేసేందుకు చైతన్య జ్యోతి జిల్లా మహిళా సమాఖ్య కు డైట్ కాంట్రాక్టు ఇవ్వడం జరిగిందని, ఈ కాంట్రాక్ట్ 2 సంవత్సరాల పాటు ఉంటుందని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం రోగులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే భూభారతి చట్టం

రెవెన్యూ సదస్సులో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** భూ సమస్యల పరిష్కారానికే భూభారతి చట్టం పనిచేస్తుందని, భూ సమస్యలున్న రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ తెలిపారు. బుధవారం చిగురుమామిడి మండలం రామంచ గ్రామంలో తహసీల్దార్ ముద్దసాని రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్‌లు తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా రైతులతో మాట్లాడారు. రామంచ గ్రామంలో 154 ధరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. మార్టిన్ కాలనీలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అడిషనల్ కలెక్టర్‌కు స్థానికులు విన్నవించారు. ఆర్‌డిఒ మహేశ్వర్, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆర్ఐలు అరుణ్, తార, రైతులు, వంటకాల సంపత్ రెడ్డి, కొండం మహిపాల్ రెడ్డి, దొబ్బల బాబు, దొబ్బల బిక్షపతి, కాత తిరుపతి పాల్గొన్నారు.

# గడువులోగా హైలెవెల్ వంతెన నిర్మాణం పూర్తి

ఎమ్మెల్యే విజయరమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** నిర్దేశిత గడువులోగా హై లెవెల్ వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం ఓదెల మండలం లోని రూపు నారాయణపేట గ్రామం వద్ద మానేరు వాగుపై రూ.80కోట్ల వ్యయంతో చేపట్టిన హై లెవెల్ వంతెన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ ఓదెల మండల ప్రజల చిరకాల ఆకాంక్ష రూపు నారాయణపేట వద్ద మానేరు నది పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రజా ప్రభుత్వం ప్రారంభించనుందన్నారు. 40 గ్రామాల ప్రజలకు ఈ వంతెన ఉపయోగపడుతుందని, వరంగల్ వెళ్లేందుకు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. ఓదెల ప్రాంతం చివరి ఆయకట్టు ప్రాంతమని, సాగునీరు అందదన్నారు. ఇసుక రీచ్‌లో నుంచి ఎట్టి పరిస్థితుల్లో ఇసుక తీసెందుకు అనుమతించవద్దన్నారు. రూపు నారాయణపేట రీచ్ తప్ప గతంలో మిగిలిన అన్ని రీచ్ లలో ఇసుక తీశారని, ఇసుక తీసిన చోట పొలాలు ఎండిపోయాయన్నారు. ప్రజలలో చైతన్యం రావాలని, మన ప్రాంతం సాగునీరు తాగు నీటికి ఇబ్బందే లేకుండా ఉండాలంటే ఇసుక తీసుకుని వెళ్ళవద్దన్నారు. సన్నవడ్లకు వానాకాలంలో రూ.1100 కోట్ల బోనస్ వేస్తే ఒక పెద్దపల్లి నియోజకవర్గానికి మాత్రమే రూ.60 కోట్ల బోనస్ ప్రభుత్వం చెల్లించిందని, యాసంగిలో మరో రూ.31 కోట్ల రూపాయలు త్వరలో జమ అవుతాయన్నారు. గతంలో దసరా వరకు వడ్ల పైసలు జమ కాకపోయేవని, నేడు 48గంటల్లో రైతులకు ఖాతాలో పంట డబ్బులు జమ అవుతున్నాయన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్షతో మాట్లాడుతూ మానేరు వాగుపై హై లెవెల్ వంతెన ప్రాముఖ్యత దృష్ట్యా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. పనులను సంబంధిత అధికారులు రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కోరారు. రోడ్డు విస్తరణ, అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులకు అవసరమైన భూమి త్వరగా సేకరించేందుకు స్థానిక రైతులు సహకరించాలని, ప్రజల సహకారం ఉంటే వేగవంతంగా పనులు పూర్తి చేయడానికి సాధ్యం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, ఆర్‌అండ్‌బి ఇఇ భావ్ సింగ్, తహసీల్దార్ ధీరజ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు

133.8 కిలోల గంజాయి దహనం

కరీంనగర్ సిపి గౌసం ఆలం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని సిపి గౌస్ ఆలం హెచ్చరించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో స్వాధీనం చేసుకున్న 133.8 కిలోల గంజాయిని బుధవారం ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. మానకొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో ఉన్న వెంకటరమణ ఇన్సిలేటర్‌లో పోలీస్ కమిషనర్ సమక్షంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ గంజాయిని దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో నార్కోటిక్ సెల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. నార్కోటిక్ జాగిలం 'లియో'తో జిల్లా కేంద్రంలో తనిఖీలను ముమ్మరం చేసినట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్ పరిధిలో నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధించడానికి కరీంనగర్ ఒకటవ ఠాణా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్, పార్సిల్ కార్యాలయాలు, కిరాణా షాపులు, పాన్ షాపులు, హాస్టళ్లు, అనుమానిత ఇళ్లలో ఎస్సై రాజన్న ఆద్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలం, డాగ్ హ్యాండ్లర్ కానిస్టేబుల్ ఎ.శంకర్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎవరైనా వ్యక్తుల వద్ద ప్రభుత్వం నిషేధించిన గంజాయి, ఇతర మత్తు పదార్థాలున్నా వాటిని విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏసిపిలు వేణుగోపాల్, విజయ్ కుమార్, ఇన్స్‌పెక్టర్లు పుల్లయ్య, సంజీవ్, రజినీకాంత్, ఇన్సిరటేర్ ప్లాంటుకు చెందిన తిరుపతి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అప్పులబాధతో కౌలు రైతు ఆత్మహత్య



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ :** అప్పుల బాధతో ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని కొండపూర్ గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొండూర్ గ్రామానికి చెందిన తిగుళ్ల రాజు(35) అనే యువ రైతు తనకున్న కొద్దిపాటి పొలంతో పాటు దౌలాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద 3 ఎకరాల పొలం కౌలుకు తీసుకోని పత్తి, వరి సాగు చేస్తున్నాడు. సాగు, కుటుంబ అవసరాల కోసం వడ్డి వ్యాపారుల వద్ద రూ. 2 లక్షలు అప్పు తీసుకున్నాడు. గత రెండు సంవత్సరాలుగా కాలం కలిసి రాక, సాగు చేసిన పంటలు పండక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో రోజు కూలీగా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చేసిన అప్పులకు వడ్డి అధికం కావడం, అప్పు ఇచ్చిన వారి నుండి వేధింపులు అధికం కావడంతో మానసిక వేదనకు గురైన రాజు బుధవారం తెల్లవారు జామున పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రాధా, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ చంద్రమోహన్ వెల్లడించారు.

## కస్తూర్భాగాంధీ పాఠశాలల్లో మెరుగైన వసతులు

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కస్తూర్భా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. పాఠశాల విషయాలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠ్యాంశం బోధన(ఎఫ్‌టి) ఇంటర్ యాక్ట్ ప్లాంట్ ప్యానల్ ద్వారా విద్యార్థులకు బోధించేటప్పుడు తరగతి గదిలో విద్యార్థులతో కూర్చొని కలెక్టర్ విద్యా బోధనను గమనించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కస్తూర్భా గాంధీ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వంట గది సామాగ్రి, పప్పు దినుసులు, వంట నూనె సంబంధించినవి నాణ్యత ప్రమాణాలతో ఉండాలన్నారు. పిల్లలకు నాణ్యత ప్రమాణాలతో మంచి భోజనం అందించాలని వంట సిబ్బందిని కోరారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిలువ ఉండకుండా చూడాలని, ఎప్పుడికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులకు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జివాకర్‌రెడ్డి, డిఇఒ రామ్, ఎంఆర్ఒ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సెటిల్‌మెంట్లకు అడ్డాగా ఠాణాలు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపణ

కుంటయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

కుటుంబసభ్యులను పరామర్శ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** పార్టీలో నిబద్ధత కల నాయకుడు, నిఖార్సైన గులాబీ సైనికుడు కుంటయ్య మరణించడం బాధాకరమని, ఆయన ఇద్దరు పిల్లల చదువులు, వారి పెళ్లిళ్లు , ఇతర సమస్యలు అన్నింటికీ తనదే బాధ్యత అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆయన కుటుంబానికి భరోసా కల్పించారు. బిఆర్ఎస్ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ నేత మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య కుటుంబాన్ని మంగళవారం సిరిసిల్లలో పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో సెటిల్ మెంట్‌లకు అడ్డాగా పోలీస్ ఠాణాలు మారాయని విమర్శించారు. కుంటయ్య కుటుంబానికి పార్టీ తన భూమిని కాంగ్రెస్ నేత కబ్జా చేశాడని ఫిర్యాదు చేస్తే ఉల్టా తమ పార్టీ నేత కర్కబోయిన కుంటయ్యపైనే కేసు బనాయించి వేధించడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. సివిల్ మ్యాటర్‌లో తలదూర్చి పోలీసులు సెటిల్మెంట్లు, అరాచకాలు చేయడం సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఏం చేస్తే అది చేయడాన్నే డ్యూటీగా భావించి పోలీసులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కుంటయ్య చావుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ నేతలు ఎవరూ కూడా ఇంత చిల్లర, లేకి పనులు చేయలేదన్నారు. మొన్న ఏసీబీ విచారణ జరుగుతున్నప్పుడు తన కోసం హైదరాబాద్ దాకా వచ్చి ధైర్యం చెప్పిన కుంటయ్య అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి మనసు కకావికలమైందన్నారు. రాజకీయ నాయకులు అంటే అందరూ ఏదోదో ఊహించుకుంటారన్న కేటీఆర్, బయటికి గంభీరంగా కనిపడ్డా లోపల దుఃఖాన్ని దాచుకొని ఓ వైపు ప్రజల కోసం పనిచేస్తూ మరోవైపు కుటుంబాన్ని కాపాడుకునే క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురవుతారన్నారు. తన భూమిని కాంగ్రెస్ నేత కబ్జా చేయడం, పోలీసులు కూడా ఆయనకే వత్తాసు పలకడంతో కుంటయ్య ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పార్టీ నేతలను పంపి ఆయనను కాపాడుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. పెద్దకర్మ జరిగేదాకా పార్టీ జిల్లా నాయకత్వమే అన్ని పనులు దగ్గరుండి చూసుకుంటుందన్నారు.







# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి కేంద్రానికి వచ్చిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, అంగన్‌వాడి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రానికి వచ్చేగర్భిణీలకు చిన్నారులకు మెనూ ప్ర కారం పౌష్టికాహారం అందించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమల, జిల్లా విద్యాశాఖ అధి కారి రాజు, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపిడిఒ ముజా హిద్, విద్యాశాఖ అదికారి నాగేశ్వర్‌రావు, సౌభాగ్య, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మంచిర్యాల జిల్లా మహాసభలకు సన్నాహాలు



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మంచిర్యాల జిల్లా కమిటీ తన నాలుగో జిల్లా మహాసభలను జూన్ 21, 22 తేదీలలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేసేందుకు మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో గల బాసెట్టి గంగారాం విజ్ఞాన్ భవన్ సిపిఐ కార్యాలయంలో బుధవారం వాల్‌పోస్ట ర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, పట్టణ కార్యదర్శి ఆడపు రాజ మౌళి మాట్లాడుతూ రాబోయే మహాసభలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.



**దండేపల్లి :** ఈ నెల 21, 22 తేదీలలో మంచిర్యాలలోని ఎం. కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు పిలుపునిచ్చారు. బుధవారం మహాసభల పోస్టర్‌ను దండేపల్లి మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ మహాసభలకు కొత్తగూడెం ఎంఎల్‌ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవు తారని తెలిపారు. అలాగే, మాజీ ఎంఎల్‌ఎ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వాసిరెడ్డి సీతారామయ్య కూడా పాల్గొంటారని చెప్పారు.జూన్ 21న ఐబి చౌరస్తా నుండి ప్రదర్శన నిర్వహిస్తామని, 22న ప్రతినిధుల సభ జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఈ మహాసభలలో చర్చ జరగనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ దండేపల్లి మండల కార్యదర్శి పెరిక రాజేశం, తది తరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ వెంకటస్వామికి ఎమ్మెల్సీ దండే విఠల్ శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** రాష్ట్ర గనుల, కార్మిక శాఖ మంత్రిగా బాధ్య తలు చేపట్టిన వివేక్ వెంకటస్వామిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎ ల్‌సి దండే విఠల్ బుధవారం సెక్రటేరియట్‌లో ఆయనకు కేటాయించిన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా మంత్రిగా, జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వివేక్ వెంకటస్వామికి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దండే విఠ ల్‌తో పాటు ఆసిఫాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎంఎల్‌సి పురాణం సతీష్ కూడా ఉన్నారు.

## మంత్రి జూపల్లిని కలిసిన ఎమ్మెల్సీ దండే విఠల్



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నూతనంగా ఇన్‌చార్జ్‌గా నియమితులైన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్ బుధ వారం రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా దండే విఠల్‌తో పాటు ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎంఎల్‌సి పురాణం సతీష్, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, బోథ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజానంద్ తదితరులు ఉన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అందరూ సమిష్టిగా కలిసి కృషి చేయాలని సూచించారు.

## ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

ఎమెల్యే బొజ్జు పటేల్ పూజలు..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణం అంబేద్కర్ నగర్ కాలనీలో ఉన్నటువంటి శ్రీశ్రీ ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ ఆలయ వారికోత్సవానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై.ఈ సందర్భంగా ముత్యాల పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకుముందు ఉత్తర వాని గోదావరి తీరంలో గంగానీళ్ళతో అభిషేకం తదానంతరం సాయంత్రం నిర్వహించే బోనాలతో అమ్మవారిని వార్షికోత్సవం గురు వారం రోజున బలుపుజ నిర్వహించి పూజా కార్యక్రమం మగ్గుతూ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిమ్మల రమేష్,రాజురా సత్యం,జొన్నర శంకర్,ఆలయ కమిటీ సభ్యులు మేసు చిన్న రాజన్న,మగిడ్డి నారా యణ,దండు రాజేశ్వర్,గౌరె గంగాధర్,మ్యాదరి రాజేశ్వర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల విక్రయదారులపై కఠినచర్యలు


జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మాదకద్రవ్యాలను విక్రయి ం చినలేదా వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నివారణపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పి కాంతిలాల్ సుభాష్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, కాగ జ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మాదకద్ర వ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగం జరగ కుండా అధికారులు సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా, జిల్లాలో గంజాయి సాగు చేయకుండా అధికారులు పర్యవేక్షించా లని, ఎవరైనా గంజాయి సాగు చేసినట్లయితే వారిని గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల లబ్ధిని రద్దు చేయాలని



స్పష్టం చేశారు. పాఠశాలలు, వసతి గృహాలు, గురుకు లాలు, కళాశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల విని యోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని, విద్యాసంస్థల పరిసరాలలో ఉన్న కిరాణా దుకాణాలు, పాన్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. మహారాష్ట్ర నుండి జిల్లాకు వచ్చే వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేయాలని, ఆటో, లారీ డ్రైవర్లు, కూలీలకు అవ గాహన కల్పించాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి కాంతిలాల్ సుభాష్ పాటిల్ మాట్లాడుతూ, వచ్చే రెండు నెలలలో పోలీస్ కళాజాత బృందం ద్వారా జిల్లాలోని ప్రతి సోమ వారం, గురువారం మాదకద్రవ్యాల నిర్మూలనపై కార్యక్ర మాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను విక్రయించినా, వినియో గించినా వారిని గుర్తించి వారిపై పిడి యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో గంజాయి రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా నిర్వహిస్తామని, సరిహద్దు ప్రాంతాలలో విస్తృత తనిఖీలు చేపడతామని, అధికారుల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకు ంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచా యతీ అధికారి భిక్షపతి, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, జి ల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జి ల్లా రవాణా అధికారి రామ్ చందర్, జిల్లా మాధ్యమిక అధి కారి , వ్యవసాయ, విద్య, ఆబ్కారీ, జాతీయ రహదారులు, డ్రగ్స్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదర్‌ను కలసిన కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి:** నూతనంగా బాధ్యతలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుదవారం నాడు సంగారెడ్డి వైద్యా రోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా మంత్రి నివాసంలో మార్యదపూర్వకంగా కలి సారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను సంగారెడ్డి జిల్లాలో ముందుకు తీసుకెళ్లాలా ప్రణాళికలను రూపొం దించాలని మంత్రి జిల్లా కలెక్టర్‌కు సూచిం చారు. ఇందరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, రైతు నేస్తం, భూ భారతి చట్టం అమలు విద్య వైద్యం ,గ్రామీణాభివృద్ధి ,మహిళా సాదికారత ,శిశు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలని మంత్రి కలెక్టర్‌కు సూచించారు. సామాన్యులకు ప్రభుత్వ పథకాలు చేరువయ్యేలా కృషి చేయా లని మంత్రి సూచించారు.

## కనిపించని ఎమ్మెల్యే క్యాంపు సేవలు ?

మూసి ఉన్న గేట్లు.. దళారుల రాజకీయం

**ప్రజాపక్షం/చెన్నూరు :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయాలు ప్రస్తుతం పార్టీ కార్యకలాపాలు, ఎంఎల్‌ఎల పిఆర్‌ఓల వ్యక్తిగత అవసరాలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు చెన్నూరు నియోజకవర్గంలో వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంఎల్‌ఎ నియోజకవర్గంలో అందుబాటులో లేన ప్పటికీ, ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యాలయాలను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఇటీవల అక్రమాలకు తావులేకుండా ప్రజా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. అయితే, చెన్నూరు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయ బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి వ్యక్తిగత సహాయకుడు, క్యాంపు కార్యాలయాన్ని తన వ్యక్తిగత కార్యకలాపాలకే వినియోగిస్తున్నారని, ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ప్రభుత్వ లక్ష్యాన్ని, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆశయాలను నీరుగారుస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్యాంపు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అట్టి మంత్రి వ్యక్తిగత సహాయకుడి అవగాహన లోపం కారణంగా నిరంతరం క్యాంపు కార్యాలయ గేట్లు మూసి ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. తమ సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వడానికి వస్తున్న



నియోజకవర్గ ప్రజలు వైట్ కాలర్ దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. దీన్ని అదనుగా భావించి కొందరు దళారులు అమాయక ప్రజలను మభ్యపెట్టి సెటిల్మెంట్లు నిర్వహిస్తున్నారనే గుసగుసలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయాల ముఖ్య ఉద్దేశ్యాన్ని మరచిపోవడం సరికాదని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయ సేవలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు అనుభవజ్ఞులైన సిబ్బందిని ఏర్పాటు చేసి, సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చూడాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మెడికల్ కాలేజీ విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

మంచిర్యాల షీటీమ్ డెకాయ్ ఆపరేషన్‌తో కామాంధుడి అరెస్ట్



**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి:** మెడికల్ కాలేజీ విద్యార్థినుల పట్ల అస భ్యంగా ప్రవర్తిస్తున్న ఒక చికెన్ సెంటర్ ఉద్యోగిని మంచిర్యాలషీటీం చాకచ క్యంగా పట్టుకుంది. కాలేజీ రోడ్డులో ఉన్న ఒక చికెన్ సెంటర్‌లో పనిచేసే ఆ వ్యక్తి, మెడికల్ కాలేజీ విద్యార్థినులు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు తన ప్యాంట్ విప్పి ప్రైవేట్ పార్ట్స్ చూపుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని షీటీంకు రహస్య సమాచారం అందింది. విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల నుండి అందిన ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న షీటీం, పక్కా ప్రణాళికతో డెకాయ్ ఆపరే షన్ నిర్వహించి, నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేసింది.షీటీం ఎస్ఐ. వి.హైమ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ సతీష్, మహిళా కాని స్టేబుల్స్ జ్యోతి, శ్రీలత ఈ డెకాయ్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. అనుమానితుడి కదలికలను నిశితంగా పరిశీలించి, అతను అసభ్యంగా ప్రవర్తించడాన్ని గుర్తిం చిన తర్వాత, సరైన సమయం చూసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా, అతను తన నేరాన్ని అంగీకరించాడు. అతనిపై తక్షణమే కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరిచారు.మహిళలు, యువతులు, విద్యార్థి నుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా షిటీం నిరంతరం నిఘా పెడు తుందని పోలీసులు స్పష్టం చేశారు. ఏదైనా వేధింపులకు గురైనట్లయితే వెంటనేషీటీం లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి...

హెల్త్ ఆఫీసర్ హకీల్, ఎంపిడిఒ గంగాధర్

**ప్రజాపక్షం /ఆర్మూర్:** వర్షాకాలం ప్రారంభంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని గ్రామా లలో క్షేత్రస్తాయిలో పర్యటించి సీజనల్ వ్యాధు లపై ప్రజలను అవగాహన కల్పించాలని దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ అయేషా, హెల్త్ ఆఫీసర్ హకీల్, ఎంపిడిఒ గంగా ధర్ అన్నారు. బుదవారం ఆలూరు మండల పరి షత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యద ర్శులకు, ఆరోగ్య సిబ్బందికి సీజనల్ వ్యాధుల



గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకా లంలో వచ్చే సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమ త్తంగా ఉండాలని సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ప్రజలకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామా లలో ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచిం చారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు రాకుండా ఉండటానికి ఇంటి ఇంటికి ఆశాకార్య కర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది వ్యాధుల పట్ల, నీరు నిలువ ఉండకుండా కుండీల ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని గ్రా మ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రా మ పంచాయతీ సిబ్బందితో కలిసి దోమలను ని యంత్రించేందుకు విధిగా ఫాగింగ్ చేయించి గ్రా మాల్లోనిప్రతివాడలోమురికికాలువలవద్ద బ్లీచింగ్ చల్లడం, నీరు నిలువ ఉన్న ప్రదేశాలలో దోమలు వ్యాప్తి చెందకుండా మురికి కాలువలో స్ప్రేచే యించాలనిసూచించారు.ఆరోగ్యసిబ్బ ంది, పం చాయతీకార్యదర్శులు,తదితరులుపాల్గొన్నారు.

## ఆపత్కాల స్పందనకు ముందస్తు సన్నద్ధత

గడ్డెన్న వాగు వద్ద ఎస్‌పి జానకీ షర్మిల ఆధ్వర్యంలో 69 మందికి శిక్షణ..

**ప్రజాపక్షం/బైంసా:** గతంలో ఎన్నడు లేనివిధంగా జిల్లాలో డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిడిఆర్‌ఎఫ్) ని వాతావరణ సూచనల మేరకు రాబోవు వర్షాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ ఈ స్పెషల్ పోర్సుని ఏర్పాటు చేయడం జరిగింది.ఇందులో బాగంగా ఈ రోజు ఎస్‌పి ఆదేశాల మేరక బైంసా సబ్ డివిజన్ గడ్డెన్న వాగులో డిడిఆర్‌ఎఫ్ బృందంకి నిపుణల చేత రెస్క్యూ ఆపరేషన్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. రాబోయే వర్షాల దృష్ట్యా సంభవించే వరదలలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న భాదితులను రక్షించడానికి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డిఆ రఫ్ బృందంకి ఎస్‌పి ఆదేశాల మేరకు ఈ రోజు గడ్డెన్న వాగు లో రెస్క్యూ ఆపరేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు.జిల్లా ఎస్‌పిదేశాలతో డిడిఆర్ ఎఫ్ బృందంలోని సభ్యులు చెరువులో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించే విధా నాన్ని చూపించారు.డిడిఆర్‌ఎఫ్ బృందానికి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న ఆర్ఐ రమేష్ రెస్క్యూ ప్రక్రియ మొత్తాన్ని ఎస్‌పి వివరించారు.జిల్లాలోని ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణను పొందిన డిడిఆర్‌ఎఫ్ బృందం సిద్ధంగా ఉందని టీం తో పాటు జిల్లాలోని



అన్ని పోలీసు స్టేషన్‌లలో నుండి ముగ్గురిని ట్రైనింగ్ ఇవ్వటం జరిగింది.ఇట్టి ట్రైనింగ్ పొందినవారు విపత్కర పరిస్థితుల్లో అక్కడ ప్రజల సహకారం తో డిడిఆర్‌ఎఫ్ బృందం వచ్చేవరకు ప్రజలనికాపాడడం జరుగును అని జిల్లా ఎస్‌పి ఈ సందర్భంగా తెలియజేశారు.మొత్తం 69 మంది పోలీసు సిబ్బం దిని ట్రైనింగ్ కు తీసుకోవటం జరిగింది.రెస్క్యూ సమయంలో అవసర మయ్యే లైఫ్‌జాకెట్స్,లైఫ్ బాయ్ రింగ్స్,బోట్ పెడల్స్,రోప్స్ ఇతర సామాగ్రి మొత్తాన్ని ఈ బృందానికి సమకూర్చడం జరిగిందన్నారు.బైంసా ఎఎస్‌పి అవినాష కుమార్,ఇన్స్పెక్టర్లు ,డిడిఆర్‌ఎఫ్ ఇన్‌చార్జి ఆర్ఐ రమేష్,ఎస్ ఐలు,ఆర్‌ఎస్ఐలు,రెస్క్యూ టీమ్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## జంగల్ సఫారీకి అధునాతన వాహనాలు



**ప్రజాపక్షం / హాజీపూర్ :** హాజీపూర్ మండల పరిధిలోని ఎసిసి క్వారీలో ఉన్న జంగల్ సఫారీకి రెండు కొత్త, ఆకర్షణీయమైన సఫారీ వాహనాలను బుధవారం అధికారులు ప్రారంభించారు. పర్యాటకులకు మరింత సురక్షిత మైన, ఆహ్లాదకరమైన అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ అత్యాధు నిక వాహనాలను అందుబాటులోకి తెచ్చినట్లు అటవీశాఖ అధికారులు తెలి పారు. నూతన వాహనాలు ఎలాంటి శబ్దం చేయకుండా, అడవిలోని వన్య ప్రాణులను దగ్గర నుండి గమనించడానికి పర్యాటకులకు అద్భుతమైన అవ కాశాన్ని కల్పిస్తుందని, పర్యాటకులు ఇకపై మరింత సౌకర్యవంతంగా, జా గ్రత్తగా ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇ కనుండి సఫారీ మార్గంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడానికి, ల ంచ్ ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా పర్యాటకులకు కల్పించారు. అ యితే, ఈ వేడుకలన్నీ పూర్తిగా ప్లాస్టిక్ రహిత విధానంతో నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డిఒ సర్వేశ్వర్, ఎఫ్ఆర్ఒఅత్తె సుభాష్, ఎఫ్ఎ స్ఒ అతహుల్ల, ఎఫ్‌బిఓలు రాజేందర్, స్వప్న తదితరులు పాల్గొన్నా రు.

## వనమహోత్సవం లక్ష్యసాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి: కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** వనమహోత్సవం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదా యంలో వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం అదనపు కలె క్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డిఎఫ్ఒవికాస్ మహతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా 202526 వార్షిక సంవత్సరానికి ఆయా శాఖల వారిగా వనమహో త్సవం కింద నాటాల్సిన మొక్కలకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించారు. ఆయా శాఖల వారిగా కేటా యించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేందుకు చొరవ చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 545 గ్రామపంచాయతీలు, నాలుగు



మున్సిపల్ పట్టణాలలో మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. వనమహోత్సవంను ప్రాధాన్యత అంశంగా భావిస్తూ నిర్ణీత గడువులోపు లక్ష్యం పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లతో సన్నద్ధమై ఉండా లన్నారు. మండల ప్రత్యేకాధికారులతో పాటు సూపర్‌వై జరి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా నర్సరీలను, వైకుంఠధామాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించాలన్నారు. నాటిన మొక్క ల స్థితిగతులను తప్పనిసరిగా పరిశీలన చేయాలని వన మహోత్సవం అమలు తీరును పకడ్బంధీగా పర్యవేక్షిం చాలన్నారు. నాటినమొక్కలు ఏ స్థితిలో ఉన్నాయన్నది తెలియజేస్తూ వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అటవీశాఖ అధికారులు ప్రతి గ్రామపంచాయతీని విధిగా సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించాల న్నారు. గత సంవత్సరం మొక్కలు నాటిన ప్రదేశాలతో పాటు, ప్రస్తుత సంవత్సరంలో మొక్కలు నాటనున్న ప్రాంతాలలో తప్పనిసరిగా వివరాలతొకూడిన బోర్డు లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పచ్చద నాన్ని పెంపొందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ ఎంతో ప్రతి ష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా పకడ్బంధీ చర్యలు చేపట్టాలని అప్పుడే వన మహోత్సవం లక్ష్యం సిద్ధిస్తుంద న్నారు. కేవలం గుంతలు తవ్వి మొక్కలు నాటి వాటికి నీటిని అందించడంతోనే సరి పెట్టుకోకుండా సాసరింగ్, ఫెన్సింగ్ మొక్కలకు సపోర్ట్ కర్రలను అమర్చడం వంటి వాటిపై కూడా దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కూడా నర్సరీ నిర్వహణ చేపట్టాలని కమీషనర్ దిలీప్‌కుమార్‌ను ఆదేశించారు. వనమహోత్సవం అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా అంకిత భావం, సమన్వయంతో పని చేస్తూ నిర్ణీత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు హితవుపలికారు.సమీక్షాసమావేశంలో డిఆర్‌డిఒ సాయ గౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నా రు.

# రీల్



## ట్రైన్ సెట్‌లో 'పెద్ది'

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పాన్‌ఇండియా సినిమా 'పెద్ది'. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే చిత్రం యూనిట్, విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో కీలక సన్నివేశాలతో పాటు ఓ భారీ యాక్షన్ బ్లాక్‌ను పూర్తి చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన మ్యాసివ్ సెట్‌లో యాక్షన్ సన్నివేశం చిత్రీకరణ జరుగుతోంది. ఇండియన్ యాక్షన్ సినిమాల ప్రమాణాలను పెంచేలా ఉన్న హై ఆక్టేన్, హై బడ్జెట్‌తో రూపొందిన స్పెన్స్ ట్రైన్ ఎపిసోడ్ ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా అద్భుతంగా ట్రైన్ సెట్‌ని డిజైన్ చేశారు. ఈ ట్రైన్ సెట్ కోసం రూపొందించిన సెట్స్ కన్నులకు పండుగగా ఉండబోతున్నాయి. ఈ ఎపిసోడ్‌లో రామ్ చరణ్ తన కెరీర్‌లోనే అత్యంత రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ నేటి వరకు కొనసాగనుంది. పుష్ప 2కు పని చేసిన ఫైట్ మాస్టర్ నబా కాంత్ మాస్టర్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌కు కొరియోగ్రఫీ వహిస్తున్నారు. వైల్డ్‌బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో మేజర్ హైలైట్‌గా వుండబోతోంది. చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న నవీన్ నూలి ఎడిటర్. వినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేశారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 'రాజా సాబ్' కోసం భారీ హారర్ సెట్



రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీ 'రాజా సాబ్'. ఈ సినిమా డిసెంబర్ 5న హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం.. ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ రెడీ అవుతోంది. 'రాజా సాబ్' సినిమా కోసం వేసిన భారీ హవేలీ సెట్ ప్రధాన ఆకర్షణ కాబోతోంది. 41,256 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ సెట్ వేశారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ రాజీవన్ నంబియార్ ఈ రికార్డ్ స్థాయి హవేలీ సెట్‌ను రూపొందించారు. ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో హారర్ మూవీకి ఇంత భారీ సెట్ వేయడం ఇదే ప్రథమం. 'రాజా సాబ్' హవేలీ సెట్ గురించి ఆర్ట్ డైరెక్టర్ రాజీవన్ నంబియార్ మాట్లాడుతూ హవేలీలోని ప్రతి అడుగు ఒక ఎమోషన్ ను వ్యక్తీకరిస్తుంది. చూసేందుకు మాత్రమే హాంటెడ్ హౌస్‌లా ఉండటం కాదు. హాంటెడ్ హౌస్‌లో మనమంతా ఉన్న ఫీల్ కలిగిస్తుంది. ఈ హవేలీ చూస్తుంటే మీకు కథలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను సెట్ వేశామని చెప్పారు. ఈ సెట్ లోనే సినిమాకు సంబంధించిన కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించారని తెలిపారు. ప్రభాస్ ఇప్పటి దాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో నటిస్తుండటంతో 'రాజా సాబ్' సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడుతున్నాయని నిర్మాత టిజి విశ్వప్రసాద్ అన్నారు.

## చిరుతో నయన స్టెప్పులు





మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మెగా 157 చిత్రంలో హీరోయిన్‌గా నయన తార ఎంట్రి ఇచ్చారు. ప్రస్తుతం ముస్సోరిలో షూటింగ్ జరుగుతోంది. చిరంజీవి, నయన తారలపై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. సన్నివేశాలతో పాటు చిరంజీవి, నయన తారలపై ఒక పాటను కూడా చిత్రీకరిస్తున్నారు. అనిల్ రావిపూడి తనదైన శైలిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. చిరంజీవి కెరీర్‌లో బ్లాక్ బస్టర్ అయిన ఘరానా మొగుడులో ఉన్నట్లు వంటి షేడ్స్ ఈ సినిమాలో ఉంటాయి. హిలేరియస్ ఎంటర్టైన్మెంట్‌తో పాటు యాక్షన్ నేపథ్యంలో సాగే ఫ్యామిలీ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటీ, సుస్మిత కొణిదల నిర్మిస్తున్న ఈ సినిమాకు అర్చన సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు. ధమాకా, సంక్రాంతికి వస్తున్నాం వంటి సూపర్ డూపర్ హిట్ సినిమాలకు సంగీతం అందించిన భీమ్స్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. చిరంజీవి మాస్ అప్పీల్‌కు తగినట్టుగా మాస్‌తో పాటు క్లాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా పాటలు కంపోజ్ చేస్తున్నారు. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసి వచ్చే యేడాది సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## తొలిసారిగా మా బ్యానర్‌లో అన్నా చెల్లెళ్ళ కథ : దిల్ రాజు

శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత తమ్ముడు చిత్రాన్ని మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఇప్పటిదాకా మా బ్యానర్‌లో తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో బొమ్మరిల్లు, అన్నదమ్ముల కథతో సీతమ్మ వాకిట్లో.. వంటి చిత్రాలు రూపొందాయి. ఫస్ట్ టైమ్ బ్రదర్, సిస్టర్ సెంటిమెంట్‌తో తమ్ముడు చిత్రాన్ని రూపొందిస్తున్నాం అని నిర్మాత దిల్ రాజు తెలిపారు. ఈ సినిమా కోసం 80 రోజుల వరకు అడవిలో షూటింగ్ చేశారు. ఆ సీన్స్ అన్నీ స్క్రీన్ మీద కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తాయి. సినిమాలో ఏదో వావ్ ఎలిమెంట్ ఉంటే తప్ప మీరు థియేటర్స్‌కు రారు అని తెలుసు. అందుకే ఈ సినిమాను ఎన్నో వావ్ మూవ్ మెంట్స్‌తో రూపొందించాం. నేను మాట ఇస్తున్నా తమ్ముడు సినిమా మీ అందరికీ నచ్చుతుంది. మీకు బెస్ట్ ఔట్ పుట్ ఇచ్చేందుకు ఇప్పుడు కూడా దర్శకుడు శ్రీరామ్ వేణు వర్క్ చేస్తున్నాడు అందుకే ఈ ఈవెంట్‌కు రాలేదు. సెకండాఫ్‌లో 45 నుంచి 50 మినిట్స్ మరో కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకులు వెళ్తారు. అలా మా డైరెక్టర్ డిజైన్ చేశాడు. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత ఫ్యామిలీస్, యూత్, మాస్, కిడ్స్ అందరూ కలిసి ఎంజాయ్ చేసేలా తమ్ముడు మూవీ ఉంటుంది. థియేటర్స్ నుంచి బయటకు వచ్చేప్పుడు ఒక మంచి సినిమా చూశామనే ఫీల్ కలుగుతుంది. నితిన్ మా సంస్థలో దిల్, శ్రీనివాస కళ్యాణం తర్వాత చేస్తున్న మూడో చిత్రమిది. నితిన్ హార్డ్ వర్క్ ఈ మూవీలో మరో సారి చూస్తారు. తమ్ముడు ట్రైలర్ వ్యూస్ జెన్యూన్‌గా ఉండాలని చెప్పాను. మా ట్రైలర్‌కు 40 లక్షల జెన్యూన్ వ్యూస్ వచ్చాయి. ఈ మెలోడీ సాంగ్ సినిమాలో మంచి మూవ్‌మెంట్‌లో వస్తుంది. ఇది కాకుండా మరో మూడు పాటలు కూడా మీరంతా ఎంజాయ్ చేస్తారు. జూలై 4న ఆడియెన్స్ నుంచి మా మూవీకి వావ్ రియాక్షన్ వస్తుందని ఆశిస్తున్నాం. తమ్ముడు మా బ్యానర్‌కు వ్యాల్యూ పెంచే మరో సినిమా అవుతుంది. ఈ సినిమాను జూలై 4న చేస్తున్నాం అని ఆయన అన్నారు.

## 'తెలుసుకదా' చివరి షెడ్యూల్



సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'తో అలరించబోతున్నారు. ఈ మూవీతో ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సిద్ధు జొన్నలగడ్డ సరసన రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు.ఈ మూవీ చివరి షూటింగ్ షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చివరి షెడ్యూల్ జరుగుతోంది. సిద్ధు జొన్నలగడ్డ, రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టిలపై కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దీనితో సినిమా మొత్తం షూటింగ్ పూర్తవుతుంది. మరోవైపు సినిమాకు సంబంధించిన డబ్బింగ్ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ నెలలో ఈ సినిమా మొదటి పాటను విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించనున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 17న విడుదల కావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## కుబేరకు 'యుఏ' సర్టిఫికెట్






ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రలో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన కుబేర సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ సినిమాకు యుఏ సర్టిఫికెట్ లభించింది. లవ్, ఎమోషన్ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కించారు పేదవాడైనా, కుబేరుడైనా ఎవరి స్థాయిలో వారికి అప్పులు, సమస్యలు ఉంటాయి. వాటిని ఎలా అధిగమిస్తారు. ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటారు వంటి అంశాలను ఇతివృత్తంగా తీసుకుని నిర్మించిన సినిమా అని దర్శకుడు శేఖర్ కమ్ముల తెలిపారు. 181 నిమిషాల నిడివి గల ఈ సినిమాలో సమాజంలో కనిపించే పాత్రలు ఇందులో కనిపిస్తాయని అన్నారు. ప్రతి పాత్రకు ఒక గుర్తింపు ఉంటుందన్నారు. ఇంతవరకు తాను చేసిన సినిమాలకు ఇది వైవిధ్యమైన కథ అని అన్నారు. అయితే ఎమోషన్ డ్రామాగా తెరకెక్కించామన్నారు. సెన్సార్ పూర్తయిన ఈ సినిమాను 20వ తేదీన విడుదల చేయనున్నారు. ధనుష్ సరసన రష్మిక మందాన హీరోయిన్‌గా నటిస్తోంది. ఎస్‌విసిఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై ఏషియన్ సునిల్, పుష్కర్ రామ్మోహన్ రావు ఈ సినిమాను నిర్మించారు.

## కాంతారావు కుమారుడికి ఆర్థిక సహాయం



తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డు యండమూరి వీరేంద్రనాథ్‌కు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా సినిమా అవార్డులతో పాటు సినిమా ప్రముఖుల పేరిట ఆరు అవార్డులను ఇచ్చింది. రఘుపతి వెంకయ్య ఫిలిం అవార్డుతో రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌ను ప్రభుత్వం సత్కరించింది. అయితే ఈ అవార్డుతో ప్రభుత్వం ఇచ్చిన నగదు లోంచి లక్ష రూపాయలను కాంతారావు కుమారుడు రాజాకు ఆర్థిక సహాయం చేశారు. లక్ష రూపాయల చెక్‌ను రాజాకు అందజేశారు.

## డబ్బింగ్‌లో 3బిహెచ్‌కె



సిద్ధార్థ్ హీరోగా తమిళంలో నిర్మించిన 3బిహెచ్‌కే సినిమాను తెలుగులో విడుదల చేయనున్నారు. ఈ సినిమా కోసం సిద్ధార్థ్ తెలుగులో డబ్బింగ్ చెప్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి జూలై 4వ తేదీన సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. శరత్ కుమార్, దేవయాని కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. సిద్ధార్థ్ సరసన క్రితిక నటిస్తున్నారు. ఇప్పటి వరకు తాను చేసిన సినిమాలకు ఈ సినిమా భిన్నంగా ఉంటుందని సిద్దార్థ్ చెప్పారు. క్రైం నేపథ్యంలో సాగే కథాంశమని సిద్దార్థ్ తెలిపారు.

# ఎపిలో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఉరఫ్ రూపి విశాఖ జిల్లా దెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామానికి చెందినది. ఈమె కూడా ఆంధ్రా, ఒడిశా బోర్డర్ స్పెషల్ జోన్ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈమెపై రూ.20 లక్షల రివార్డు ఉంది. గతంలో చంద్రబాబుపై అలిపిరి వద్ద జరిగిన ఘటనలో కీలక భూమిక పోషించిన చలపతిరావు అరుణ భర్త. ఆయన శ్రీకాకుళం వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో గతంలో మరణించాడు. అరుణ తమ్ముడు కూడా పాల సముద్రం ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. అరుణ తల్లి కూడా మావోయిస్టు నేత కావడం గమనార్హం. అరుణ గతంలో విశాఖ జిల్లాకు చెందిన శాసనసభ్యుడు కె.సర్వేశ్వరరావు హత్యతో పాటు మరికొన్ని హింసాత్మక ఘటనల్లో పాలుపంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరోక మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది. మావోయిస్టు అగ్ర నేత గాజర్ల రవి అలియాస్ గణేశ్.. మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగారు.

**ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో శాంతి చర్చలకు**

గాజర్ల రవి అలియాస్ గణేశ్ స్వస్థలం భూపాలపల్లి జిల్లా వెలిశాల. ఆయన సోదరులు ఆజాద్, అశోక్ (ఐతు) కూడా మావోయిస్టు పార్టీలో పని చేశారు. సోదరుడు ఆజాద్ గతంలో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా.. మరో సోదరుడు అశోక్ కొన్నాళ్ల క్రితం పోలీసుల ఎదుట సరెండర్ అయ్యాడు. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004, అక్టోబర్‌లో జరిపిన శాంతి చర్చల్లో మావోయిస్టు పార్టీ తరపున ప్రతినిధిగా ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ పాల్గొన్నారు. ఆ శాంతి చర్చల ఎజెండాను తయారు చేయడంలో కామ్రేడ్ గాజర్ల రవి కీలక పాత్ర పోషించారు.

**ముగిసిన 35 ఏళ్ల మావోయిస్ట్ ఉద్యమ ప్రస్థానం**

గాజర్ల రవి గత 35 సంవత్సరాల క్రితం తన అన్న సారయ్య, అలియాస్ ఆజాద్‌తో కలిసి పార్టీలో చేరాడు. కాగా, అన్నల బాటలోనే తన చిన్న తమ్ముడు అశోక్ సైతం మావోయిస్టు పార్టీలో చేరారు. అన్న ఆజాద్ ఎన్‌కౌంటర్‌లో అమృతి చెందగా తమ్ముడు అశోక్ లొంగిపోయాడు. ప్రస్తుతం ప్రజాక్షేత్రంలో ఎన్నికల రాజకీయల్లో ప్రజల పక్షపాతిగా ముందుకు సాగుతున్నారు. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి మృతి చెందటంతో భూపాలపల్లి జిల్లా ఉమ్మడి చిట్యాల మండలం ప్రస్తుతం టెకుమట్ల మండలంలోని వెలిశాలలో విషాద ఛాయలు అమలుకున్నాయి. దీంతో గాజర్ల రవి నాలుగు దశాబ్దాల మావోయిస్ట్ ఉద్యమ ప్రస్థానం ముగిసిందని పలువురు చర్చించుకుంటున్నారు. మావోయిస్టు ఉద్యమానికి బలమైన నాయకత్వాన్ని అందించిన గాజర్ల కుటుంబమని ప్రజల వ్యాఖ్యానిస్తున్నారు.

# లొంగిపోయే మనస్తత్వం కాదు

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే సంపూర్ణయుద్ధానికి తెరలేస్తుందని హెచ్చరించారు. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బాఘాయీ ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ ఆయుధాలకు అందుబాటులో ఉన్న పొరుగుదేశాలలో వేలాదిమంది అమెరికా సైన్యం స్థావరాల్లో సిద్ధంగా ఉందని చెప్పారు.

**ఇజ్రాయెల్ దాడులు ఆపేస్తే దౌత్య చర్యలు : ఇరాన్**

ఇజ్రాయెల్ చేస్తున్న మెరుపుదాడులు, దురాక్రమణ చర్యలు మానవాళిచేస్తున్న యుద్ధమేనని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ దౌత్యవేత్త అలీ బహ్రైనీ జెనీవాలో విమర్శించారు. ఇజ్రాయెల్—అమెరికా సైన్యాలు చేసే ఎలాటి దురాక్రమణ చర్యలకైనా బలమైన సమాధానం చెబుతామన్నారు. ఇజ్రాయెల్ గనుక దాడులు ఆపేస్తే తమదేశం దౌత్య చర్యలకు సిద్ధపడగలదని చెప్పారు. ఇరాన్ అణుకేంద్రాల గురించి ఇజ్రాయెల్ చేస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. తమ అణుకేంద్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదనీ, ఎందుకంటే వాటి రక్షణకు కావాల్సిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని చెప్పారు. అణ్వాయుధాన్ని తయారుచేయాలనే ఉద్దేశం ఇరాన్‌కు లేదని ఆయన స్పష్టం చేశారు. ఐతే శాంతియుత ప్రయోజనాలకోసం ఎంతకాలం అవసరమైతే అంతకాలం కూడా యురేనియంను శుద్ధిచేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్దేశపూర్వకంగా ఇరాన్ అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి ఛార్టర్ నిబంధనలకు పూర్తి విరుద్ధమన్నారు. ప్రజలను ప్రమాదంలో పడేస్తున్న ఈ దాడులు అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన చర్యేనన్నారు. పొరుగుదేశాకు కూడా ఈ దాడులు నష్టం చేస్తాయన్నారు. ఈవిషయంలో ఏ దేశం పెదవి విప్పడంలేదని ఆయన విమర్శించారు. మానవహక్కుల పరిరక్షణలో తమను మించినవారు లేరని భుజాలు చరుచుకునే దేశాలు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడంలేదని ఆయన ప్రశ్నించారు. ప్రపంచంలో ముఖ్యంగా పశ్చిమ దేశాల్లో 'ఇస్లామాఫోబియా విపరీతంగా పెరుగుతోందని ఆయన గతం నుండీ పలుప్రకటనలు చేశారు. జెనీవాలో గడచిన మార్చి 25వ తేదీన జరిగిన ఇస్లామాఫోబియా వ్యతిరేక దినం సందర్భంగా కూడా ఆయన ఒక ప్రకటన చేశారు. ముస్లిమేతర సమాజాలలో చాలా బలంగా ఇస్లాం వ్యాప్తి చెందుతుంటే సహించలేక పోతున్నారని ఆయన అన్నారు. ఈ వ్యతిరేకత ఇదేవిధంగా కొనసాగితే అది చివరకు ద్వేషంగా, దీర్ఘకాల శత్రుత్వంగా మారుతుందన్నారు.

# 28న పిజెఆర్ ఫ్లైఓవర్ ప్రారంభం



## మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ప్రజాపక్షం/హైదరాబాద్ : కొండాపూర్ నుండి గచ్చిబౌలి రహదారిని అనుసంధానం చేసేందుకు నిర్మించిన పిజెఆర్ (పి.జనార్ధన్ రెడ్డి) ఫ్లైఓవర్‌ను 28న సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రముఖ రాజకీయ నాయకుడు, ప్రజా సేవకుడు దివంగత పి.జనార్ధన్ రెడ్డి జ్ఞాపకార్థంగా, ముఖ్యమంత్రి ఫ్లైఓవర్‌కు పిజెఆర్ ఫ్లైఓవర్ అని పేరు పెట్టాలని సూచించారు. ప్రారంభోత్సవానికి ముందే పెయింటింగ్, సుందరీకరణతో సహా అన్ని పనులను పూర్తి చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ఆదేశించారు. ఈ కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గిస్తుందన్నారు. ప్రయాణికులకు వేగవంతమైన ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తుందన్నారు. హైదరాబాద్ పౌరులకు ప్రయోజనం చేకూర్చే నాణ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అందించడానికి జిహెచ్ఎంసి కట్టుబడి ఉందని మేయర్ తెలిపారు.

# సైనికచర్య ఆపేశాం

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ సంభాషణలో ప్రధానంగా చోటుచేసుకున్నాయని మిస్రి చెప్పారు. 'భారత్—పాకిస్థాన్‌కు సంబంధించిన ఈ మొత్తం పరిణామాలలో ఏ సందర్భంలోనూ భారత్—అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి ఏ స్థాయిలోనూ, ఎ చర్చల్లోనూ ప్రస్తావన రాలేదని, తమ రెండు దేశాల మధ్యా అమెరికా మధ్యవర్తిత్వం గురించిన ఎలాంటి ప్రతిపాదన కూడా రాలేదని ట్రంప్‌కు మోదీ ఫోన్ సంభాషణలో చాలా స్పష్టంగా తెలియజేశారని మిస్రి చెప్పారు. 'సైనిక చర్యలు ముగించాలన్న చర్చ నేరుగా భారత్—పాకిస్థాన్‌లమధ్య రెండు దేశాల సాయుధబలగాల ఉన్నతాధికారుల ద్వారా జరిగింది, పాకిస్థాన్ వైపునుండే ఈ ప్రతిపాదన వచ్చింది, ఆ దేశమే చొరవ తీసుకుని కాల్పుల విరమణకు ప్రతిపాదించింది, ఆ దేశం విజ్ఞప్తి మేరకు సంప్రదింపులు జరిగాయి' అని మోదీ చెప్పారన్నారు. వారిద్దరిమధ్య సంభాషణలో కీలక విషయాలను మిస్రి తన ప్రకటనలో తెలియజేశారు. పహల్గామ్‌లో దాడి తర్వాత భారతదేశం యావత్ ప్రపంచానికీ ఉగ్రవాదంపై చేపట్టే కార్యాచరణ ఏమిటో తెలియజేయాలని నిశ్చయించుకుందని ఆ మేరకు చర్యలు తీసుకుందని ట్రంప్‌కు చెప్పారన్నారు. పాకిస్థాన్‌లో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భూభాగంలో ఉన్న ఉగ్రవాదుల రక్షణ కేంద్రాలపై భారతసైన్యం లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిందని మోదీ ఆయనకు తెలియజేశారన్నారు. ఇకమీదట పాకిస్థాన్ వైపు నుండి ఎలాంటి దురాక్రమణ చర్యలు జరిగినాగానీ చాలా బలమైన, కఠినమైన ప్రతిస్పందన తమదేశం నుండి ఉంటుందని చెప్పారన్నారు. మే తొమ్మిదో తేదీన రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ నరేంద్రమోదీకి ఒక ఫోన్‌కాల్ చేశారు. భారత్‌పై పాకిస్థాన్ భారీదాడి చేసే అవకాశం ఉందని ఆయన చెప్పారని మిస్రి అన్నారు. అలాంటి దాడి ఏదైనా జరిగితే భారతదేశం ఇంకా చాలా బలంగా ఎదురుదాడి చేస్తుందని జె.డి.వాన్స్‌కు తెలియజేశారని అన్నారు. పాకిస్థాన్ దాడికి ప్రతిగా మే 9,10 తేదీలలో రాత్రిపూట భారతదేశం చాలా నిర్ణయాత్మకమైన దాడులు చేసిందని, పాకిస్థాన్ సైన్యానికి తీవ్రనష్టం కలిగించిందని ట్రంప్‌కు చెప్పారన్నారు. భారత్ చర్యలవల్ల పాకిస్థాన్ సైనికస్థావరాలు ఎందుకూ పనికిరాకుండాపోయాయన్నారు. కెనడా వెళ్ళే మార్గంలో అమెరికాలో ఆగే అవకాశం ఉందా? అని ట్రంప్ అడిగారని, కానీ ముందస్తు కార్యక్రమాల రీత్యా తాను అమెరికాలో ఆగడంలేదని మోదీ ఆయనకు తెలియజేశారని మిస్రి చెప్పారు. అదేవిధంగా ఇరాన్—ఇజ్రాయెల్ మధ్య యుద్ధ పరిణామాల గురించి కూడా వారిద్దరూ మాట్లాడుకున్నారని చెప్పారు. అదేవిధంగా రష్యా—ఉక్రేన్ యుద్ధంలో శాంతిసాధనకు రెండు దేశాల నాయకులూ అంగీకరించారని మిస్రి చెప్పారు. ఆ రెండు దేశాలూ చర్చలు చేసేందుకు వీలైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులిద్దరూ భావించారన్నారు. ఇండో—పసిఫిక్ రీజియన్‌కు సంబంధించి అభిప్రాయాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. రాబోయే క్వాడ్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత్‌లో పర్యటించాలని ట్రంప్‌ను మోదీ ఆహ్వానించారని మిస్రి చెప్పారు.

భారత్ చేసిన ఈ ప్రకటనపై వైట్‌హౌస్ నుండి ఎలాంటి ప్రతిస్పందనా రాలేదు. భారత్—పాకిస్థాన్ దేశాలమధ్య సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వాన్ని భారతదేశం ఎన్నటికీ, ఎప్పటికీ అంగీకరించబోదని ట్రంప్‌కు నరేంద్రమోదీ టెలిఫోన్ సంభాషణ సందర్భంగా నిర్ద్వంద్వంగా తెలియజేశారని విక్రమ్ మిస్రీ ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత నాలుగురోజులపాటు రెండు దేశాలమధ్యా సైనిక చర్యలు జరిగాయని, ఐతే తర్వాత పాకిస్థాన్ తనంతటతానుగా స్వయంగా చేసిన విజ్ఞప్తి మేరకు, ఆ దేశం చూపించిన చొరవ మేరకు రెండు దేశాల డిజిఎంఓలమధ్య సంభాషణల ప్రకారం కాల్పుల విరమణ అవగాహన కుదిరిందని ట్రంప్‌కు మోదీ తెలియజేశారని మిస్రీ చెప్పారు. ఉగ్రవాదాన్ని ఇకమీదట భారతదేశం ప్రచ్ఛన్నయుద్ధంగా పరిగణించబోదనీ, సరిహద్దులలోంచి ఎగదోసే ఉగ్రవాదాన్ని ఒకమీదట యుద్ధంగానే భారతదేశం పరిగణిస్తుందని, భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్‌ను ఇప్పటికీ ఇంకా కొనసాగిస్తోందని ట్రంప్‌కు ప్రధానమంత్రి తెలియజేశారని మిస్రీ ఆ ప్రకటనలో చెప్పారు. భారత్—పాకిస్థాన్ మధ్య మే ఏడో తేదీ నుండి పదో తేదీ వరకూ సైనిక చర్యలు కొనసాగాయి. మే 10వ తేదీ మధ్యాహ్నం 3.35 గంటలకు రెండు దేశాల డిజిఎంఓలమధ్యా ఫోన్ సంభాషణ జరిగింది. కానీ కాల్పుల విరమణకు భారత్—పాకిస్థాన్ దేశాలు అంగీకరించాయని డోనాల్డ్ ట్రంప్ అందరికంటే ముందుగా ప్రకటించారు.

ఈ ఏడాది ఏప్రిల్‌నెల 22వ తేదీన దక్షిణ కశ్మీర్ పహల్గామ్‌లో పాకిస్థానీ ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది భారత పర్యాటకులు మరణించిన తర్వాత మే ఏడవతేదీన తెల్లారకముందుగానే పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత భూభాగాలలో ఉన్న ఉగ్రవాదులకు చెందిన లక్ష్యాలపై భారతసైన్యం దాడులు చేసింది. 100మంది పైగా ఉగ్రవాదులు ఈ దాడుల్లో మరణించారు. తర్వాత రెండు దేశాల మధ్యా నాలుగురోజులపాటు సైనిక దాడులు జరిగాయి. ఈ రెండు దేశాలూ యుద్ధం విరమించడానికి తానే మధ్యవర్తిత్వం చేశాననీ, రెండు దేశాలూ యుద్ధం విరమించాయనీ డోనాల్డ్ ట్రంప్ మొట్టమొదట తన ట్రూత్ సోషల్ మీడియా వేదికపై ప్రకటించారు. ఆ తర్వాతే భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి పత్రికాగోష్ఠిలో సైనికచర్య విరమణకు ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు. కాల్పుల విరమణకు అంగీకరించకపోతే ఈ రెండు దేశాలతో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని బెదిరించి మధ్యవర్తిత్వంతో అంగీకారం కుదిర్చామని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ద్వారా ప్రచారం చేసుకున్నారు. ఆయన ప్రపంచవేదికలపై అనేకచోట్ల అనేకసార్లు ఈ విషయం ప్రస్తావించారు. దీంతో దేశంలో మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. భారత విదేశాంగ విధానాన్ని మోదీ అమెరికాకు తాకట్టుపెట్టారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ వ్యతిరేక పరిణామాల మధ్య ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణ గురించి మిస్త్రీ ప్రకటించారు. అదేవిధంగా జి—7 సదస్సుకు కెనడా వెళుతూ మార్గమధ్యలో అమెరికాలో ఆగాలని ట్రంప్ చేసిన విజ్ఞప్తిని కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తిరస్కరించారు.

## ట్రంప్ మళ్ళీ అదేపాట

మోదీతో టెలిఫోన్ సంభాషణ అనంతరం కూడా డోనాల్డ్ ట్రంప్ వైఖరి మారలేదు. ఆయన మళ్ళీ అదేపాట అందుకున్నారు. తన మధ్యవర్తిత్వం ద్వారానే భారత్—పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని బుధవారంనాడు మరోసారి ప్రకటించారు. 35 నిమిషాలసేపు ట్రంప్‌తో ఫోన్ సంభాషణలో ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండానే భారత్—పాకిస్థాన్‌లు కాల్పుల విరమణ అవగాహనకు వచ్చాయని మోదీ చెప్పారు. 'మోదీ ఒక అద్భుతమైన మనిషి' అని ట్రంప్ పునరుద్ఘాటించారు. పాత్రికేయులతో ట్రంప్ మాట్లాడుతూ, రెండు దేశాలమధ్యా వాణిజ్య ఒప్పందం జరుగుతుందన్నారు. 'నేను యుద్ధాన్ని ఆపాను, నేను పాకిస్థాన్‌ను ప్రేమిస్తాను, నా ఉద్దేశం ప్రకారం మోదీ ఒక అద్భుతమైన మనిషి, గత రాత్రి నేను ఆయనతో మాట్లాడాను, మోదీ ఆఫ్ ఇండియాతో మేం ఒక వాణిజ్య ఒప్పంద చేసుకోబోతున్నాం, కానీ భారత్—పాకిస్థాన్ మ ధ్య మే నెల రెండో వారంలో యుద్ధాన్ని నేనే ఆపాను' అని చెప్పా రు. పాకిస్థాన్ ఆర్మీ ఛీఫ్ మునీర్‌కు బుధవారం మధ్యాహ్న విందు ఇవ్వడానికి ముందు ఆయన మాట్లాడారు. మునీర్ గురించి మా ట్లాడుతూ, 'ఈ వ్యక్తి పాకిస్థాన్ వైపు నుండి యుద్ధాన్ని ఆపారు, ఆ యన చాలా ప్రభావవంతమైన మనిషి' అని చెప్పారు. 'భారత్‌వైపు నుండి మోదీ, ఇతరులు ప్రభావం చూపించారు. ఈ రెండు దేశా లూ అణుశక్తి సామర్థ్యాలుగల దేశాలు, నేను వారిని అడ్డుకున్నాను, నేను కథలు చెప్పడం లేదు, రాయడానికి నా దగ్గర కథ లేదు, ఈ రెండు ప్రధాన అణ్వస్త్ర దేశాలమధ్య యుద్ధాన్ని నేను ఆపాను, దీనికి సంబంధించి నేనేమీ కథ రాశానని అనుకోవడం లేదు, అందరికీ ఈ విషయం తెలుసు' అని ట్రంప్ అన్నారు.

**పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసిఫ్ మునీర్‌కు ట్రంప్ లంచ్**

పాకిస్థాన్ సైన్యం ప్రధానాధిపతి ఫీల్డ్ మార్షల్ ఆసిఫ్ మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విందు ఇచ్చారు! బుధవారం మధ్యాహ్నం మునీర్‌ను ట్రంప్ మధ్యాహ్న భోజనవిందుకు ఆహ్వానించారు. భారతకాలమాన ప్రకారం బుధవారం రాత్రి 10.30 గంటలకు ట్రంప్ ఆయనతో లంచ్ సమావేశం జరిపారు. వైట్‌హౌస్‌లోని క్యాబినెట్ రూమ్‌లో ఈ మధ్యాహ్న విందు ఏర్పాటు చేశారని వార్తలు వెలువడ్డాయి. ఐతే ఈ సందర్భంగా వారిద్దరిమధ్య ఎలాంటి సంభాషణ జరిగిందన్న సమాచారం ఇంకా పూర్తిగా తెలియవలసి ఉంది. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్థాన్ ఆర్మీస్టాఫ్ చీఫ్‌తో అధ్యక్షుడు లంచ్ చేస్తారు' అని లంచ్‌కు గంటన్నర ముందుగా వైట్‌హౌస్ ప్రకటన విడుదల చేసింది. జి—7 సదస్సుకు వెళ్ళిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యప్రాచ్యంలో పరిణామాలు, ఉద్రిక్తతల నేపథ్యంలో తన పర్యటనను కుదించుకుని ఒకరోజు ముందుగానే మంగళవారం ఉదయానికల్లా వాషింగ్టన్‌కు చేరుకున్నారు. కాగా పాకిస్థాన్‌లో ఉన్నతాధికారులు ఈ లంచ్ సమావేశాన్ని అతిపెద్ద దౌత్యపరమైన విజయంగా ప్రకటించుకుంటున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com